శ్రీనాథుడు

# శృంగారనైషధం



శ్రీనాథకవి

# శృంగార నైషధం

# శృంగార నైషధం

వచన రచన :

పోలవరపు శ్రీహరిరావు

జయంతి పబ్లికేషన్స్
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002.

# SRUNGAARA NYSHADHAM

By :
**P. SRI HARI RAO**

**JAYANTHI PUBLICATIONS**
KARL MARX ROAD
VIJAYAWADA - 520 002.
Ph : **0866-2577828**
Mobile : **8978261496**

ó **PUBLISHER**

Edition :
**December - 2011**

PRICE : ₹ **45-00**

DTP :
**SRI SRINIVASA GRAPHICS**
VIJAYAWADA - 521 108.
Ph : 9440397989

Printers :

# శృంగార నైషధము

శ్రీకరమైన నిషధరాజ్యాన్ని వీరసేనుడనే రాజు పరిపాలిస్తున్న కాలం అది.

ఆ నిషధదేశపు యువరాజు నలుడు. శుక్లపక్షపు చంద్రునివలె అనుదిన ప్రవర్ధమానుడయిన నలుడు యువరాజుగా పట్టాభిషిక్తుడయ్యేనాటికే అతని కీర్తి దశదిశలా వ్యాపించింది.

అతని కీర్తి వేసంగిలో సూర్యకాంతి పట్టిన గొడుగుకంటె కాంతి వంతంగా భాసించింది. అతని ప్రవర్తన ప్రపంచ మంతటిలోనూ గల కల్మషాలనన్నింటినీ కడిగివేసేటంత పవిత్ర జలధిలా ఉండేది.

నలుడు తన భుజబలంతో పదునెనిమిది ద్వీపాలనూ జయించాడు. సకల విద్యలూ, సమస్త కళలూ అతని జిహ్వాగ్రాన నర్తిస్తూండేవి. నిగమాది విద్యలన్నీ దీక్షతో అధ్యయనం చేయడమేగాక, వాటి బోధనలను శిరసావహించి ఆచరించుతూ – సకల విద్యాసారానికి వన్నెదెచ్చేవాడు.

అతడు పరమేశ్వరుని అవతారమని ప్రజలు విశ్వసించేవారు. అందువల్లనే అతనిలో అష్టదిక్పాలుర ఉత్తమ లక్షణాలన్నీ పాదుకొన్నాయి. అయితే... కామసంచార గుణాన్ని జయించే శాస్త్ర విద్యా పారంగతుడు కావడం వల్ల నలుడు అష్టదిక్పాలుర కంటె దొడ్డవాడుగ, ఆ శాస్త్ర విద్యా త్రినేత్రుడుగ పరిగణింపబడేవాడు.

నలుడు తన ఏలుబడిలోని ప్రాంతాలన్నింటినీ వేయి కనులతో పర్యవేక్షిస్తూ, ఎక్కడా ఎవరికీ ఈతిబాధలు సోకకుండా చూస్తుండేవాడు.

అందువల్లనే అతని సామ్రాజ్యంలో దుఃఖాశ్రువులకు చోటు లేకుండా పోయింది. అయితే – అతని శత్రురాజుల రాణువల రాణుల కనులనుంచి మాత్రం అధిక వర్షాలు కురిసేవట!

అతడు రాజనీతి చమత్కృతితో మిత్రులను ఆకర్షించినట్లే, బలపరాక్రమాలతో శత్రువులను గూడ సమ్మోహింప జేసేవాడు. ఈ కారణం వల్లనే శత్రురాజులు క్రమంగా తమ శత్రుభావాన్ని మరచి నలుని గుణ గణాధిక్యతలను మెచ్చుకుంటూ దగ్గరి చుట్టాలుగా మారుతూండేవారట!

నలుడు యౌవనారంభ కాలానికే తన జుత్తుముడిలో యిమిడిన వెంట్రుకల సంఖ్యకు మించినన్ని విజయాలు పొంది, దశదిశల గల యేనుగులన్నింటి మోములమీదా జయశాసన ఫలకాలు కట్టించాడు.

కృతయుగంలో అధర్మానికీ తపశ్శక్తికీ మధ్య నిరంతరం సంఘర్షణ జరుగుతున్నందు వల్ల భూమి ఒంటికాలి చిటికెన వ్రేలిపై నిలబడి ఉండవలసి వచ్చేదట. కాని, నలుని పాలనాకాలంలో ధర్మదేవత నాలుగు పాదాలతో నడయాడుతున్నందున ఏ ఒక్కరూ తపస్సు చేయవలసిన అవసరమే లేకుండా పోయిందట!

బ్రహ్మ కొందరి మొహాలమీద 'ఇతడు దరిద్రుడు' అని వ్రాస్తాడు. అలాంటివారు నలుని వద్దకు వచ్చి చేయి చాస్తే అతడు బ్రహ్మవ్రాతకు పొల్లు వాటిల్లకుండా "ఇతడు దరిద్రమున దరిద్రుడు" అని నిరూపించేవాడట! అయితే – అతని దాతృత్వానికి రెండు కళంకాలున్నాయి. యాచించి వచ్చిన వారికి వెండికొండనే పంచి "తీసుకోండి" అనలేదు, సముద్రాలన్నింటినీ దానధారలుగా పోయలేదు. నల్లని పొడవాటి జుత్తును రెండు పాయలుగా తీసి భద్రంగా ముడి చుట్టుకున్న చందంగా వుండేవి ఈ రెండు కళంకాలున్నూ.

"ప్రపంచమంతటికీ నలుని కీర్తి, ప్రతాపాలు వెలుగునిస్తూండగా ఈ చంద్రుడూ, సూర్యుడూ ఎందుకులె"మ్మను కునేవాడట సృష్టికర్త. అలా అనుకున్నప్పుడే విధాత చంద్ర సూర్యుల్ని "కొంచెం తగ్గిపోయాయేమో! మరమ్మత్తు చేయాలేమో" నన్నట్టు ఆకాశం నుంచి తన వద్దకు రప్పించుకునేవాట్ట!

నలుని శరీరం కమ్మెచ్చు తీసిన ఉక్కులా ఉండేది. అతడు పొడగరి, దీర్ఘబాహుడు. ఆ చేతులు లోహపు సింహద్వార కవాటాల్ని ఒక్క గుద్దుతో బదాబదలు చేయగలంతటివి. అతని విశాల వక్షస్థలం అంతకంటె దృఢంగా ఉండేది. నలుని ప్రత్యంగమూ సౌందర్యవంతమే! అయితే పూర్ణ చంద్రునిలో కూడా కళంకాన్ని సృష్టించిన విధాత నలుని మోముమీద రోమాలను దిద్దాడు. ఆ జుత్తు నిగనిగలాడుతూ అతని అందాన్ని ఇనుమడింప చేసింది. యువతీలోకం అతన్ని "అపర మన్మథుడే" అనేవారు.

నలుని మోమునకు పూర్ణచంద్రుడు కూడా లొజ్జే! అతని వ్రేళ్ళు లేత మొలకలకంటె సుకుమారంగా ఉండేవి. ఎర్ర తామరపూల కాంతి అతని మేని ఛాయయందు దిగదుడుపే. లోహ, వజ్ర సన్నిభమైన శరీరం వెన్న, మీగడల కంటె లలిత లలితంగా కూడా మలచుకొన్నది నలుని రూపురేఖలలో.

అటువంటి నలుని గురించి ప్రతి స్త్రీ కలలు గనేది. మాటి మాటికి అతని పేరును తలచేది. భర్తలో ఆ నలుని రూపాన్ని ఊహించుకుని, ఆ తమకంతోనే పతి కౌగిలి కొరకు పరవశించని స్త్రీ లేదట!

ఆ నలుని రూపురేఖా విలాసాలు మన్మథునే జయించగలవని చూచినవారు; విన్నవారు కూడా పరవశించేవారు. స్వర్గంలోని దేవకాంతలు, నరకంలోని స్త్రీలు, పాతాళ లోకంలోని నాగినులు కూడా నలుని తలచుకొని ప్రణయభావంతో వివశులయ్యేవారు.

ఆ రాకుమారుని సుందరాకారాన్ని ప్రతిక్షణమూ రెప్పలల్లార్చకుండా చూస్తూ, మనసుల్ని కూడా అతని మీదనే లగ్నం చేసి కాలం గడపటం అలవాటయిపోయింది. ఆ అలవాటు వల్లనే వారికి "అనిమేషలు" (కనురెప్పలు మూయనివారు) అనే పేరు వచ్చిందేమో! స్త్రీ జనం "అతన్ని చూచినవే కళ్ళు. అతని గురించి విన్నవే చెవులు. లేకపోతే ఈ జ్ఞానేంద్రియాలు నిరర్థకం" అనుకునేవారు.

పగలు రేయి, జాగృత నిద్రావస్థలలో గూడ ప్రతి క్షణమూ నలుని గురించే యోచించే ఆనాటి స్త్రీలకు ఏ విధంగానైనా సరే అతని తలంపు దూరం కారాదనే కోరిక ఈరికలెత్తేది. పడకగదుల గోడలమీద నలుని ప్రతిరూపాన్ని చిత్రించుకునేవారు. ఆ చిత్రాన్ని చూస్తూ తమ కన్యత్వ గౌరవం భంగపడేట్టు ప్రణయభావాలు పెంచుకునేవారు. అంటి సుందరాకారునికి తాము తగుదురో లేదోనని అనుమానగ్రస్తులయ్యేవారు. ఆ అనుమానంతో అద్దాలు చేతబట్టి తమ ప్రతిబింబాలను చూచుకునేవారు.

ఆ విధంగా అద్దాలలో తమ ప్రతిబింబాలను చూచుకుంటూ, గోడల మీది నలచిత్రాల్ని చూస్తూ సంశయాత్మలతో ఆ యా కన్యలు విడిచే నిట్టూర్పు గాడ్పులకు ఆ యా అద్దాలు మసకబారి పోతూండేవి. అయితే – విదర్భరాజగు భీమసేనుని పుత్రి దమయంతి చేతి అద్దానికి మాత్రం అలాంటి దుర్గతి పట్టలేదు.

## దమయంతీ హృదయము

**గు**ణ గణ రూప రేఖా లావణ్య విలాసములందు ఈడు జోడైన వారిపై దండెత్తడమే జీవితంగా పెట్టుకున్న మన్మథుడు – నలునిపై మరులుగొన్న దమయంతి హృదయాన్ని అనువుగా చేసుకుని, చెఱకు వింటితో పుష్ప శరాలను గురిపెట్టి కురియించసాగాడు.

దమయంతి అప్పుడప్పుడూ నలుని గురించి ఎంతో వింది. విన్న విశేషాల కారణంగానే అతన్ని మనసా వరించి, మనసులో నిలుపుకుంది. ఆ అనురాగం రోజురోజుకు పెరుగుతూంది. మనసంతా అతని తలంపులతోనే నిండి, అతనికే అంకితం అయిపోయింది.

విదర్భాధీశుని కొలువుకు యెందరెందరో కవి పండిత వందిమాగధ యాత్రికులు వస్తూండేవారు. వచ్చి భీమసేనునాజ్ఞపై దేశ దేశాల వార్తా విశేషాలు వివరించేవారు. అలాంటి సందర్భాలలో అగంతకులు వివిధ రాకుమారుల శక్తి సామర్థ్యాలను, రూపురేఖా విశేషాలను అభివర్ణించేవారు. ఎడనెడ నిషధ రాకుమారుడైన నలుని గురించి విన్నప్పుడు దమయంతి శరీరం జలదరించి, రోమాంచలాలు నిగిడేవి; స్థనద్వయం ఉప్పొంగి తమ పై వస్త్రాన్ని పిటపిట లాడించేవి.

నలుని కలుసుకుని ప్రణయలీలలో తలమున్కలు కావాలని నిరీక్షిస్తున్న దమయంతికి హేమంతకాలపు పగళ్ళు కూడా యుగాలంత దీర్ఘంగా తోస్తున్నాయి; పైగా వేసంగి కాలపు పగళ్ళవలె తాపాన్ని పుట్టిస్తున్నాయి.

దమయంతి చెలులతోగూడి మన్మథునికి అభిషేకాలు చేయసాగింది. నలునిపేరు యే కొంచెం వినిపించినా శరీరమంతా చెవులే అయినట్టు ఆసక్తితో వినేది. నిషధదేశం నుంచి యాత్రార్థం వచ్చే బ్రాహ్మణోత్తములకు స్వయంగా అతిథి మర్యాదలు జరిపి పూజించేది. వారిని తన మనోహరుని గురించి కుశలప్రశ్నలడగాలని ఉవ్విళ్ళూరుతూనే సిగ్గుతో మిన్న కుండేది.

ప్రతిక్షణమూ ప్రియుని ధ్యాసతోనే గడుపుతూ ఉండడం వల్ల వీణను సారించేసరికి నలుని కీర్తించే పాటే జాలువారేది. ఉత్తమ చిత్రకారులచేత తన

మందిరం గోడల మీద ప్రేయసీప్రియుల చిత్తరువులు సమ్మోహనకరంగా వ్రాయించింది. ఒక్కొ చిత్తరువును చూస్తూ అందలి మగడు నలుడని, మగువ తానేనని ఊహించుకుంటూ సురుచిర సుందర ప్రణయ భావాలతో హృదయం నింపుకునేది.

సఖియలతో గూడి యాడుచున్నప్పుడు ఆటలమధ్య హఠాత్తుగా "మన్మథు నంతటి చక్కని రాకుమారుడెవరో చెప్పుకోండి చూద్దాం" అని పొడుపు కథలాగా ప్రశ్నించేది. దమయంతీ హృదయాన్నెరిగిన చెలులు వెంటనే "నలుడు తప్ప మరెవరు!" అనేవారు. దమయంతి అంతలోనే లజ్జాభారంతో పొదరిండ్ల చాటుకు పారిపోయేది.

ఉదయ మధ్యాహ్న సాయంకాలాలలో చెలియలతో బొమ్మల పెండ్లిండ్ల ఆటలాడుతూ మధ్య మధ్య తానే వధువై, నానా దేశ రాకుమారుల పేరు పేరున బొమ్మల జేయించి, స్వయంవర పద్ధతి అంటూ నలుని బొమ్మకు పూలమాలలు వేయించి పెండ్లి తంతు జరిపించుతూండేది. త్రికాలములందు తన వెంట నుండు చెలులు, పరిచారికలు లేని రాత్రులందు నలుని ఊహాలోకములో ఆహ్వానించుకొని, హంసతూలికా తల్పముపై ఒయ్యారము లొలుకుచు భావుక ప్రియునితో సయ్యాటలతోను, సంభాషణా చమత్కృతులతోను ఎంతోకాలం గడిపేది.

మన్మథుని పుష్పబాణాల తీయని వేడిమితో పులకలెత్తని యంగములేక దమయంతి నిరంతరము నలుని సమక్షమున నున్నట్లే ఎంచుకొంటూ పరవశం చెందేది. ఆ పారవశ్యంలో కూడా నలునిపట్ల విరహవేదన పొందేది. అందువల్లనే ఆరు ఋతువులు కూడా ఆమెకు భరింపరానివే అవుతున్నాయి.

# నలుని ఆంతర్యము

**ని**షధ రాజకుమారుడు కూడ విదర్భ రాజకుమారియగు దమయంతిని గురించి ఎంతో విన్నాడు. ముత్యాల విశిష్టత వాటిని చూడగానే తెలుస్తుంది. అదేవిధంగా విన్నదాన్ని బట్టే దమయంతి రూపురేఖా విలాసాలు, గుణగణాలలో గల ఆధిక్యత దొడ్డదని నలుడు గుర్తించాడు. ఆ యువకుని మనసు ఆ యువతీ రత్నంవైపు మొగ్గింది. అతని అంతరంగంలో ఆమె సురుచిరమూర్తి తీయగా వెచ్చగా నర్తించసాగింది. మన్మథుని పుష్ప బాణావళి నలుని హృదయంలో మృదుమధుర భావాలను వర్షిస్తున్నది.

దమయంతి గుణగణాలు వింటుంటే నలుని శ్రవణేంద్రియాలు అతని హృదయంలో వసంత హేలను సృష్టిస్తున్నాయి. మన్మథుని చెవులకు తాను సారించిన చెఱుకువిల్లు గుణధ్వని వసంత ఋతువును సృష్టిస్తున్నంత మధురంగా ఉంటున్నది.

ఎంతటి శక్తి సామర్థ్యాలున్న శత్రురాజులను గూడ అవలీలగా యౌవనప్రాయమందే  జయించిన నలుని తాను జయించుట దుర్లభమని మన్మథుడు మొదట శంకించాడు. తానెంత యోధుడైనా – తను పట్టినది చెఱకువిల్లు – బాణములేమో పూవులేనాయె ! ఇట్ట సున్నితాయుధాలతో నలునంతటి అజేయుని జయించుట సాధ్యము కాదేమో అనుకున్నాడు. కాని నలదమయంతులను జోడుగూర్ప నెంచిన బ్రహ్మదేవుడు మన్మథునికి బాసటగా నిల్చి పూలబాణములతోనే నలుని జయింపజేసినాడు.

తన పుష్పబాణంతో ఆ బ్రహ్మనే తామరాకు పడకపై నున్న సరస్వతి పజ్జను పడునట్లు కొట్టగలిగిన మన్మథుడు – తుమ్మెదరెక్కలు తగిలీ తగులని

పూలబాణాలతో అప్పుడప్పుడే విరహవేదనలోని సుఖానుభూతిని తెలుసు కుంటున్న నలుని హృదయాన్ని జయించాడు.

బాలికల వక్షస్థలాలు పదునాలుగేండ్ల వయసు వరకు ఉండే తీరు బాలుర ఛాతీల చందమేగాని – ఆ తరువాత మాత్రమే చెప్పీ చెప్పక రూపొందే కుచద్వయం ఇతర అంగాంగకాలకంటె ప్రాముఖ్యత వహిస్తాయి. అదే విధంగా యౌవనారంభ కాలం వరకు ప్రణయ విశేష భావాలే పొడసూపని నలుని హృదయంలో ఇప్పుడు దమయంతి మెత్తని పీఠం వేసుకుని వెచ్చగా కూర్చుని మధువులూరిస్తున్నది.

రేయింబవళ్ళు దమయంతిని గురించే ఆలోచిస్తూండడం వల్ల నిద్ర రావడంలేదు. అందువల్లనే నలుని కనుగొలకులు ఎర్రబారాయి. కాని ఏ సఖుడడిగినా 'కర్ణకుండలాలలో గల మాణిక్యాల కాంతులు నా కన్నులలో ప్రతిఫలిస్తున్నాయేమో' నని సాకు చెప్పసాగాడు. అతడు విరహవేదనతో తరచుగా నిట్టూరుస్తూంటె సఖులు సందేహించుతారని 'రాచకార్య సమస్యల్ని గురించి మదన పడుతున్నా'ననేవాడు. 'ఒడలు మరీ నల్లబడుతున్నట్టున్న' దనే సాకుతో అంతర్యంలోని విరహవేదనా వేడిమి సలయించుకోడానికి మంచి గంథంలో పన్నీరు వంటి సుగంధ ద్రవ్యాలు కలిపి ఒళ్ళంతా పూయించుకునేవాడు. పైగా వజ్ర వైఢూర్యాదులు పొదవిన భూషణాలన్నీ తీసివేసి మంచి ముత్యాల చల్లని దండలే ఎక్కువగా ధరించసాగాడు. ఆ విధంగా తన మనసులోని వలపు మరెవరికీ తెలియకుండా దాచుకుంటున్న నలుడు; వెన్నెలలు కాస్తున్న చంద్రునికీ, తాను పవళించే తల్పానికీ మాత్రం 'మీరే సాక్షులు' అని హెచ్చరిస్తూ దమయంతిని గురించి పదే పదే చెప్పసాగాడు.

# వాహ్యాళి

**మ**దన శరముల దాడికి మరీ లొంగిపోతున్న నలుడు ఒకనాడు ఉపవనాల్లో విహరించితే కొంత తాపం తగ్గుతుందేమోనని బయలుదేరాడు. ఉత్తమ లక్షణాలు గల తెల్లని అశ్వానెక్కి ఠీవిగా ఆయన బయలుదేరే సరికి తగు మాత్రంగా అంగరక్షకులు, సఖులు, భటులు కూడా తగు గుర్రాలమీద రాకుమారుని వెంట నడిచారు.

నలుడావిధంగా పురవీధులగుండా వెళుతుంటే స్త్రీ పురుషులు కళ్ళప్పగించి తదేకంగా ఆయన్ని చూస్తున్నారు. అతడెక్కిన గుర్రము పురాన్ని దాటినప్పటినుంచి నానావిధ చమత్కృతులతో నర్తిస్తూ, తన గిట్టల తాకిడిచే ధూళిని పొగలా ఎగజిమ్ముతూ, అతి వేగంగాను అందంగాను కదలి పోసాగింది. అనేక ప్రాంతాలలో చాలాసేపు వాహ్యాళి చేసి తోడవచ్చిన పరివారాన్ని ఒకచోట విశ్రమించుడని చెప్పి, నలుడొక్కడే ఒక మహావనంలోకి వెళ్ళాడు.

ఆ వనంలోని వృక్షాలు ఎత్తుగా, ఒత్తుగా పెరిగి యుండడం వల్ల ఎటుచూచినా చల్లని నీడలు తప్ప ఎండ కనిపించడం లేదు. అలాంటి వనంలో కొంతదూరం వెళ్ళేసరికి నలునికి అనేక మొగలిపొదలు కనిపించాయి. బంగారు చాయను ఓడించగల పసిమిరంగులోనున్న మొగలిపూలను జూచి నలుడు పుష్పబాణశరుడైన మన్మథుని మనసులో తిట్టి పోసుకున్నాడు. 'కమ్మని తేనె ఉత్తమ సుగంధములు నిండియున్న ఈ పూవును మానవులు కోయబోతే చేతులు చీఱుకు పోతాయ్. కాని – ఇలాంటి పూవులనే కదా మన్మథుడు బాణాలుగా విసిరేది' అనుకున్నాడు.

నలునికి మరొకచోట ఆరముగ్గిన దానిమ్మ ఫలాలు వ్రేలాడుతున్న చెట్టుకూడా కనిపించాయి. వాటిని చూడగానే దమయంతి స్తనకుంభాల్ని చూచినట్టుగా ఉత్సాహాతిశయం పొందాడు. చిలుకలు వచ్చి ఆ దానిమ్మ

గింజలు ఆరగించాలని పండ్లను పొడిచి పోతున్నప్పుడు – అవి అటునిటు కదులు తున్నాయి. మన్మథుని పుష్పశరాలు తగిలి దమయంతి కుచాలు గగుర్పొడుస్తున్నా యనిపించింది అతనికి.

ఆ వనంలో గురువింద తీగలు పొదల్లా అల్లుకుని వేలాది పూలు పూచి ఉన్నాయి. సంపెంగ చెట్లున్నూ పొదల్లా పెరిగి ఉన్నాయి! సురపొన్నలు, కదంబములు, చంపకములు, నాగకేసరములు మొదలగు నానా విధ పుష్ప జాతులున్నాయి. పెంపుడు చిలుకలు కైవారాలిస్తున్నాయి. కోయిలలు శుభ ప్రదమైన పాటలు పాడుతున్నాయి.

నలుడు నీటి చెలమల ప్రక్కను, బావుల అంచులమీదను పూపొదరిండ్ల నీడలలోను విశ్రమించుతూ మెల మెల్లగా తిరుగుతూంటే అలసట, వేడిమి తొలగిపోయాయి. పూల పుప్పొడుల మథు సుగంధాల్ని మోసుకు వస్తున్న చిరుగాలి అలలు నలుని హృదయానికి ప్రశాంతిని, ఆనందాన్ని కల్పించాయి.

అతని కొకచోట ఒక పెద్ద కొలను కనుపించింది. ఆ కొలనులో తామరతూండ్లు, పద్మాలు, ఎర్రకలువలు, నీలికలువలు శోభాయమానంగా ఉన్నాయి. లోన తిమింగిలాలు, చేపలు, తాబేళ్ళు, మొసళ్ళు తిరుగాడు చున్నట్లుగా తటాకమంతటా కెరటాలు లేచి అందంగా జాలువారుతున్నాయి. ఆ అలలమీదకెక్కి ఆడుకోవాలని పోటీలు పడుతున్నట్లు హంసలు కోలాహలం చేస్తున్నాయి.

నలుడు ఆ తటాకాన్ని చూచి మెచ్చుకుంటూ, ఉల్లాసంగా దాని ఒడ్డున తిరుగాడసాగాడు. ఒకచోట ఒక ఇసుకతిన్నె తటాకంలోని నీటి కంటే కొంచెం ఎత్తుగా ఉంది. ఆ తిన్నె బాగా పాచిపట్టి ఉంది. దానిమీద ఒక తామరతూడు, పెద్ద ఆకూ నిలచి ఉన్నాయి. వాటికి పెనవేసుకున్నట్టు ఒక రాజహంస ఉండడాన్ని రాకుమారుడు చూశాడు.

ఆ రాజహంస కంఠనాళం ఆ తామరతూడుపై గల గరుకులను ఒరుసుకుంటూంది. ఆ తామరాకు నీడ ఆ హంసకు గొడుగు పట్టినట్లుంది. ఆ హంస ఒంటికాలిమీదనే నిలచి, రెక్కలను విశాలంగా దిగజార్చి ముక్కు పుటాలను దిగువకు వంచుకుని నిమీలిత నేత్రాలతో నిద్రపోతున్నట్టుంది. దాని రెక్కలమీద చిన్న ఈకలు తటాకంలో ఎగసిపడుతున్న కెరటాల గాలికి రెపరెప లాడుతున్నాయి. ఆ రాజహంస రెక్కలు బంగారు రంగుతో మెరుస్తున్నాయి. ఇంతటి చక్కని రాజహంసను ఎలాగైనా పట్టుకుని వశం చేసుకోవాలనుకున్నాడు నలుడు.

## హంసనుబట్టుట

శ్రీ మహావిష్ణువు వామనావతారమెత్తినట్లు నలుడు తన శరీరాన్ని కుంచించుకుని మెల్లమెల్లగా, నిశ్శబ్దంగా నడిచి వెళ్ళి రెండుచేతులా ఆ రాజహంసను పట్టుకున్నాడు. ఆ కాంచనహంస వెంటనే మేలుకుని తత్తర పడింది. తన కంఠాన్ని ఎవరో కోస్తున్నట్టు బిగ్గరగా అరచింద. ఎలాగయినా తప్పించుకుపోవాలని కాళ్ళు గింజుకుంది. రెక్కలు సాచి ఎగర బోయింది. ముక్కుతో నలుని చేతులను కరచింది, కాలి గోళ్ళతో గీరింది, అటు నిటు చూస్తూ చికాకు పడుతున్నది. రాకుమారుని పట్టునుంచి విడిపించుకోలేక గోల చేస్తున్నది.

ఈ గోలకు ఆ తటాకంలో ఇతర హంసలు - లక్ష్మీదేవి కాలి యందెల సవ్వడుల వలె అరుస్తూ ఆకసాని కెగసిపోయాయి; గూళ్ళలోని పక్షులు హాహాకారాలు చేస్తూ పైకెగిరాయి; పైకెగిరినవన్నీ మరింత గగ్గోలుగా అరవసాగాయి.

నలుని చేతులలోని రాజహంస తనను పట్టగలిగిన వానిని అబ్బురంగా చూస్తూ మానవ భాషలో ఇలా మాట్లాడసాగింది,

“ఓ రాజా! నా రెక్కల అంచులందున్న బంగారానికి ఆశపడే యీ పని చేశావా ? ఒక్క నీటి బిందువువల్ల సముద్రానికేం ఒరుగుతుంది. ఈ కొంచెం బంగారంతో నీకేపని జరుగుతుంది? నీవు ఈ దగ్గరలో ఎక్కడో ఉంటావని నాకు తెలుసు. నేను పొరపాటుగా ఇక్కడ నిద్రపోవడం లేదు. నీవు ప్రపంచ ప్రజలందరిచేతా గౌరవింపబడే ఉత్తముడవు గదా అని నిశ్చింతగా నిద్రపోయాను. నమ్మిన పగవారికైనా గొప్పవారు హాని చేయరుగదా?

నీకు జీవులను హింసించడమే ఆనందకరమైతే కారుణ్యానికి నిలయమైన ఈ తటాకంలోని హంసనే చంపవలసిన అవసర మేమున్నది? భుజబలంతో గర్వించి నిరంకుశంగా ప్రవర్తించే శత్రురాజులు మీకీ లోకంలో ఇక కనుపించరా ? అలాంటి వారిని హింసించి ఆనందించ వచ్చునుగాని, పూవులూ పళ్ళూ కందమూలాలు మాత్రమే తిని బ్రతుకుతూ మునుల్లాగా ఈ సరోవరంలో తపస్సు చేసుకుంటున్న నాబోటి వాళ్ళమీద దండెత్తడం తగునా?

అంతేగాక – నా తల్లికి నేనొక్కడినే సంతు. ఆమె చాలా పెద్దది, మూడుకాళ్ళ ముసలమ్మ, కళ్ళు కూడా కనుపించవు. నా భార్య అమాయిక, అన్నెం పున్నెం ఎరుగని ఇల్లాలు, మహాపతివ్రత; వెనుక ముందుల బంధువులు కూడా లేరు. మా పెళ్ళి జరిగిన చాలా కాలానికి పిల్లలు పుట్టారు. వారినందరినీ పోషించడానికి నేనొక్కడినే దిక్కు . అందువల్ల దయతో నన్ను వదలవలసిందని ప్రార్థిస్తున్నాను.”

ఈ విధంగా నలుని వేడుకున్న ఆ రాజహంస తల్లిని, భార్యను, సఖులను, బిడ్డలను తలచుకొని దీనాతిదీనంగా విలపించసాగింది. నలుడు దయతలచి దానిని విడిచిపెట్టి ‘రాజహంసా! వెళ్ళు సుఖంగా బ్రతుకు’ అన్నాడు.

# హంస కృతజ్ఞత

**ఆ** విధంగా రాకుమారుని పట్టునుండి విముక్తి పొందినందుకు ఆ రాజహంస పొందిన ఆనందాన్ని వాక్కులతో చెప్పలేము. మనసున ఊహించ లేము. చుట్టాలు, స్నేహితులు అందరూ చూస్తూండగా హఠాత్తుగా దెబ్బతిని కూలి ప్రాణాలు కోల్పోయినదానికి మళ్ళీ జీవం వచ్చినంత సంబరం పొందింది.

ఆ సంతోషంతో ఆ రాజహంస రెక్కలల్లార్చి, ఒడలు విదలించుకొని, ముక్కుతో అంగాంగకాలను సవరించుకొని, పైకెగసి, వేగంగా ఆ తటాకంలో వ్రాలి అలలపై తేలియాడసాగింది. అలా ఆడుతూ కొత్తగా వికసించిన పూలలోని తేనెలు త్రాగింది, తీగల తంపరవంటి కలువ కాడలలో దూరింది, ఇతర పక్షులతో పోటీపడినట్లు అటు నిటు పరుగెత్తింది.

రాజహంస కొంతసేపు ఆ విధంగా ఆడుకున్న తరువాత మరల నలుని దగ్గరకు వచ్చింది. అతడు చేయిసాచి దానిని సవరించి పట్టుకున్నాడు. అది మెల్లగా ఇట్లు చెప్పసాగింది.

“రాజులు వేటాడు సందర్భమున చేపలను, పిట్టలను, మృగములను చంపినను పాపమునొందరని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. నన్ను పట్టుకొని గూడ విడిచి పుచ్చినందులకు మీకు ప్రత్యుపకారము చేతుననుట నా అంతస్తుకు మించినమాట. అయినను మీకొక సహాయము చేయుదును. మీరు కోరకుండ లభిస్తున్న దానిని వలదను నవసరము లేదు. ప్రపంచ మంతటికి నాయకుడవైన మీబోటివారిని నాబోటివారు ఉపకారము చేయవలెనని ఆశించరు. కాని నా కృతజ్ఞతను వెల్లడించుకొనవలెనని ఆశగా నున్నది. ఇది చిన్నది పెద్దదని ఆలోచించక నే చేయదలచిన సహాయమును గురించి వినండి.

విదర్భదేశాన్ని పాలిస్తున్న భీమసేనుడు సార్థక నామధేయుడు. దేవేంద్రుడంతటి మంచి పేరు గలవాడు. ఆయనకు దమనుడను ముని

వరప్రసాదము వలన ఒక ఆడపిల్ల కలిగినది. ఆమె పేరు దమయంతి. లోకంలోని స్త్రీలందరి అందచందాలనూ మించిన అందగత్తె ఆమె. ఆమె గుణగణములు వర్ణించుటకు బ్రహ్మకైనను, సరస్వతికైనను సాధ్యము కాదు.

ఆమె తల వెంట్రుకలు శివుడైన మెచ్చగలంత అందముగా నుండును. ఆమె కనుల చూపులకు ఓడినందువలననే లేళ్ళు తమ చూపుల నొకచోట నిలుపలేకున్నవి. ఆమె అందచందాలను చూస్తూ చందమామ కళలు కోల్పోయాడు, లేళ్ళు పచ్చిక తినడం మరచిపోయాయి. సృష్టికర్త చంద్రబింబం లోని సారన్నంతటినీ ప్రోగుచేసి ఆ దమయంతి ముఖబింబాన్ని రూపొందించా డనిపిస్తుంది. ఆ చంద్రబింబంలోని చల్లదనము, అందమూ కూడా దమయంతి మోములోని అందచందాల ముందు దిగదుడుపే.

దమయంతి కనుబొమలు రతీమన్మథుల వింటిబద్దలవలె ఒయ్యార ములు, ఆమె కుచములు కాంతి అనే సముద్రంలో ఈదుతున్న కామ యౌవనము లనిపించును. నడుము పిడికిలియంత మాత్రమే. ఆమె కురులు యువకుల హృదయాలలో కేళీవాంఛ పెంపొందింపజేయునట్టివి. ఆమె చేతులు కలువతూడులంతటి కోమలములు, పాదములు పద్మసమానములు. ఆమె పిరుదులు లావూగాక, సన్నమూగాక మురుస్తూంటాయి. ఆమె తొడలు అరటిబోదెలను గేలి చేస్తూంటాయి. వేయిమాటలెందుకు, ఆమె అన్ని విధాలా నీకు తగిన కన్య.

నేను వారానికొకసారి లోకాలన్నీ తిరిగి వస్తూంటాను. అనేక నదీ నదాలలో ఈదులాడుతూ, నానా విధ ఫలపుష్ప వనాలలో విహరిస్తూ అద్భుత విశేషాలెన్నో తెలుసుకుంటూ ఉంటాను. దేవేంద్రుని అమరావతి వలె నున్న భీమసేనుని కుండినపురములో అసాధారణ సౌందర్యవతియగు దమయంతిని చూశాను.

ఆమెను చూడగానే దేవకాంతల సౌందర్యములన్నీ దమయంతి అందం ముందు దిగదుడుపే అనుకున్నాను. ఈమెకు తగిన వరుడెవరని బ్రహ్మ తలపోయుచుండెనోయని ఆలోచించుచు. ఆశ్చర్యముగ నామెనే చూచుచుంటిని. తరవాత దేశదేశాల్లో నే జూచిన రాకుమారుల నందరినీ మనసుకు దెచ్చుకొని ఆమెకు తగరని యొక్కొక్కరినీ మనసునుండి తొలగించుకొంటిని. లోకాలోకములన్నియు తిరుగాడుచు నే జూచిన వారిలో నీ ఒక్కడవే దమయంతికి అన్ని విధాలా తగిన జోడువని భావించితిని. ఇప్పుడు మిమ్ము స్వయముగ జూడగానే ఆ యువతికూడా గుర్తు వచ్చింది.

ఆ దమయంతి జతగా లభించకపోతే నీ సౌందర్యం – సువాసనలేని పువ్వులాగా, కోయిల కూయని వనంలాగా నిష్ఫలం అవుతుంది. యువరాజు లందరూ తనకు కావాలంటే తనకే కావాలని పోటాపోటీలు పడుతున్న ఆ దమయంతిని నీకు జతచేసే నేర్పు నాకుంది. నీ గుణ గణ సౌందర్యాలను గురించి ఆమెకు నచ్చచెప్పి నిన్ను తప్ప మరెవరినీ వరించకుండు నట్లు చేయగలను. కనుక నా చేత ఈ పని చేయించుకోండి."

ఆ దేవలోకపు హంస చెప్పిన మాటలు నలునికి తేనె వాకలుగా తోచాయి. అతడు చిరునవ్వు లొలికిస్తూ, తన అరచేత్తో హంసమూపును నిమురుతూ ఇలా అన్నాడు :

"పక్షిరాజా! ప్రపంచంలో ఏ వస్తు విశేషమూ కూడా నీ అందానికి సాటికాదు. నీ మంచితనాన్ని మాటల్లో చెప్పలేము. నీ మాటలు కూడా నీ రెక్కలవలె బంగారంలా ఉన్నాయి. మురిపెంగా నడవటంలోనే గాక మంచపనులు చెయ్యడంలో కూడా నీకు ఆధిక్యత ఉంది. ఎంతో వేదన పడుతున్న నా హృదయానికి నువ్వు చల్లనిగాలి వీచ వచ్చావు. నేను పూర్వపు జన్మలో ఎంత తపస్సు చేసిన ఫలితమో ఇది అనిపిస్తున్నది.

మూడులోకాల్ని సమ్మోహింపజేయగల ముదిత లందరికంటె సుందరియైన దమయంతిని గురించి ప్రజలు గొప్పగా చెప్పుకుంటూంటే లోగడ విన్నాను. ఆమెను గురించి నువ్విప్పుడు చెబుతూంటే ఆమెను స్వయంగా చూస్తున్నట్టే ఉంది. నేను నా కళ్ళతోనే చూచినా ఆమె అందాలింతటివని గ్రహించగలిగేవాడనో లేదో, అలంకార ప్రాయంగా ఉండి పోవలసిన వాళ్ళకంటె నా హృదయానికి నీ సహృదయంతో ఆమెను చూపించావు.

ఆమె సుగుణాలను గురించి నీవు చెప్పిన మాటలు నా చెవులకు తేనెవాక లయ్యాయి. నీవు ఆమె రూపు రేఖా విలాసాలను వర్ణించేసరికి నా హృదయం మన్మథుడు సృష్టించిన అగ్నిజ్వాలలో దూకిన కట్టెలా అయిపోయింది. నా ధైర్యమంతా సడలిపోయింది.

నెలనెలా క్రమం తప్పకుండా చందమామ సూర్యుని చాటుకు వెళ్ళి కౌగలించుకుంటున్న దెందుకో నీకు తెలుసా ? నేను చంద్రవంశజుణ్ణి గదా! విరహం వల్ల వెన్నెలల వేడికి నా శరీరం మరీ మగ్గిపోకుండా చెయ్యాలనే జాలితోనే చందమామ అలా చాటుకు తప్పుకుంటున్నది.

మోహం, విరహతాపం నా హృదయాన్ని తూట్లు పొడుస్తున్నాయి. మన్మథుని బాణాలు నిజంగా పూలు, మొగ్గలేనా లేక ముళ్ళూ, పిడుగులూనా అనే సందేహం కలుగుతూంది. పూవులు సువాసనలిస్తున్నాయో, విష వాయువుల్ని విసురుతున్నాయో శంకగా ఉంది. ఒడ్డూ గట్టూ కనిపించని విరహసముద్రంలో మునిగిపోతున్న నాకు నువ్వు తెప్పలా దొరికావు. నీబోటి పెద్దలు పరుల సేవకే జీవితాన్ని వెచ్చిస్తారు కదా! నీవు వెళ్ళి కార్యం సాధించుకురా. నీవు తిరిగి వచ్చేవరకూ నేను ఇక్కడే వేచి ఉంటాను. వేగంలో నీ సామర్థ్యం ఎంతటిదో తెలుస్తుందిలే!"

నలుడీవిధంగా ఆ రాయంచను పొగిడి, ఉబ్బించి, పంపించి ఒక పొదరింటి నీడను గల చలువరాతి తిన్నెమీద విశ్రాంతి తీసుకుంటూ, ఆ హంస చెప్పిన మాటలనే మననం చేసుకుంటున్నాడు.

## హంస ప్రయాణము

**ఆ** హంస నలునివద్ద నుండి ఆకాశంలోకి ఎగిరి సరాసరి విదర్భదేశపు రాజధాని యగు కుండిన నగరం వెళ్ళసాగింది. అది అలా వెళుతుంటే దిగువనున్న దేశస్తులకు తమ పనులు సఫలం కాగలవనే శుభ శకునాలు కనిపిస్తున్నాయి. చల్లని సువాసనలు వ్యాపిస్తున్నాయి. అది రెక్కలల్లార్చి వేగాన్ని పెంచినప్పుడు ఆకసమంతటా తుఫానుగాలి వీచినట్లు సందడి వినబడుతూంది. రాయంచ వేగంగానే క్రిందికి దిగుతున్నప్పుడు దాని రెక్కలు సృష్టించిన గాలి ఒత్తిడి తగిలి నేలపైనున్న పక్షులు గడగడ వణికిపోతున్నాయి. దాని దోవలో ఉన్న మేఘాలు దూదిపింజెల్లా ఎగిరి ఆకసంలో దాక్కుంటున్నాయి. ఆ హంస ఆ విధంగా అనేక అడవులు, కొండలు, నదులు, దేశాలు దాటి కుండిన నగరాన్ని చేరుకుంది.

ఆ నగరం చుట్టూ ఒక ఉప్పునీటి సముద్రం ఉంది. ఆ నగరంలోని సౌధాగ్రాలపై గల గోపురాలు బంగారపు మలాముతో ధగధగ మెరుస్తున్నాయి. నగరం చుట్టూ బంగారపు కొండవలె ప్రాకారము గోడలు నిలచి ఉన్నాయి. ఆ ప్రాకారం వెలుపల పాతాళలోక మంతటి లోతైన కందకాలున్నాయి. ఆ కందకాల నీటిలో మొసళ్ళు మందలు మందలుగా ఉన్నాయి.

ఆ నగరంలోని గృహాలు అద్దాలవంటి స్ఫటికశిలలతో నిర్మించబడ్డాయి. సౌధాలు చలువరాళ్ళతోను ఎర్రని రాళ్ళతోను అంతస్తులంతస్తులుగా మలచబడ్డాయి. ఇంద్రనీలమణుల వంటి రాళ్ళతో నిర్మింపబడిన విశ్రాంతి శాలలు కూడా ఉన్నాయి. అక్కడక్కడా యువతులు కుచాలపై పూసుకున్న

రకరకాల సుగంధద్రవ్యాల వాసనలు గుభాళిస్తున్న స్నాన తటాకాలు కనిపించాయి. విరగబూసిన పూ లతలతో నిండి సుగంధాల్ని వ్యాపింపజేస్తున్న ఉద్యానవనాలెన్నో ఉన్నాయి. గుర్రాలకు ఏనుగులకు, రధాలకు ప్రత్యేక శాలలున్నాయి.

ఆ నగర వీధులలో కస్తూరి, కుంకుమ, పటిక, పచ్చకర్పూరము సంకుమదము (పునుగు), జవ్వాజి, పన్నీరు వంటి సుగంధ ద్రవ్యాలమ్మే అంగళ్ళు చాలా ఉన్నాయి. అనేకమంది స్త్రీలు అందంగా హావ భావ విలాస సంభ్రమాలతో తిరుగాడుతున్నారు. అనేక రకాల గుర్రాలు, ఏనుగులు అటునిటు తిరుగుతున్నాయి.

రాజహంస ఈ అందాలను, వైభవాన్ని చూచి ఎంతో ఆనందపడింది. తాను వచ్చిన పనిమీద ఆ రాయంచ రాచనగరులోని కన్యాంతఃపుర సమీపంలో ఎగురుతూ క్రిందికి చూచింది. ఒక సుందరోపవనంలో చుక్కల మధ్య చందమామలాగా చెలుల మధ్య నున్న దమయంతి కనిపించింది.

ఆ రాయంచ సంతోషాతిశయంతో రెక్కలల్లార్చి, బంగారపుటంచు గల తెల్లని చామరాలవలె ఆడించుకుంటూ పల్లటీలు కొడుతూ, అతివేగంగా దిగుతూ, దమయంతి మోము చుట్టూ ఆశ్చర్య సంభ్రమాలు కలిగేట్టు ప్రదక్షిణాలు చేసింది. వెంటనే రెక్కలను ముడుచుకొని కొద్దిదూరంలో క్రింద వాలింది.

అంతకు ముందు ఏదో సరస సంభాషణలలో మునిగివున్న ఆ యువతుల మనసులకు రాయంచ ఆకసం నుంచి దిగుతున్నప్పుడైన సవ్వడి దుందుభి ధ్వనిలా వినిపించింది. వారెంతో గాభరా పడుతూ ఆ ధ్వని వినవచ్చిన వైపు చూశారు. అంతలోనే చిత్ర విచిత్ర లాస్యాలతో క్రిందికి దిగిన ఆ రజహంస"ను విడ్డూరంగా చూడసాగారు..

"ఇదేదో దేవతావతారంలాగుందే!" అనుకున్నారు. దమయంతి మాత్రం ఆ రాయంచను పట్టుకోవాలనే కుతూహలంతో మెలమెల్లగా దగ్గరకు వెళ్ళసాగింది. రాజహంస ఆ రాకుమారి మనసెరిగినట్లు ఆమె దగ్గరకంటా వచ్చి చేయి సాచిన తరవాత అందకుండా తప్పించుకుంటూ, రయమున పైకెగసి, అంతలోనే క్రిందికి దిగి నిలచి, మరల దమయంతి కందినట్లు నటిస్తూనే అందకుండా ఎగిరిపోతున్నది.

ఎంత ప్రయత్నించినా రాకుమారి ఆ రాయంచను పట్టుకోలేక నానా అవస్థా పడుతూంటే చెలికత్తెలు పకపక నవ్వుతూ, చప్పట్లు చరుస్తూ, ఎగతాళి చేస్తున్నారు. అటు రాయంచ అందినట్లే అంది తప్పించుకుంటూ గిరికీలు బెడుతున్నందుకూ, ఇటు చెలియలు గేలి చేస్తున్నందుకూ దమయంతి చికాకు పడుతూ "మీరు గల్లంతు చేసి, చప్పట్లు కొట్టి ఆ పిట్టను బెదరగొట్టినారు. అందువల్లే అది నాకు చిక్కడం లేదు. ఇట్లా చేస్తే 'మీకేం లాభం ?' అని చెలుల్ని కోప్పడింది.

మరింత పట్టుదలతో హంసను పట్టాలని దమయంతి నీడలా దాన్ని వెంటాడింది. "ఓ హంసగమనా! రాజహంస వెంటబడుట కూడదని పెద్దలు నిషేధించిరే" అంటూ చెలికత్తెలు ఆమె వెనుకనే తిరుగుతున్నారు. రాకుమారి పట్టుదలతో వెంటాడుట చూచి ఆ రాయంచ ఆమె నడుకను అనుకరిస్తూ నడవసాగింది. ఆ అనుకరణము చూచి చెలికత్తెలు ఆశ్చర్యముగ నవ్వుకోసాగారు.

## హంస రాయబారము

**రా**జహంస మందగమనంతో ఒక చక్కని పొదరింటిలో దూరి దాక్కుంది. అది శరీరమంతటినీ గుప్పెడంతగా కుదించుకుని లోపలికి వెళ్ళడం చూచిన రాకుమారి ఇక హంసను పట్టుకోలేనని నిరాశతో విసుక్కుంటూ నుంచుంది. వెనుక గుంపుగా వచ్చిన చెలికత్తెలు పకపక నవ్వుతున్నారు.

దమయంతికి కలిగిన ఆయాసంవల్ల మోమున చిరు చెమటలు పట్టాయి. తాను తలచిన పనిని సాధించలేకపోయాననే రోషంతో ఆమె దీర్ఘంగా నిట్టూర్చుతూంటే ఆ వేగానికి బరువైన స్తనాలు పైకి, దిగువకు కదులాడుతూ వెక్కిరిస్తున్నట్టున్నాయి. తన ఆత్మా, నీడా కూడా తనను గేలి చేస్తున్నాయనుకుంది దమయంతి.

ఇదంతా గమనించిన రాజహంస మనుజభాషలో రాకుమారితో మాట్లాడసాగింది,

“దమయంతీ! బాల్యచాపల్యంతో నన్ను పట్టుకోవాలని పొదల ముళ్ళ, తీగెలబంధాలు, అడవిచెట్లూ గుర్తించకుండా నా వెంటబడి వచ్చావుగాని నన్ను పట్టుకోవడం అంత తేలికనుకున్నావా? వచ్చి వచ్చి అంతలోనే ఎంత అలసిపోయావో చూచుకో!

బ్రహ్మయొక్క రథమూ, గుర్రాలూ మాకు గురువులు. స్వర్గ లోకపు కొలనులోని బంగారు కలువతూండ్లు మాకు ఆహారం. దేవలోకంతో సహా సమస్త లోకాలూ మాకు ఆటలాడుకునే ప్రదేశాలు. అమృతపానం చేసినవారే మా తీయని మాటలు వినడానికి అర్హులు. సరస్వతీదేవి ముంజేతిమీద ఉండే పలుకుల చిలుక మా స్నేహితుడు. వేదాలు, శాస్త్రాలు, పురాణాది విద్యలన్నీ మాకు కంఠోపాఠం.

ఒకనాడు బ్రహ్మదేవుడు తన రథముపై వాహ్యాళికి బయలుదేరాడు. కొంతదూరం వెళ్లేసరికి గుర్రాలు అలసిపోయాయి. నేనా రథాన్ని మెడపై వేసుకుని వేగంగా లాక్కువెళ్ళాను. నా భక్తికి శక్తికి సంతోషించి బ్రహ్మదేవుడే నాకొక బహుమతి ఇచ్చాడు. నేను దేవతాపక్షిని నాబోటి వారిని బంధాలతో పట్టుకోవడం సాధ్యమా ? అయితే సుగుణాలనే బంధాలతో మమ్మ పట్టుకోవచ్చునులే!

ఈ భూలోకంలో సుగణశీలురైన రాకుమారులు కొందరున్నారు. అలాంటివారు నాకు స్నేహితులు. వారిలో నిషధదేశపు రాజైన నలుడు నాకు మరీ ప్రాణమిత్రుడు. అతడంటే నాకెంతో ఇష్టం. అందువల్లనే వేసవికాలంలో హిమగిరినుంచి దిగి, మానససరోవరంలో స్నానం చేసి, అందున్న బంగారుపద్మాల సువాసనలు కూడా తెచ్చి – ఆ నలునికి నా రెక్కలతో చల్లగాలి వీస్తూంటాను.

ఆ నలుని భుజబల పరాక్రమాలు వర్ణించాలంటే ఆ బ్రహ్మకు కూడా చేతకాదు. అతడు విడిచే బాణాల తీక్షణతకే వైరిరాజుల అసువులెగిరి గాలిలో కలిసిపోతాయి. ఆ గాలే ఆ బాణాలకు కడుపునిండే ఆహారం.

ఆ నలుని గురించి విన్న రంభ అనే అప్సరసాసుందరి అతన్ని మనసులో వరించి, కలుసుకుందామని భూలోకానికి దిగి వచ్చిందట. కాని ఆమె కోరిక తీరలేదుట! అందువల్ల ఆశలుడిగిన రంభ దేవేంద్ర లోకానికి తిరిగి వెళ్ళి నలుని పేరుకు దగ్గరి పేరు గలవాడని నలకూబరుని వరించి తృప్తిపడవలసి వచ్చిందట!

అంతేకాదు. ఆ నలుడు వాత్సాయన కామసూత్రాలు మన్మథ శాస్త్రాలూ బాగా తెలుసుకున్న పురుషుడు.

నేనేమో ఈడూ జోడూ చూచి దాంపత్యాలు కలిపే నేర్పు కలవాడిని, ఉత్తమ రాజాంతఃపురాలలో కన్నెలకు చక్కగా నడిచే మెలకువలు నేర్పే గురువును. నేనేదో ఒక దేవతాపక్షిని మాత్రమేనని అనుకోవద్దు. సృష్టికర్తయగు బ్రహ్మ నోటినుండి వెలువడే శాస్త్రాలన్నీ గ్రహించినవాడనుగాని సామాన్యుడను గాదు.

నాచేత ఏదైనా ఉపకారం పొందు, ఈ శరీరం పరోపకారార్థమే గదా! బ్రహ్మ సృష్టివిలాసం లక్ష్మీనారాయణులను పార్వతీ పరమేశ్వరులను జత

గలిపినట్లు – నీకు నలునితో జతగలుపుదును గాక, అనంత సుగుణశీలవైన నీవు నలుని చేపట్టదగిన యువతివి. ఈడు జోడు, రూపు రేఖలు గుణగణాదులందు మీరిద్దరూ దాంపత్యం నెరపదగినవారు. నిన్ను నలునికి దప్ప మరెవరికి పెండ్లి చేసినా కాకిముక్కుకు దొండపండందించినట్లే ఉంటుంది.

ఒకనాడు బ్రహ్మదేవుని రథాన్ని లాగుతూ 'యీ భూలోకంలో నలునికి తగిన భార్య ఎవరండీ ?' అని వారి నడిగాను. ఆయన చెప్పిందేమిటో – రథచక్రాల చప్పుడులో సరిగా వినిపించలేదుగాని, నీ పేరేనని నాకు గుర్తువస్తున్నది.

ఇప్పుడున్న పరిస్థితులు నాకు బాగా తెలుసు. ఇంకా రెండు మూడు రోజులిలాగే గడిస్తే మన్మథుని బాణాల దెబ్బలకు మీ ఇద్దరి హృదయాలూ చూర్ణము చూర్ణమైపోతాయి. కనుక నలుడూ నువ్వూ వెంటనే ఏదో ఒక నిర్ణయానికి రావడం మంచిది. నలుడిక విరహవేదన భరించలేక మనసును మరో మార్గానికి మళ్ళించుకుంటే – లోకుల అపవాదులకు గురి కావలసి వస్తుంది. ఇక – అప్పుడు నలుడుగాని, నీవు గాని ఏం చెయ్యగలరు ?" అని రాయంచ గద్దించింది.

రాయంచ చెప్పిన మాటలను ఒక క్షణం మననం చేసుకున్న దమయంతి బాల్య చాపల్యమువల్లనే దానిని పట్టుకొన జూచినందుకు మన్నించవలసిందని వేడి, పక్షిరాజు గుణ గణ సౌందర్యాలను అనేక విధాల పొగిడింది.

తరువాత తన మనసులోని కోరిక గొంతుకలో కొట్టుమిట్టాడుచున్నదే గాని, బైటికి చెప్పుటకు సిగ్గగుచున్నదని చెప్పి "నా ప్రేమ అందని చెట్టు పండ్లకొరకు ఎగబడుచున్నట్లున్నదేమో! అయినా ఆ రాకుమారుని కరగ్రహణము గావించి నా కా పండు లభింపజేయ వేడుకుంటున్నాను.పసికన్యను గనుక బేలనై మనసులోని కోర్కెవెల్లడించా"నని అంది.

ఆ యువతి నునుసిగ్గుతో అక్షరం అక్షరం కూడబలుకుతున్నట్లు మెల మెల్లగా క్లుప్తంగా చెప్పడం విన్న రాజహంస కొద్దిసేపు ఆలోచించి ఇలా చెప్పింది,

"రాకుమారీ! నీవేదో నర్మగర్భంగా చెప్పావుగాని స్పష్టంగా చెప్ప గూడదా ? నేనా విశేషాలు వినడానికి అర్హుడను కాదా ? మా ఏలికయైన బ్రహ్మదేవునిపై ఒట్టుపెట్టి చెబుతున్నాను – నేను పుట్టినప్పటినుంచి నేటి వరకు అబద్ధాలు పలికి యుండలేదు. సత్యమే పలికి కార్యసాఫల్యము చేయగలవాడను. ఈ మూడు లోకాలలో నీకేది కావాలంటే అది తెచ్చి ఇవ్వగలను. మన్మథాకారుడైన రాకుమారులందరూ నే చెప్పిన మాట విని ఆచరించేవారే ! అందరికంటె నిషధ రాకుమారుడు నన్ను ప్రాణసమానంగా ప్రేమిస్తాడు.

ఆ నలునిచేతనే నీవు కోరితే పాణిగ్రహణం చేయించగలను. కాని, నీవు పసిపిల్లవు, తండ్రిచాటు కన్యవు, స్వయముగా నిర్ణయము చేయగలవా? అటు నలరాజు అన్ని లోకాలూ ఏలగలిగినటువంటివాడు; ఇటు నేను బ్రహ్మకు హితుణ్ణి. ఇలాంటి సందర్భాలలో సందేహాస్పదమైన మాటలు నేనెలా చెప్పేది? తొందరపడి మీ ఇద్దరికీ జతగలిపిన తరువాత కారణాంతరాల వల్ల సంబంధం బెడిసిందంటే నా గౌరవం కాస్తా పోతుంది. చనువుగా నన్ను పిలిచే నలరాజు ముందు నేను తలవంచుకుని నేరస్తుడిలా నిల్చోవలసి వస్తుంది గదా ?

ఇప్పుడు నీ వతనిమీదనే మనసుంచిన మాట నిజమే కావచ్చు. కాని, ఆ తరువాత మనసేం మారుతుందో ? బాలికల మనసులు నీటిపై అలల వలె క్షణక్షణం మారిపోతూంటాయి. అట్లా అలల్లా అనుక్షణం మారిపోతూండే మనసును మన్మథుని పుష్పబాణాలు తాకగలవో లేదో గదా? కొంచెం అనుమానంగా ఉన్న ఈ విషయంలో నేను మధ్యవర్తిగా వ్యవహరించడం ఇష్టం లేదుగాని – మరేపనైనా చెప్పు. వెంటనే చేసి పెడతాను" అని బెట్టుసరి చేసింది.

## రాయబార ఫలితము

ఆ మాటలకు దమయంతి భయపడి నెరవేరుతుందనుకున్న కోరిక నిష్ఫలం కాకుండా తన మనసులోని మాటలను స్పష్టంగా చెప్పసాగింది.

"హంసరాజమా! నేను నిషధరాజగు నలునిగాక మరొక రాకుమారుని వరించటం – రోహిణీకాంత చంద్రుని వదలి మరొకరిని వరించుటకు తపస్సు చేయుట వంటిది. కలువలు, పద్మాలు సూర్యరశ్మి తాకితే తప్ప మరొకరి ఛాయపడితే వికసించవు. అదేవిధంగా నే నలుని దప్ప మరొకర్ని గురించి నే నూహించనైనా ఊహించలేను.

నేను అన్య రాకుమారుల్ని వరించటం జరిగితే నేను అగ్నిలోపడి దగ్ధమైనట్లే. నీవు సందేహించి యెగతాళిగా మాట్లాడ్డం చాలించి నా మాట నమ్ము. నీతో నేను దొంగ రాయబారాలు పంపవలసిన అవసరం ఏముంది ? వేద వాక్యాల ప్రకారం చేతగానిపని చేయగలనని చెప్పడం మానసిక వ్యభిచారము గదా ?

ఒకవేళ నా తండ్రి నన్ను నిషధ రాకుమారునికి కాక మరొకరికిచ్చి పెండ్లి చేయదలచినచో – నేను వెంటనే అగ్నిలోపడి అసువులర్పించి, మరో జన్మలోనైనా నలుని పతిగా పొందుటకు ప్రయత్నించెదను.

నలునికి దాసిగా ఉండే అవకాశం లభించినా అదే నా జన్మ సార్థకత అనుకుంటాను. ఆయన పాదపూజ చేసే భాగ్యం కలిగితే అదే పదివేలను కుంటాను. ఆయన నన్ను కరుణించాలని ఆశిస్తున్నాను. ఆయన సేవే నా జీవితం అనుకుంటున్నాను. నీవు దయదలిస్తే నలరాజు వక్షస్థలం మీద నా వక్షోజాలు అంకితం చేస్తాను.

నేనెప్పుడూ మనసారా అతన్నే కోరుకుంటున్నాను. అంతేగాని బంగారాన్ని వర్షించే చింతామణి అయినా నాకక్కర్లేదు. వేయి మాటలెందుకు – నలుడే

నా పెన్నిధి. వారి సుగుణాల్ని గురించి వీనులార విన్నాను. దశదిశలా వారి మోహనరూప లావణ్య కాంతిశోభలే నాకు కన్పిస్తున్నాయి. నేను ఆయన్నెంతో వలచివున్నాను. ఇది సత్యం !

ఇంకా నేనేమని చెప్పను ? ఆయన కొరకైనా నన్ను ప్రాణాలతో రక్షించు. ఆశ్రయించిన వారిని రక్షించే మహాపుణ్యాన్ని సంపాదించుకో. అనవసరంగా నన్ను అనుమానించకు. ఆలస్యం చెయ్యకు. ప్రేమసాగరంలో దిక్కూ దరి తెలియక అల్లల్లాడుతున్న నాకు తెప్పవై రక్షించి ఆ ఒడ్డుకు చేర్చు. నీవే కన్యాదానం చేసినంత పుణ్యం పొందావని ధర్మపరులు మెచ్చుకునేట్టు వ్యవహరించు. నా ప్రాణనాథునికి ప్రాణమిత్రుడవైన నిన్ను ఇంకెన్ని విధాలుగా కీర్తించగలను ?

ఏ దేవతలు వరించి వచ్చినాసరే అష్ట దిక్పాలురు మెచ్చుకొనునట్లు అందరినీ గడ్డిపోచల్లా నెట్టివేస్తాను. ఇక ఇతర రాకుమారులను ఎంత కనిష్ఠంగా అసహ్యించుకుంటానో వేరే చెప్పనక్కరలేదు గదా! నా మనసూ, శరీరం, జీవితం నలుని కొరకే ముడుపు కట్టానని – మన్మథుని పాదాలమీద, రతీదేవి చనులమీద ఒట్టు పెట్టుకుని శపథం చేస్తున్నాను.

కావలసిందేమిటో చెప్పాను. అనవసరంగా కాలయాపన చేయకు. నాకిక విరహాన్ని ఓర్చే ధైర్యం లేదు. పక్షిరాజా – నువ్వు మనోవేగంతో వెళ్ళాలి. మంచిపని కోసం నీవెంత వేగంగా వెళ్ళి రాగలవో చూద్దాం గదా !

ఒకవేళ నువ్వు వెళ్ళేసరికి నలుడు అంతఃపురంలో ఉంటే నా సంగతులు చెప్పడం అనుకూలంగాదు. అందగత్తె లెందరి మధ్యనో ఉన్నప్పుడు పురుషుడు మరొక స్త్రీని గురించి వినడానికి ఇష్టపడడు గదా !

దప్పిక తీరేవరకూ మంచినీరు త్రాగినవారికి నిర్మల సరోవరములోని సుగంధ నీరమైనను వెగటే గదా ! అందువల్ల తన అంతఃపురంలోని స్త్రీల

ననుభవించి తృప్తిపడిన సమయంలో నన్ను గురించి నలరాజుకు చెప్పుట తగదు.

పైత్య మెక్కువై నోరు చేదుగా ఉన్న సమయంలో పంచదార కూడా రుచించదు. కనుక – ఆయన మనసులో కోపం ప్రకోపించిన సమయంలో నా ప్రేమను గురించి చెప్పడం సమంజసం కాదు సుమా!

అకాలంలో నిద్రించడం అవమానం పొందడానికి కారణభూతం అవుతుంది. అందువల్ల మరొక పనిలో నిమగ్నుడై ఉన్న నలునికి నన్ను గురించి చెప్పవద్దు. ఈ తార్కాణాలన్నీ గుర్తుంచుకొని ఏ సదవకాశంలో ఈ సంగతి చెబితే కార్యం సిద్ధిస్తుందో నీవే నిర్ణయించుకోవలసిందని కోరుతున్నాను.”

మదన జ్వరం అతిశయించినందువల్ల సిగ్గు విడిచి స్పష్టంగా అన్ని విషయాలూ చెప్పిన దమయంతికి ప్రోత్సాహాన్ని కలిగించే విధంగా చిరునవ్వు లొలికిస్తూ ఆ రాజహంస ఇలా అంది :

“ఇంతీ! మన్మథుడు సాక్షిగా చెపుతున్నాను – ఈ కార్యం సాధిస్తాను. అన్ని విధాలా ఈడు జోడు అమరిన మిమ్ము బ్రహ్మ కూడా తప్పక దంపతుల్ని చేస్తాడు. నీ కలయికవల్ల నలరాజు ఇంద్రియాలన్నీ దైవత్వాన్ని పొందగలవు. మిమ్మల్ని రాణి, రాజులుగా చూస్తుంటే నా కళ్ళు చల్లబడతాయి.

నీవు మనసువిప్పి మా నలరాజుపై మరులుగొన్నట్లు స్పష్టంగా చెప్పావు గనుక, ఆయనకు నీమీద ఎంత ప్రేమ ఉన్నదో చెబుతాను, విను :

అతడెప్పుడూ నిన్నే తలచుకుంటూ దీర్ఘంగా నిట్టూర్పులు విడుస్తున్నాడు. మీ ఇద్దరి ప్రవర్తనా ఒకే చందంగా ఉండడం ఆశ్చర్యం కదూ! ఆయన నిద్రవేళ హంసతూలికా తల్పంమీద పడుకుంటే నిద్రాదేవి కనురెప్పలు మూసి జోలపాడుతూంటుంది. నీ మూర్తి మేల్కొలుపుతూంటుంది. మరి మీరిద్దరూ సవతులేమో !

తీర్చి దిద్దినట్లున్న నీ రూపురేఖా విలాస సౌందర్యాన్ని చూడాలని నలుడు అనుక్షణం తహతహలాడుతున్నాడు. ఎప్పుడూ కన్నీరు పెట్టకోవటం వల్ల ఆయన కళ్ళు మరింత స్వచ్ఛందంగా విశాలమయ్యాయి. నిరంతరంగా నిట్టూర్పులు విడుస్తున్నందువల్ల పెదవులు తెల్లబడుతున్నాయి. మదనతాపంతో కలువతూండ్ల మీదనే పడుకుంటున్నాడు. విరహజ్వర తీవ్రతవల్ల అతని మనసు వణికి పోతున్నది. అకారణంగా నవ్వుతున్నాడు. హఠాత్తుగా భయపడుతున్నాడు. అనవసరంగా హడావుడి పడుతున్నాడు. తనలో తనే మాట్లాడుకుంటున్నాడు. శూన్యంలోకి చూస్తున్నాడు. నేను బయలుదేరే సమయంలో – ఆపద అనే ప్రవాహంలోని బురదవంటి మూర్ఛలో మునిగిపోతున్నాడు. నీవు లభించడానికి ఎంతటి పాపకార్యం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాడు ; ఆఖరికి దాస్యం చెయ్యడానికైనా సిగ్గుపడడనుకుంటాను.

మదనుడు రెండుచేతులా పుష్పబాణాలు విడుస్తుంటే అవి అయిదైనా పదులమాదిరిగా పలువిధాల శరీరాన్నంతటినీ పొడిచివేస్తుంటే – ఇంక 'నలరాజు దక్కడేమో' నన్నంత భయం కలిగింది నే బయలుదేరినప్పుడు. ఆ విధంగా మన్మథుని దాడికి లొంగిపోతూనే ఆయన నన్ను నీ వద్దకు పంపించగా వచ్చాను. నీ మనసులో కోరిక కూడా తెలుసుకున్నాను.

విదర్భ రాజపుత్రీ ! నవ్వు నిజంగా ధన్యవు ! హావభావ విలాస చమత్కారాల దేవియైన లక్ష్మి పాలసముద్రాన్ని చిలికినట్లుగా నీవా నైషధ రాకుమారుని హృదయాన్ని కలచివేశావు.

చంద్రుడు చంద్రిక, పూవు సువాసన, రసము భావములవలె మీ రిద్దరూ అన్యోన్యభావంతో, ప్రేమానుబంధంతో ధన్యులుకండి ! చిగురు టాకులవంటి చేతులు, మొగ్గలవంటి చిరునగవులు, పూవులవంటి శరీర లావణ్యము, ఫలముల వంటి కుచములుగల నీ మూర్తి కల్పవృక్షము వంటిది.

ఈ కల్పవృక్షమునకు నలరాజు నందనోద్యాన మగుగాక ! ఆ ఉద్యాన హృదయాంతరాళమున నీవు వసింతువుగాక !

మీ రిరువురూ గట్టిగా కౌగిలించుకొని మల్లయుద్ధము వలె రతికేళి సలుపుచున్న సమయాలలో దేవలోకపు గాలిగుంపులు శృంగారవనం మీదికి వచ్చి మీ మీద పుష్పవర్షాలు కురిపించుగాక !

అరుగో మీ చెలికత్తెలు దగ్గరకు వస్తున్నారు. మన మంత్రాంగం వారికి తెలియగూడదు. నేనిక పోయి వచ్చెదను, శెలవిమ్ము" అని తొందరించింది.

దమయంతి సెలవివ్వగానే ఆ రాజహంస పొదరింటి నుంచి బైటికి వచ్చి ఆకాశానికెగిరి మనోవేగంతో నలుని వద్దకు తిరిగి వెళ్ళిపోయింది.

ఆ విధంగా వెళ్ళిపోతున్న పక్షిరాజును ఆకాశంలో కనుమరుగయ్యే వరకు చూచిన దమయంతి తన దగ్గరి చుట్టము దూరమైనట్లు విచారించుచు, కన్నీరు ధారాపాతమగుచుండ అంతఃపురానికి తిరిగి వెళ్ళింది.

రాయంచ రాకకై ఎదురు చూచుచున్న నలుడు ఆ కొలని ప్రక్క పూపొదరింటి చలువరాతిపై కూర్చొనియుండుట గమనించిన హంస సంతోషముగా రెక్కలగొట్టుచు కార్యసాఫల్యతను సూచించి, రాజు దగ్గర దిగినది.

నలుడు హంస చెప్పిన విశేషాలన్నీ విని సంతోషంతో ఇలా అన్నాడు; "రాజహంసా! సరసత, రహస్య కార్యనిర్వహణ, చతురత, పురుషార్థసాధన, మేలు చేకూర్చుట, కృతజ్ఞత, దయ మొదలగు గుణములు నీకెంతో అందాన్నిస్తున్నాయి. ఒక రాకుమార్తెయగు కన్యను కలుసుకుని, పరిచయమైన మరుక్షణంలోనే ఆమె చెలికత్తెలకైనా తెలియకుండా రహస్యాలన్నీ గ్రహించి, కార్యం సాధించుకు రావడం మరెవరికైనా సాధ్యమౌతుందా ?" అని పొడిగాడు.

నలుడు "ఆమె ఏమన్నది! ఏమి జరిగిం"దని పదే పదే ప్రశ్నిస్తూ విన్న విశేషాలనే మళ్ళీ మళ్ళీ వింటున్నాడు. హంసను తదేక దృష్టితో

చూస్తూ, దాని శరీరాన్ని నిమురుతూ, దమయంతి రూప లావణ్య విశేషాలు వినడం వల్ల మనసులో ఊటలూరుతున్న మధురరసం త్రాగి మత్తు వస్తున్నట్లు ఆనందిస్తున్నాడు.

ఆ హంస : "అయ్యా – నే వెళ్ళిన పని ఈ విధంగా ఫలప్రదం అయింది. నేను బ్రహ్మదేవుని సేవకు వెళ్ళవలసిన వేళయిం"దని చెప్పి శెలవు తీసుకుని బ్రహ్మలోకానికి ఎగిరిపోయింది. ఈ సంఘటన వల్ల మనసంతా నిండిన మధుర భావనలు ఇతరులకు తెలియకుండా నలుడా పూ పొదరింటి నుండి బయలుదేరి, ఉద్యానవనాన్ని దాటి తన చెలులు, పరివారం విశ్రమించిన చోటికి వెళ్ళాడు. అంతా కలసి తన నగరిలోని రాజాంతఃపురానికి వెళ్ళారు.

నలుడు ఆ దమయంతినే తలుచుకుంటూ విరహంతో కాలం గడుపుతున్నాడు.

## దమయంతి విరహం

**మ**న్మథుడు – నలరాజు సుగుణాల్ని విల్లుగాను, కీర్తిని నారిగాను, సౌందర్యాన్ని బాణపు మొనగాను చేసుకొని వడివడిగా దమయంతి మీద శరపరంపర వేయసాగాడు. ఆమె మనసంతా నలుని మీదనే లగ్నమై యుండడం చేత, అతని విశేషాలు వినడమే పనిగా పెట్టుకుని సంతోషంతో తల మున్కలౌతున్నది. మదనజ్వరానికి కారణమూ అదే, పథ్యం కానిదీ అదేగదా! ఆమె విరహం మరీ ఎక్కువైంది.

ఇక ఆమె మనసు ఆనందంతో వికసించడం లేదు. అద్దాలవంటి చెక్కిళ్ళపై చిరునవ్వు రేఖలైనా కనిపించడం లేదు. కనుగొలకుల్లోనైనా కాంతి మెరవడం లేదు. మనసులోని ప్రియుని ప్రత్యక్షంగా చూడాలని ఎదురు చూస్తున్నందువల్ల అసలు చూపే మందగించినట్లుంది. దృష్టి అంతా హృదయ ఫలకం మీదే ఉండడంవల్ల ఎదుట ఉన్న గోడ, త్రోవ, స్థంభము, వస్తువులు కనిపించడం లేదు. ఎటు నడిస్తే ఏది తగులుతుందో ననే గుర్తింపే లేదు.

చేతిని మాత్రమే దిండుగా పెట్టుకుని పడుకున్నందువల్ల చిగురు టాకువంటి చేయీ, లేతాకువంటి చెక్కిలీ కూడా కందిపోయాయి. ఆమె విడుస్తున్న నిట్టూర్పుల వేడికి జడిసి గండు తుమ్మెదలు సుగంధ పుష్పాలను తాకడానికే భయపడుతున్నాయి. ఆమె కళ్ళ నుంచి అశ్రువులు ముత్యాల దండల్లా జారుతున్నాయి. శరీరం కళ తప్పుతూంది. ఆటపాటలపైకి మనసు మళ్ళడం లేదు. ఒంట్లో సత్తువంతా నీరసమైపోయింది. మదనతాపం క్షణక్షణానికీ ఎక్కువైపోతున్నది.

ఆ జ్వరతాపం తగ్గాలని ఒత్తుగా రొమ్ములపై పూసుకున్న గంధం హృదయంలోంచి వస్తున్న వేడికి బుసబుసలాడి బుడగల్లా పొంగుతూంది. కలువతూళ్ళ హారాలనుంచి నురగలు వస్తున్నాయి. ఆమెకు శైత్యోపచారాలు చెయ్యాలని చెలికత్తెలు లేలేత పూవులు తెచ్చి కప్పగా – అవి దమయంతి విడుచు నిట్టూర్పుల వేడికి అంతలోనే అప్పడాలవలె పెళ పెళ లాడుచున్నవి.

అదే విధంగా చనులపై గప్పిన లేత తామరాకులు అంతలోనే వాడి వత్తలై ముడుచుకుపోతున్నాయి. అరటిబోదెల మధ్యనుంచి తీసిన రేకులతో గాలి వీస్తుంటే అవి కొయ్యకట్టెలై పోతున్నాయి; ముత్యాలరంగు కగ్గిపోతున్నది; దమయంతి కన్నీటితో చెక్కిళ్ళపై పూయబడిన పుప్పొడులు, సుగంధద్రవ్యాలు కరిగిపోతున్నాయి.

ఈ విధంగా మదనుడు విజృంభించి వేస్తున్న పుష్పబాణాలకు తాళలేక విరహవేదనతో బాధపడుచు, సకల శైత్యోపచారములు నిరర్థకములుగ రోజులు వారములు గడుపుచున్న దమయంతి ఒకనాడు రాజ కేళీమందిరం పైభాగాన గల చలువరాతి మండపంలోకి వెళ్ళింది. సఖీజనులెందరో ఆమె వెంట ఉన్నారు. ఆనాడు పౌర్ణమి. దమయంతి నిండు చంద్రుని చూచి తిట్టిపోయ సాగింది.

# చంద్రుని తిట్టుట

"ఓ సేవ్! మీకీ సంగతి తెలుసా ? పాలసముద్రంలోనుంచి హాలాహలము, చంద్రుడు పుట్టగా మొదటి విషాన్ని శివుడు మ్రింగివేశాడు. ఎందరో దేవతలు కూడ విపరీత బాధలతో అనుభవించిన చంద్రుడనే విషం మాత్రం నాశనం కాకుండా ఉండిపోయింది.

ఈ చంద్రుడు – విరహిణులను వధించి మహాపాపం కట్టుకునే కుటిలుడు – లోకాలన్నీ బూడిదగా చేయగల కాలకూట విషానికి తోబుట్టువు; కణకణ మండే సూర్యమండల ప్రదేశంలో ఒక స్థానం పొందిన కోపిష్ఠి; బడబానలమూ తాను కలసి పాలసముద్రగర్భంలో కొంతకాలం ఉన్నామనే దుర్జాతివాడు; ఆకాశమనే స్మశానంలో ఊరకే తిరుగుతూ దొంగచూపులు చూచే కొరివిదయ్యం.

ఇతడు పుట్టేటప్పుడే ఆ సముద్రాన్ని చిలుకుతున్న కొండ ఇతన్ని చూర్ణం చేయవలసింది; గ్రహణ సమయాలలో ఇతన్ని మ్రింగే రాహువు ఇతన్ని నమిలి త్రేన్చవలసింది. శివుడు కాలకూట విషాన్ని మ్రింగేపుడు దాని తోబుట్టువైన ఇతన్ని రుచిగా నంజుకోవలసింది. అకాలమృత్యు వితనిపై కోపించి ఒక్కసారిగా నామరూపాల్లేకుండా చేయవలసింది. దుర్వాసుడు సముద్రజలా లన్నింటినీ పుడిసెడు త్రాగి మరల ఉమియునప్పుడు ఇతన్ని వదలకుండా మ్రింగవలసింది. ఆ యీ విధాలుగా జరిగి ఉంటే ఇతని వల్ల విరహిణులు ఇంత బాధింప బడేవారు కారుగదా!

చెలులారా! ఒక పెద్ద అద్దమిలా తీసుకురండి, ఒక దుడ్డుకర్ర కూడా తెండి. ఆ చంద్రు డద్దములో కనుపించగానే ఆ కోలతో చావమోదండి. మనం పంజరాల్లో పెట్టి గారాబంగా పెంచుకుంటున్న చకోరాల నన్నింటినీ ఒక్కసారిగా వదిలిపెట్టండి, అవి పైకి వెళ్ళి దుర్వాసుడు సముద్రాన్ని త్రాగివేసినట్లు ఆ చంద్రుని త్రాగివేస్తాయి.

ఆ చంద్రునితో ఉన్న లేడిపిల్ల మరీ పసిదనుకుంటాను. లేత తమలపాకులు తెచ్చి దాన్ని బాగా మేపుదాం. అప్పుడది బలిసి, పెద్దదై చంద్రబింబం మొత్తాన్ని ఆక్రమించుకుంటుంది. నా కసి తీరుతుంది” అంటూ చంద్రుని నిందాలాపాలాడింది.

మళ్ళీ అతనితో ! “శివునికి ఆభరణానివి. పాలసముద్రానికి గారాల బిడ్డవు. కామధేనువు, కల్పతరువు, కౌస్తుభము, లక్ష్మి, అమృతములకు తోబుట్టువువు. లోకంచేత పొగడబడే వాడవు. అంతటివాడవు కోరికలతో అలసిపోతున్న వారిని వేధించడం ధర్మమేనా ?

నీవు మన్మథుని జతబట్టి విరహంతో కుంగేవారిని పీడించవద్దు; వారిపై నీ బాణాలు కూడా విసిరావంటే పాలసముద్రంలో పుట్టినవారి కందరికీ అపకీర్తి వస్తుంది సుమా!” అని హెచ్చరించింది.

## మదనుని తిట్టుట

‘**త**గ్గుతూ పెరుగుతూ, కాలనియమం లేకుండా ఆకాశంలో తిరిగే చంద్రుణ్ణి నిందించడమెందుకు ? అంతరంగానికి దగ్గరే ఉండి హింసించే మన్మథుని తిట్టిపొయ్యాలి ?’ అనుకుంది దమయంతి.

“మన్మథా! మగలు దగ్గరలేని మగువలను వేధించడం పాపం. ఆ పాపమే నిన్నొకసారి శివుని మూడవకంటి కోపాగ్ని జ్వాలలకు ఆహుతి చేసింది. అయినా నీకు బుద్ధి కుదరలేదు; నీ క్రూరత్వాన్ని మానవు. నువ్వు ఆ విష్ణుదేవునికీ లక్ష్మికీ ఏ దుర్ముహూర్తంలో పుట్టావో గదా!

నువ్వు మరీ కఠినాత్ముడవని తెలిసే నీకా దేవుడు పూలనే బాణాలుగా చేశాడు; ఆ బాణాలు కూడా అయిదింటి కంటె ఎక్కువ ఇవ్వలేదు. లేకపోతే నీ దాడికి ఈ జగత్తులో ఎవరైనా బ్రతకగలిగేవారా !

లోకాలన్నింటినీ మోహంలో ముంచే పాపిష్టివి కాబట్టే నువ్వు శరీరం లేని భూతనివయ్యావు. విరహమనే శాపం పొందినవారినే తాకుతావు గదా, నీవు కలికాల దోషంతో పుట్టావా ? నువ్వు చచ్చి బూడిదయైనప్పుడు మా రతీదేవి పసుపు కుంకుమలేగదా నిన్ను మళ్ళీ బ్రతికించాయి. అయినా నీకు సిగ్గు లేదా ? పంచభూతాల్లో కలసి అంటరానివాడవైపోయినా నువ్వింకా పంచబాణాలతో లోకుల్ని బాధిస్తావేం ?" అని కసితో నిందాలాపాలాడిన దమయంతికి – కేళీవనంలో మామిడిచివుళ్ళు తిన్న కోయిలలు పంచమ స్వరంలో కుహూకుహూమని కూయడం వినిపించింది. ఆ స్వరం వినగానే ఆమె మూర్ఛపోయింది.

అది చూచి చెలికత్తెలు తత్తరపడ్డారు. ఒకతె గొజ్జంగి నీరు తెచ్చి జల్లింది. ఒక యువతి వింజామరతో గాలి వీచసాగింది. ఒకామె గంధము, కస్తూరి కలిపి కుచాలమీద పూసింది. మరొకతె పాదాలకు పుప్పొడులు పూయసాగింది.

చెలికత్తెలు ఒకరినొకరు ఈ విధంగా పనులు పురమాయించు కున్నారు."పద్మినీ! నువ్వు పన్నీటితో దేవి కన్నీరు తుడువు... సారంగీ! నువ్వు లేత అరటిబోదెల మొవ్వపట్టతో గాలి వీచు.... కల్పవల్లీ, కర్పూరంతో బొట్టుపెట్టు... చక్రవాకీ, మంచిగంధం పూయి... చకోరీ, చెంగావిరంగు పట్టుగుడ్డ కప్పు... హరిణీ, కలువకాడల్ని హారాలుగా చేసి దేవి మెడలో వెయ్యి... కలకంఠీ, చెంగల్వపూలతో దిండుచేసి తలక్రింద పెట్టు..... కలికా, మంచితేనె తెచ్చి చిలకరించు... ఇందుమతీ; లేత పాచితీగెల గుత్తులు తెచ్చి అరచేతుల్లో ఒత్తు.... మందారికా, పుప్పొడులు తెచ్చి దేవి పాదాలకు చల్లగా జల్లు !

## స్వయంవర ప్రకటన

**ఈ** విధంగా దమయంతికి శీతలోపచారాలు చేస్తూ తొక్కిసలాడుతున్న పరిచారికల ఆందోళనా స్వరాలు విదర్భ రాజగు భీమసేనునికి వినిపించాయి.

ఆయన గాభరాపడుతూ భార్యతో సహా అక్కడికి వచ్చి కారణాలడిగాడు. వాళ్ళు తమకు తెలిసిన విశేషాలన్నీ చెప్పారు. తమ కూతురు యౌవనాధిక్యతతో వేదనపడుచున్నదని గ్రహించిన తలిదండ్రులు ప్రపంచ దేశాలన్నింటిలోను దమయంతీ స్వయంవరం చాటించారు.

ఏడు సముద్రాలు చుట్టి ఉన్న భూలోకంలోని ప్రతి ప్రాంతానా మూడు వాద్యాలతో చాటింపు వేస్తూ భటులు "భోజవంశానికి చెందిన విదర్భరాజగు భీమసేనుని పుత్రిక తగిన వరుని తానే ఎన్నుకునే వ్రతం పూనింది. కనుక ధైర్య గుణ రూపవంతులయిన రాకుమారులందరూ ఈ వ్రతానికి రావలసిం దహో" అని ప్రకటించారు.

## ఇంద్ర దర్శనము

**అ**న్ని లోకాల విశేషాలూ వెంట వెంటనే తెలుసుకునే నారదుడు అన్ని భాషలూ తెలిసినవాడు, అన్ని శాస్త్రాలలోను పండితుడు, పురాణ చరిత్రలలోని రహస్యాలన్నీ గ్రహించినవాడు, అతనికి చిన్నప్పటి నుంచీ పర్వతుడు స్నేహితుడు.

ఒకనాడు నారదుడు పర్వతునితో గలసి ఇంద్రలోకాన్ని చూచి వద్దామని బయలుదేరాడు. అతడు తన వీణాతంత్రువులను కొనగోళ్ళతో మీటుతూ వెళు తుంటే స్వర్గలోకంలో కూడా ఎవరూ అడ్డగించరు. ఆకాశంలో ఎగిరి వెళ్ళడానికి వారికి విమానం అవసరం లేదు. యోగ విద్య లెరిగిన మునులు వెళ్ళలేని చోటు, సాధించలేని పని ఉండవుగదా!

నారద పర్వతులు స్వర్గానికి వెళుతుంటే ఆకాశంలో తిరగే యక్ష గంధర్వ దేవతలు చేతులెత్తి నమస్కరిస్తున్నారు. నారదుని శరీరము చంద్రకాంతి రంగు గలదైనా సూర్యకాంతివలె ప్రకాశించసాగింది. స్వర్గలోకములోని అమృత తటాకమైన మందాకిని చల్లని గాలి వీస్తూ అతిథులకు అర్ఘ్యపాద్య మర్యాదలు

చేసింది. గాలి వేగాన్ని హెచ్చించి తగ్గించు తూండడం వల్ల నారదుని వీణతీగెలు నూరున్నూ మోహనకరంగా సంగీత ధ్వనులు వెల్లడిస్తున్నాయి. మానవుడు యోగదీక్షతో సంసారమనే మహా సముద్రాన్ని దాటి మోక్షస్థానానికి చేరినట్లు, నారదుడు విశాలాకాశమార్గాన్ని గడచి స్వర్గలోకం చేరుకున్నాడు.

నారద పర్వతులు ప్రవేశించేసరికి దేవేంద్రుడు దేవగంధర్వాదులు నిండిన సభలో ఉన్నాడు. నారదుడాతని ఆశీర్వదించినాడు. ఇంద్రుడు నారద పర్వతులకు ఉచితాసనము లిచ్చి మర్యాదలు చేసినాడు. కొంతసేపు కుశల సంభాషణలు జరిగిన తర్వాత  ఇంద్రుడు,

"నారద మునీంద్రా ! అన్ని లోకాల వార్తలూ నీకు తెలుసు గదా, పూర్వంలాగా మూడు లోకాలలోను మధ్యగల నరకలోకం నుంచి రాజులు ఈ లోకానికి రావడం లేదేమి ? యుద్ధంలో వీరమరణం పొందినవాళ్ళు ఇక్కడికి అదిథులుగా రావడం లేదు. రాజవంశాల మధ్య యుద్ధాలు సంభవించడం లేదా ?

యుద్ధరంగంలో ఖడ్గవిహారం చేసి చనిపోయినవారు రక్తాన్ని కోల్పోయి, తేలికై పై కెగిరి, ఆకాశమార్గాన మా వద్దకు చేరేవారు. అలాంటివాళ్ళ శరీరాలమీద కత్తులు తగిలిన గాట్లు కనిపించేవి. దోవలో దేవకాంతలు చూచి పూలదండలు వేసి సన్మానించేవారు. అంత ముచ్చటగా కన్పించే వాళ్ళకు మేమెంతో భక్తిశ్రద్ధలతో అతిథి మర్యాదలు జరిపేవాళ్ళము.

అలాంటి రాజు లిప్పుడు మా లోకానికే రావడం లేదు. నన్నూ నా లోకాన్ని వాళ్ళు శపించారా ఏమి ? నా కొలువెపుడూ అలాంటి అతిధుల సందడితో నిండిపోయేది. ఇప్పు డా విధంగా చుట్టాలు రానందువల్ల నాకున్న సంపదంతా నా కోసం, నా కుటుంబం కోసమే ఖర్చు  చేయవలసి వచ్చి నే నెంతో సిగ్గుపడవలసి వస్తున్నది.

పూర్వజన్మల పుణ్యఫలంగా పొందిన సంపదల్ని ఉత్తములకు, బంధువులకు ఖర్చు చెయ్యలేకపోతే – అవి సంపదలు గాక ఆపదలే అవుతాయి. సంపద తరక్కుండా మురిగిపోతూండడం మానసిక శాంతికి భంగకరం. అందువల్ల నా వద్దకు అతిథులు రాకున్న కారణం ఏమిటో సెలవివ్వండి స్వామీ” అని అడిగాడు.

దేవేంద్రుని వినయానికి నారదుడు సంతోషించి “ఇంద్రా! అతిథులను, బంధువులను సంతృప్తి పరచాలని తహతహలాడుతున్న నీవు ఉత్తముడవు. గనుక కలకాలం నువ్వే ఈ స్వర్గాన్ని ఏలుకుంటూ ఉండాలి” అని ఆశీర్వదించాడు.

వెంటనే “భూలోకం నుంచి రాజులు ఈ లోకానికి రాకపోవడానికి కారణం చెబుతాను విను. విదర్భదేశంలో ఒక రత్నం పుట్టింది. ఆమె లక్ష్మీదేవి వలె సకల శుభలక్షణాలతో ప్రకాశిస్తూ లోకంలోని రాజులందరినీ ఆకర్షిస్తూంది. అందరిపైనా మదన బాణాలు విసురుతున్న ఆ కన్య పేరు దమయంతి.

క్షణక్షణానికీ యౌవనంతో పాటు సమ్మోహనకర సౌందర్యం కూడా పెరుగుతున్న ఆమె అందరినీ వదలి ఒకే ఒక్క రాకుమారుని మనసులో వలచిందట!” అని కూడా నారదుడు చెప్పాడు.

“పూర్వపుణ్యఫలంగా లభించే అంతటి ప్రేమకు పాత్రమైన వాడెవడయ్యా ?” అని ఇంద్రుడడిగాడు. నారదుడు ! “మీ రడిగిన విషయం వేరు, ఇది మరోమార్గం పట్టింది. మీ ప్రశ్నకు సమాధానమివ్వడం నాకు చేతగాదు గనుక మళ్ళీ ముదలకించకండి” అని అన్నాడు.

దేవేంద్రుడు ! “నీవు యోగీశ్వరుడివి. పరమాణువులోని రహస్యాన్ని కూడా తెలుసుకోగలవాడివి. మనసులు కూడా పరమాణువుల వంటివే గదా ? ఆ కన్యాహృదయంలో గల పురుషుని పేరు ఎరుగరా మీరు ?” అని

ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. నారదుడు నవ్వుతూ ! "యోగదృష్టితో పరమాణు రహస్యమైనా తెలిసేమాట నిజమే కావచ్చు. కాని, అంతకంటె చిన్నదైన మనసు లోపలి రహస్యం తెలియడం దుస్తరం. మదనబాణాలు ముమ్మరంగా తగులు తున్నందువల్ల ఆమె శరీరం వణికిపోతున్నదని గ్రహించి పెద్దలు అయిదు వందల కోట్ల వైశాల్యం గల భూలోకమంతటా ఆమె స్వయంవరాన్ని ప్రకటించారు. అలా ప్రకటనకై మొదటి ఢక్క మ్రోగినప్పటినుంచీ రాజులందరూ రాజకీయాలు, యుద్ధ ప్రసక్తీ మరచి దమయంతీ స్వయంవరానికి వెళ్ళే ప్రయత్నాలలో నిమగ్నులయ్యారు.

ప్రతి ఒక్కరినీ మోహింపజేయగల దమయంతి బాలికా దశ నుంచి యౌవన దశలో ప్రవేశించినప్పటి నుంచీ మన్మథుడు రాజపురుషులందరి మీదా పుష్పబాణాలు ప్రయోగిస్తూ ఇతర విశేషాలు తలచకుండా చేశాడు. అందువల్లనే ఎవరూ ఈ లోకానికా రావడం లేదు. భూలోకంలో యుద్ధాలే లేకపోవడం వల్ల నా కళ్ళు ఉపవాసం చేస్తున్నాయి. వాటి ఆకలి తీరేట్టుగా నీకూ రాక్షసులకూ మధ్య ఏదైనా యుద్ధం జరుగుతున్నదేమో నని చూడ్డానికే ఇట్లా వచ్చాను" అని అన్నాడు.

దేవేంద్రుడా మాటలకు నవ్వుకుంటూ ! "నారదా! నా సోదరుడైన నారాయణుడు చల్లని చూపులతో భారమంతా మోస్తూ కాపాడుతున్నాడు. కనుకనే ఈ లోకాన్ని చక్కగా ఏలగలుగుతున్నాను. ఇక్కడ యుద్ధాల్లేవు. ఏదో లాంఛనప్రాయంగా వజ్రాయుధం ధరిస్తున్నానేగాని – ఈ లోకాన్ని స్థిరంగా కాపాడ్డానికి నారాయణుని కనుసైగే చాలుగదా!" అన్నాడు.

ఇంద్రుని కవ్వించి ఎవరో ఒకరిమీద యుద్ధం చేయించుదామనే ప్రయత్నం కూడా ఫలించలేదని కలహభోజనుడైన నారదుడు దీర్ఘంగా నిట్టూర్చాడు. మళ్ళీ "పాతాళానికి వెళితే భూలోకం చూద్దామనిపిస్తుంది.

నరలోకంలో ఉన్నప్పుడు స్వర్గలోకానికి వెళ్ళాలనుకుంటాను. ఏ లోకంలోనూ నాకు విందుభోజనం పెట్టే సంఘర్షణలు జరక్కపోవడం వల్ల నా కెక్కడా కాలాగడం లేదు.

నిన్ను కలుసుకున్నాను గనుక నే వచ్చినపని అయినట్లే. ఇక నాకు శెలవిస్తే, మధ్యమలోకానికి వెళ్ళిపోతాను. దమయంతీ స్వయంవర సందర్భములో రాకుమారుల మధ్య అసూయాద్వేషాలు పుట్టి యుద్ధాలు మొదలైతే నా మనసు నిండేట్టుగా చూచే భాగ్యం కలుగుతుందేమో" నని త్వరత్వరగా శెలవు తీసుకుని పర్వతునితో సహా వెళ్ళిపోయాడు.

## ఇంద్రాదుల ప్రయాణం

**నా**రదుని మాటలు వినేసరికి ఇంద్రునికి కూడా దమయంతీ స్వయంవరానికి వెళ్ళాలనే కోర్కె పుట్టింది. వెంటనే సభ చాలించి ప్రయాణానికి సిద్ధమయ్యాడు. ఆ సమయంలో మన్మథుడొక గమ్మత్తు చేశాడు.

చల్లని నీరు, పాలు, పన్నీరు కలిపి స్నానం చేసినా మదనతాపం తీరని దమయంతి కుచద్వయాన్ని చల్లబరచగల ఒక చికిత్సా విశేషాన్ని మదనజ్వరం పుట్టిన దేవేంద్రుని చేతికి మదనుడే రహస్యంగా అందించాడు.

దేవేంద్రుడు దమయంతిపై మనసుపడి స్వయంవరానికి తరలి వెళుతున్నాడని తెలియగానే రంభ నాట్య అధ్యయనం చేయడం మానివేసింది. ఆమె కాలిగజ్జెలు మూగవోయాయి. తిలోత్తమ హృదయం తత్తరపడింది. మోము చిన్నబోయింది. ఊర్వశి సౌందర్య గర్వమంతా కోల్పోయి శోకాగ్నిలో పడినట్లయింది. మేనక మూతి ముడుచుకుని ముసుగు పెట్టుకు పడుకుంది. దేవ వేశ్యలందరూ తామిక చచ్చిపోవలసిందే గాని మళ్ళీ ఇంద్రుని పొందే భాగ్యం కలుగదనే భయంతో విచారించసాగారు.

భూలోకానికి బయలుదేరిన దేవేంద్రుని వెంట అగ్ని, వరుణ, యమ–ధర్మరాజులు కూడా వెళ్ళారు. మరి కొందరు పరివారంగా నడిచారు. బయలు దేరేప్పుడే కొందరు అప్సరసలను పిలిచి, మందారం మొదలైన స్వర్గ లోకపు పువ్వుల్ని తమ కానుకలుగా దమయంతికి రహస్యంగా అందించవలసిందని చెప్పి పంపించారు.

ఆ దిక్పాలకులు ఒక బంగారు విమానం ఎక్కి భూలోకం వైపు వెళు తున్నారు. ఇతర పరివారం కూడా తగు వాహనాలపై వెంట వెళ్ళారు. వారంతా భూలోకంలో దిగే సమయంలో – దూరం నుంచి ఉరుములు సృష్టిస్తున్న మేఘాల సంఘర్షణ వంటి ధ్వని గంభీరంగా వినిపించింది. దేవతలు "ఈ ధ్వని ఎక్కడిదో?" నని ఆశ్చర్యపడుతూ ఆగి నలుదిక్కులా చూస్తున్నారు.

ముర్మురు గంభీరధ్వనులతో ఒక రథం తమ వైపే రావడం గమనించారు. ఆ రథంమీద మన్మథుని మించిన సుందరుడైన నలుడు కనిపించాడు. నలుని యౌవనపటిమను చూచి వరుణుడు స్తంభించిపోయాడు. అతని ఛాయను చూచి అగ్ని మొహం మాడ్చుకున్నాడు. నలుని ఠీవిని జూచి యముడు సిగ్గుపడ్డాడు. అతని సౌందర్యాన్ని చూచి ఇంద్రుడు అసూయపడ్డాడు. అందరూ అతడే తమకంటె అందగాడని ఏవగించుకోసాగారు.

లోగడ విన్న విశేషాలనుబట్టి ఇంతటి సుందరుడు నిషధ రాకుమారు డగు నలుడే కావచ్చునని దేవపాలకులు తమలో తాము గుసగుసలాడారు. ఎంత అసూయగా ఉన్నా అతన్ని చూచినకొలదీ మనసులో ప్రేమ పుడుతున్నది.

ఆ విధంగా ఆకాశయానాని కుపయోగపడే వాహనాల మీద నిలచి యున్న వారిని నలుడు చూశాడు. ఇదేదో ఆశ్చర్యంగా ఉంది అనుకుంటూనే నలుడు రథాన్ని దిగి వారి వైపు వెళ్ళాడు. దగ్గరకు వెళ్ళగానే వారికి చేతులెత్తి నమస్కరించి ఒక ప్రక్కగా వినయంతో నిలబడ్డాడు. దేవతలతన్ని ఎగాదిగా

చూచి "ఈతని ముందు మనమెంత? ఇక దమయంతి మనకు దక్కదు" అనుకొంటూ ఒకరి మొహాలొకరు చూచుకున్నారు.

## దేవతల ప్రార్థన

**క**పటంతో ఇతరులను వంచించడంలో నేర్పరియైన దేవేంద్రుడు మనసులో ఒక ఎత్తు వేసి నలునితో ఇట్లా మాట్లాడాడు,

"నీవెవరవు! నాకు నలుడవేనని తోస్తున్నది. క్షేమమే గదా ? మీ తండ్రి వీరసేనుడు మాకు మంచి స్నేహితుడు. అతని పోలికలు నీలో కనిపిస్తున్నాయి. ఏ పనిమీద ఎక్కడికి వెళుతున్నావు ? నిన్ను గురించి చాలా చాలా విన్నాము గాని, మమ్మ నీ వెరుగుదువా, అతడు అగ్ని, ఇతడు వరుణుడు, అతడు యముడు, నేను దేవేంద్రుడను. అసలు సంగతేమంటే మేమందరం నిన్నొకటి అర్థించాలని వచ్చాం. కొంచెం విశ్రాంతి తీసుకుని ఆ విషయం చెబుతాను" అని క్షణంసేపు మెదలకుండా ఊరుకున్నాడు.

'అర్థించవచ్చా' మనే మాట చెవుల వినబడగానే నలుని మనసు పులకరించింది. తనలోతాను 'దేవలోకంలోని వారికి లభించకుండా ఉన్న గొప్ప వస్తువు ఏముంది ? వీరు ఆడగ్గానే నాకది దొరుకుతుందా ? అడిగిన వారు తృప్తిపడునట్లు వెంటనే ప్రాణాలైనా సరే ఇవ్వడం నా కలవాటు. ఇంద్రుడంతటివాడే అడిగినప్పుడు నేను ఏమివ్వగలవాడను ? నా ప్రాణాల కంటే దమయంతిని అధికంగా భావిస్తున్నాను. ఇంద్రుడా యువతినే కోరినాసరే వెంటనే ఇచ్చేస్తాను.

వీళ్ళకి కావలసిం దేమిటో ? అడిగిన తర్వాత ఇచ్చేవాడు తక్కువ తరగతి దాత, అర్థి అడక్కుండానే కావలసింది ఇవ్వడం మహాభాగ్యం. అర్థి నోరువిప్పి అడిగేప్పుడు మానసం చంపుకుంటాడు, సిగ్గుపడతాడు, మొహం దీనమౌతుంది. గొంతు కీచు బారుతుంది. కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి. అడిగినా

ఫలితం ఉండదేమోననే భయంతో కంపించిపోతాడు. ఆ విధంగా అతడంత వేదనపడిన తర్వాత దాన మివ్వడం కఠినాత్మ సంతోషం మాత్రమే గదా!

పుచ్చుకునేవాడికి లవలేశమైనా బాధ కలుగకుండా దాన మివ్వలేనివాడే భూమాతకు మోయలేని బరువౌతాడు గాని–కొండలు, అరణ్యాలు, సముద్రాలు బరువేకావు! ఏ నిర్భాగ్యుడో వచ్చి చేయి సాచితే, తాను దాతగా నటించి 'పరలోక పుణ్య ప్రాప్తి నాశించి' దానం ఇవ్వడం ఒక నీచ వ్యాపారం వంటిది!' అని రకరకాలుగా ఆలోచిస్తున్నాడు.

పలకరించిన వారికి వెంటనే జవాబివ్వకపోతే మర్యాద కాదని, "దేవతోత్తములారా! మీరు అమృతం తాగే అమరులు. మిమ్మల్ని చూడగానే నాకు అమృతం సేవించినంత ఆనందంగా ఉంది. నా చూపులు ధన్యమయ్యాయి. నేను పూర్వజన్మలలో ఎంత పుణ్యం చేసుకుంటే ఈ రోజున ఇలా మీ దర్శనభాగ్యం కలిగిందో.

అన్నింటినీ సహించే ఓర్పుగల ఈ భూదేవి కూడా మీ పుణ్య పాదాలు సోకడం వల్ల ధన్యమైంది. మీకు నా వల్ల కావలసిన పని ఏదో ఆజ్ఞ ఇవ్వండి. అది ప్రాణసమానమైనా, ప్రాణాధికమయినా సరే ఇవ్వగలను" అన్నాడు.

దేవేంద్రుడు ముందుగా నలుని పొగిడి : "మేము విదర్భ రాకుమారి యగు దమయంతిని వరించ వచ్చాము. స్వయంవర సందర్భములో మాకు దూతవై సహాయం చెయ్యి. ఈ లోకంలో ఎందరో రాకుమారులున్నారు గాని వారి వల్ల మా కేమీ ప్రయోజనం లేదు. సుగుణాలరాశివైన నీవు సహాయం చేస్తే సాధించలేనిది ఉండదు" అన్నాడు.

నలుడు 'దేవేంద్రుని కపటనాటకాన్ని కపటంతోనే ఎదుర్కోవాలి.' అనుకోలేదు. మనస్ఫూర్తిగా "సర్వభూతాల గతులు మీకు తెలుసు. నేను కూడా ఆ దమయంతిని పొందుదామనే వెడుతున్నా. అందువల్ల ఆమెకు ద్రోహం

చెయ్యలేను గదా ? పైగా ఆమె పట్ల విరహబాధలు పొందుతూ సహించలేక చేపట్ట వెడుతున్నవాడను - ఆమె వద్ద నా మనసును దాచుకుని మీ రహస్యాన్ని దాచలేనేమో ? నాలో కోరిక లూరిస్తున్న  ఆమె వద్ద నా మనసులోని మాట దాచుకోగలనా ?" అని అడిగాడు.

పైగా "రక రకాల రక్షకభటులు కాపలా ఉండే ఆ రాచకన్య అంతఃపురంలోకి నేనెలా వెళ్లగలను? చాలా కాలం నుంచి నా మీదే ప్రేమ నుంచిన ఆ యువతితో మిమ్ము గురించి ఎలా చెప్పేది ? ఈ పని కొప్పుకుంటే నేను నవ్వుల పాలయేట్టున్నాను - మరేపనైనా చెప్పండి" అన్నాడు.

ఆ మాటలు విన్న దేవేంద్రుడు తోటివారి నొకసారి భావగర్భంగా చూచి నలునితో : "చంద్రవంశంలో పుట్టిన రాజులు ఆడినమాట తప్పరు. నీకిది న్యాయమేనా ? నీటిబుడగ వంటి సంసార సుఖం కోసం ధర్మాన్ని, కీర్తిని విడిచిపెడతావా ? మీ వంశానికి మూలమైన చంద్రుడిలాగ నీవు కూడా కళంకితుడవౌతావా ? ఎంతో కాలం నుంచి నువు సంపాదించుకున్న కీర్తి ఈ మాట తప్పడంతో మారిపోతుంటే చూస్తూ ఊరుకుంటావా : చింతామణి; కామధేనువు, కల్పవృక్షాలవంటి వాటిని అర్థించినవారైనా ఒట్టి చేతులతో వెళ్ళరే- నిన్ను యాచించి ఊరికే వెళ్ళిపోవలసిందేనా ?" అని అడిగాడు.

పైగా! "నీ వేదో గొప్ప దానశీలుడవనుకుని దేవతాధిపులమైన మేమిట్లా యాచించి వచ్చాము. ఈ గతి చూచి కల్పవృక్షాది పంచ మహత్తులూ కోల్పోయా నని స్వర్గలోకమే వెలతెల బోతుంది. బాగా ఆలోచించుకో" మన్నాడు. అగ్ని "ఇది నీ కర్తవ్యం" అన్నాడు. యముడు "ప్రార్థన" అన్నాడు. వరుణుడు "ఇతరులకు మేలు చేసిన కీర్తి సాధించుకో" మన్నాడు.

నలుగురు దేవతల హెచ్చరికలూ విన్న నలుడు - తాను మనసారా వరించిన దమయంతిని వారికి సుముఖం చేసే రాయబారిగా వెళ్ళడానికి

అంగీకరించాడు. దేవత లతనికి అదృశ్యమయ్యే విద్యను నేర్పి "ఇక నీవు కాంతల అంతఃపురంలోకైనా సరే ఎవరికీ కనిపించకుండా వెళ్ళవచ్చును. వెళ్ళు. కార్యం సిద్ధిస్తుంది" అని చెప్పి పంపించారు.

## నలుని సంసిద్ధత

నలుడు ఆ దేవతల వద్ద శెలవు తీసుకుని, తన రథమెక్కి, గుర్రాలను వేయిరెట్లు వేగంగా నడుపుతూ కుండిన నగరం చేరుకున్నాడు.

అప్పటికే నగరం వెలుపలి ప్రదేశమంతా దమయంతీ స్వయంవరంలో పోటీపడవచ్చిన రాకుమారుల గుడారాలతో, వాహనాలతో, బలగంతో నిండి కోలాహలంగా ఉంది. ప్రతి రాకుమారుడూ దమయంతి గుణగణాల్ని, రూపురేఖా విలాసాల్ని గురించి చెవులు గోసుకు వింటూ, విరహంతో బాధపడుతూ, శైత్యోపచారాలు చేయించుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు.

నలునికి వేదనతోపాటు, దేవతలకు దమయంతిని కూర్చవలసిన కార్యభారం కూడా తోడైనందువల్ల మరింత వేడిగా నిట్టూర్పులు పెరిగాయి.

అతడు కూడా తన రథాన్ని ఒకచోట ఆపి, దేవతల కోర్కెను వెంటనే సాధించాలనే దీక్షతో కాలినడకను రాచనగరంలో ప్రవేశించాడు. అదృశ్య విద్యాబలంతో అంతలోనే ఎవరికీ కనిపించకుండా నడవసాగాడు. ఆ కోట గుమ్మం దాటి లోపలికి వస్తున్న నలుని చూచి పురజనులు; "ఆహా! ఎంత అందగాడు ? మన్మథుడేనేమో! కళ్ళకు పండుగ్గా ఉన్నాడే!" అనుకుంటూ సముత్సాహంతో కళ్ళప్పగించి నిలబడ్డారు. అంతలోనే అతడదృశ్యమయ్యేసరికి "అరరే! ఆకంతు డింతలోనే మామయ్యాడే" అంటూ విస్తుపోయారు.

నలుడు అదృశ్యరూపంతోనే రాజవీధిని నడచి, రాజ మందిరం ముందుకు వెళ్ళాడు. గుమ్మం ముందు నిలబడి "మోసగానిలా ప్రవర్తించడం

నాకు సిగ్గుచేటుగా ఉంది" అనుకున్నాడు. అయినా మార్గాంతరం లేక అలాగే అదృశ్యుడై ఉన్నాడు. మెల్లగా సింహద్వారంలో ప్రవేశించి ముందుకు సాగాడు.

విచ్చుకత్తులు భుజాలమీద పెట్టుకుని కాపలా కాస్తున్న రక్షకభటులు దగ్గరై కూడా దొంగలా వెళుతున్న తనను ఆపనందుకు నలుడు నవ్వుకున్నాడు. ద్వారపాలకులు మరెవరినో "మీరెవ"రని ప్రశ్నిస్తూంటే తననే అడుగుతున్నారేమో నని ఉలిక్కిపడుతున్నాడు. వాళ్ళకి కనిపించరాదని చాటుకు పోయి దాక్కుంటు న్నాడు. ఆడవాళ్ళు ఎదురైతే వెంటనే ప్రక్కకు  తప్పుకుని దోవ యిస్తున్నాడు. మనసు దమయంతి మీదనే ఉండడం వల్ల రాచకన్యవంటి దెవతె కన్పించినా, తనను పంపుతూ దేవతలు చెప్పిన సందేశాలు బిగ్గరగా చెప్పబోతున్నాడు. మనిషి లేకుండా మాటలు వినబడడం వల్ల ఆ కన్యలూ, దోవన పోయేవాళ్ళూ నివ్వెరపడి చూస్తుంటే – నలుడు తన పొరపాటును గ్రహించి సర్దుకుపోతున్నాడు.

ఈ విధంగా నలుడు ఏనుగుల మొగసాల దాటి, అంతఃపురపు తొలి గదిలో ప్రవేశించాడు. అంతఃపురంలో పనిచేసే యువతులొక్కొక్కరుగా, ఇద్దరిద్దరుగా, గుంపులు గుంపులుగా తమ పనులమీద అటూ యిటూ తిరుగు తున్నారు. నలుడు జాగ్రత్తగా ఒక్కో గదే దాటుతూ లోపలికి వెళుతున్నాడు.

యౌవన సహజ వేగంవల్ల పమిటెలు జారితే, వాటిని విలాసంగా సవరించు కుంటున్న స్త్రీలను చూచి "అలాంటివి దొంగతనంగా చూడ్డం చూడ్డం పాపం" అనుకుంటూ నలుడు కళ్ళు మూసుకుంటున్నాడు. మగపురుగైనా దూరడానికి వీలులేని ఆ కన్యాంతఃపురంలో యువతులు మరీ నిర్లజ్జగా, నిర్భయంగా  తిరుగాడుతున్నారు.

పమిటె తొలగితే ఎవరు చూస్తారులెమ్మనే ధైర్యంతో చేతుల్లోని వస్తువులను మాత్రం గట్టిగా పట్టుకుని పమిటెలు సవరించుకోకుండానే కొందరు

వెళుతున్నారు. చనుమొనలు పొంగి చిరిగిన కంచుకాలనైనా కొందరు గమనించడం లేదు. కిటికీలలో నుంచి వచ్చే చిలిపి గాలులకు చీరలెగిరి రహస్యాంగాలు బైటపడినా ఎవరూ సిగ్గుపడటం లేదు. అందువల్ల నలుడు మాటి మాటికీ కళ్ళు మూసుకోవలసి వస్తున్నది."

ఈ విధంగా నడక సాగడంలేదని, కళ్ళు మూసుకుని కూడా ముందుకు నడుస్తూనే ఉన్నాడు. అలాంటి సమయంలో వెనుక నుంచి ఒకతె ముందు నుంచి ఒకతె హడావుడిగా వచ్చి సంతోషాతిరేకంతో కౌగిలించుకునే సరికి ఇద్దరి మధ్యా వున్న నలుడు ఆ యువతుల కుంభస్తనాల ఒత్తిడికి ఢీ కొంటున్న ఏనుగుల తలల మధ్య చిక్కుపడినంత బాధ పడవలసి వచ్చింది.

నలుడు అంతఃపురం స్తంభాలలో మలచబడిన గోడల మీది చిత్రాలను చూస్తూ వెళుతుంటే – ఒకసారి పదుగురు యువతులు కలిసి గుంపుగా ఆ దోవనే వెళుతున్నారు. వారిలో కొంచెం ఓరగా ఉన్న ఒక యువతి పైట గాలికెగిరి దూరంగా వెళ్ళిపోతుంటే ఆమె పరుగు పరుగున వెంటబడి అందుకుంది. ఈ లోపుగా ఆ పైట నలుని భుజంమీద పడింది. అతని దండకడియంలో గల వజ్రం ఒకటి ఆ పైట నొడిసిపట్టుకున్నట్లయింది. ఇదేమీ కనిపించని ఆ కన్య తన వల్లెవాటును లాక్కోడానికి కొంచెం గుంజులాడవలసి వచ్చింది. ఆ గుంజులాటలో ఆమె అందంగా దిద్దుకున్న కొప్పుముడి ఊడి పోయింది. ఆ కన్య పైట లాక్కుని కప్పుకుంటూ చెలుల్ని కలుసుకోడానికి పరుగెత్తుకు వెళ్ళింది. ఈమె వాలకాన్ని చూచిన సఖులు పకపక నవ్వుతూ ఎగతాళి చేశారు.

ఒకతె : "నీ పైట లాగిందెవరే ?" అని అడిగింది. ఇంకొకతె "ఇంటి నుంచి వచ్చి ఎంత సేపయిందో–ఇంతలోనే ప్రియుణ్ణి వెంట రమ్మన్నావటే ?" అంది. మరొకతె ! "ఇంతలోనే అంత విరహ మాపుకోలేవా ?" అంది. మరో

నెరజాణ : "కొప్పుముడి ఊడేంత గాఢంగా ముద్దు పెట్టుకున్నావటే ?" అనేసింది. పాపం – ఆ కన్య అకారణంగా అపవాదులు వచ్చాయని భయపడింది.

ఒకచోట ఇద్దరు యువతులు దూరదూరంగా నిలబడి ఒక బంగారు బంతితో ఆడుకుంటున్నారు. అందులో ఒకతె ఎదిరిమీదికి ఆ బంతి విసిరింది. మధ్యలో అదృశ్యరూపుడై ఉన్న నలుని భుజానికి ఆ బంతి తగిలి వెంటనే వెనక్కు తిరిగి వెళ్ళి విసరిన యువతికే తగిలింది. వాళ్ళిద్దరూ విడ్డూరంగా కళ్ళు తేలవేయవలసి వచ్చింది.

నలుడు నడచి వెడుతున్న ప్రాంతాలలో – అందాలకు మెరుగులు దిద్దుకుంటున్న స్త్రీలకు తమ అద్దాలలో పురుషఛాయ కనిపించి ఉలిక్కిపడ్డారు. అప్పుడే తుడిచిన చలువరాలమీద పురుష పాదాలు పడుతున్న గుర్తులై కొందరు యువతులు భయపడ్డారు. కొందరికి పురుషస్పర్శ గాలి ఒత్తిడి తగిలి తెల్ల బోయారు. అదృశ్యరూపుడైన నలుడు కనిపించకపోయినా, అతనితో దేవతలు పంపిన పూల సువాసనలు గుభాళిస్తున్నందువల్ల మధ్య మధ్య అతడు దమయంతిని గురించి పలవరించడం వల్ల అనేక మంది చెలికత్తెలకు అబ్బు రంగా తోస్తున్నది.

అయితే ఎందరు సుందరాంగినులు ఎన్ని సమ్మోహనకర భంగిమలలో కనిపించినా, మన్మథుడు పూలబాణాలు వేస్తున్నా నలుడు పరస్త్రీలను కన్నెత్తి చూచుట పాపమనే సంగతి గుర్తుంచుకుని జాగ్రత్తగా లోపలికి వెళ్ళాడు. అలా ఎంతోసేపు ఎన్నో గదులు గడచి నడవగా నడవగా ఒక చోట – రంగురంగుల చలువరాలతో నిర్మించబడిన అలంకార మందిరం కనిపించింది.

ఆ మందిరంలో నవరత్నాలు పొదిగిన సింహాసనం వంటి పీఠం మీద దమయంతి కూర్చుని ఉంది. ఎందరో చెలికత్తెలు ఒక్కొక్కరొక్కొక్క విధంగా

ఆమెకు అందాలు దిద్దుతూ అలంకారాలు చేస్తున్నారు. తాము చేయవలసిన పనులు ముందే ముగించిన యువతులు ఇద్దరు ముగ్గురొక్కొక చోట జేరి ప్రేయసీ ప్రియాదులుగా నటిస్తూ సరససల్లాపాలాడుతూ కిలకిల నవ్వు కుంటున్నారు.

ఒకతె హంసవలె భూమిమీద వంగి నడుస్తున్నది. మరొకతె నలుని వలె పురుషవేషము ధరించింది. వేరొకతె దమయంతి వలె నడచివచ్చి ఆ పురుషవేషి మెడలో పూలదండ వేసింది. ఒక యువతి బంగారురంగు గేదంగి ఆకు తెచ్చి బాగా పెరిగిన వాడిగోరుతో దమయంతి నలునికి వ్రాస్తున్నట్లు ఒక ప్రేమలేఖను వ్రాయసాగింది.

ఒకతె పన్నీటితో కస్తూరి రంగరించి – దృఢంగా గుండ్రంగా పెరిగిన దమయంతి కుచద్వయం మీద చల్లగా అలంకారాలు దిద్దుతూంది. ఆ ఉబ్బు గుబ్బలపైన మొనలను తాకుతూ ఒక సఖి "సౌందర్యమనే సముద్రంలో ఈదులాడే మన్మథుడు స్వారీచేసే వాహనాలు చూచానమ్మోయ్, చూచా!"నని నర్మగర్భంగా పలికింది.

పరిచారిక లెంతోకాలం శ్రమపడి పంజరంలోకి చిలకకు ఒక వాక్యం నేర్పారు. దమయంతి సర్వాలంకార భూషిత కాగానే ఆ చిలుక "అడుగడు గో నలుడు వస్తున్నాడమ్మా!" అని ఆ వాక్యం పలికింది. అప్పుడే ప్రవేశించిన నలుడు 'నా పేరు ఈ చిలుక కెలాతెలిసిందో'నని ఆశ్చర్యపడుతూ ఒక బంగారు గద్దెపై కూర్చున్నాడు.

ఆ అలంకార మందిరంలో హంస ఆకారంలో ఒక తమలపాకుల బుట్ట కనిపించేసరికి నలునికి తన మిత్రుడయిన రాజహంస గుర్తు వచ్చింది.

చెలులచే పూర్తిగా అలంకరింపబడిన దమయంతి లేచి వెళ్ళి తల్లికి నమస్కరించింది. తరువాత ఇలవేల్పులకు మొక్కింది. బ్రాహ్మణుల ఆశీర్వచనాలు

పొందింది. ముత్తయిదువులు ఆమె తలమీద సువర్ణాక్షతలు జల్లారు. ఆ విధంగా స్వయంవర సభాస్తలానికి బయలుదేరిన దమయంతికి తల్లి ఒక పూలదండ ఇచ్చింది. ఆ మాలను అందంగా పట్టుకుని ఆ కన్య అలంకార మందిర ద్వారాన్ని దాటుతూండగా ప్రక్క అరుగుమీద కూర్చుని ఉన్న నలుడు చూచాడు.

"అహెూ! ఈమె మదన సామ్రాజ్యలక్ష్మివలె నున్న దనుకొనుచు లేచి, హంసగమనంలో నడుస్తున్న ఆ కన్య దగ్గరకు వెళ్ళాడు. ఆమె మనసు నలుని తలుచుకుంటూ విరహవేదన పడుతున్నా, అతడు అదృశ్యరూపుడయి తన ప్రక్కనే నడుస్తున్నాడని దమయంతికి తెలియదు పాపం!

కాని – ఆమె మనసులో నలుని చిటికెన వ్రేలికి తన వ్రేలు గీలించి వివాహమండపానికి వెడుతున్నట్లే ఊహించుకుంటూ, అదే భావనతో వివశయై, తన చేతి పూదండను ఆ ఊహాసుందరుని మెడలో వేసింది. ఆ దండ నిజంగానే నలుని మెడమీద చక్కగా పడింది. ఊహాసుందరి ఇదమిత్థమని తెలియకుండా కూడా తననే వరించడం మహాద్భుతమనీ! అదృష్టమనీ నలుడు పొంగిపోయాడు. అయితే – పొరపాటు పడ్డాననుకుంటూ ఊహాలోకంలో నుంచి మేల్కొని కన్నెత్తి చూచిన దమయంతికి తను వేసిన పూలదండ కనిపించలేదు. ఆమె మరింత ఆశ్చర్యపడింది.

ప్రేయసీ ప్రియులు ఒకచోట ఎదురెదురుగా ఉండి కూడా, ఎంతో దూరంలో కనుమరుగై ఉన్నట్లు విరహతాప విచారాలు పొందుతున్నారు. ఆ సమయంలో ఆమెను చేతుల్లోకి తీసుకుని కౌగలించుకోవాలని ఉత్సాహ పడుతూ కూడా, నలుడు 'తగని పని' అని ఊరుకున్నాడు. అతని ఊర్పులూ, శరీరమూ తనకు తగులుతున్నా కూడా దమయంతికి తన ప్రియు డదృశ్య రూపంలో ఇక్కడే ఉన్నాడని తెలియదాయె!

ఆ విధంగా వారిరువురూ పరివారంతో సహా సభామందిరంలోకి వెళ్ళారు. దమయంతి సింహాసనం మీద ఠీవిగా కూర్చుంది. నలుడు ఆ పంచనే అదృశ్యంగా నిలచి ఉన్నాడు.

## దేవదూతికలు

**అ**ప్పుడు ద్వారపాలకుడొకడు లోపలికి వచ్చి "దేవీ! ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు పంపిన దూతికలు తమ దర్శనం కోసం వేచి ఉన్నా" రని చెప్పగా, ఆమె 'ప్రవేశపెట్టు'మని అనుమతి ఇచ్చింది.

దేవతల దూతికలు విలాసంగా నడుస్తూ సభలోనికి వచ్చి మర్యాదలు పొంది, ఉచితాసనాల మీద కూర్చున్నారు. ఆ నలుగురు దేవ పరిచారికల్లో ఒకతె అందరికంటె చమత్కారంగా మాట్లాడగలదు. అది ముందుగా లేచి నిలబడి నాట్యభంగిమతో నమస్కరించి ఈ విధంగా చెప్పసాగింది,

"దేవీ! కోటి మహాకిరీటాలు, అమృతవాహిని, కల్పవృక్షము, కామధేనువు, చింతామణి మొదలగు వెలలేని సంపదలు గల దేవేంద్రుని దూతను నేను. ఆయన నన్నెంతో గారాబంగా చూస్తారు. నీ చనులొత్తునట్లు కౌగిలించి క్షేమ సమాచారము లడిగినట్లు చెప్పమన్నారు. ఈ పారిజాతాల దండను నీకు కానుకగా పంపించారు" అని ఆ మాలను దమయంతికి సమర్పించింది.

ఆ దూతిక ఇంకా ఇలా చెప్పింది! "రాకుమారీ ! దేవ భాషను మానవులు చదువలేరని, ఒక గేదంగి ఆకుమీద కేళీ రహస్య పద్ధతులు తెలిపే చిత్రాన్ని వ్రేలిగోరుతో గీసి నా చేతికిచ్చి పంపించారు. ఇదుగో, స్వీకరించి గ్రహించు, ఇంద్రుడు నిన్ను కోరుతూ ఇంతకాలం వరకూ కబురంపకపోవడం తప్పే గాని – నువ్వు స్వయంవర సందర్భంలో ఆయన మెడలోనే పూలదండ వెయ్యాలి సుమా!

అన్ని లోకాల్లోనూ స్వర్గలోకం పూజనీయం. ఆ లోకంలో దేవతలకు గౌరవం ఎక్కువ. అటువంటి దేవతల ప్రభువు కోరి నిన్ను వరించాడంటే నువ్వెంత అదృష్టవంతురాలివో గ్రహించు. ఎన్నో వందల యజ్ఞయాగ తపాలు చేస్తేగాని స్వర్గలోక ప్రవేశం దొరకదు. అలాంటి లోకానికి దేవేంద్రుడు నిన్ను రాణిగా చేస్తానంటున్నాడు. అట్లా కోపంగా కనుబొమలు ముడివేస్తున్నా వెందుకమ్మా? ఈ కబురందడం ఆలస్యమైందనేనా ? కాస్త శాంతించు మరీ!

నీకు మాత్రం మనసులో – నందనోద్యానంలో మందారాల నీడను విశ్రమించాలని, మందాకిని ఒడ్డున గల ఇసుక తిన్నెల మీద ఆడుకోవాలని, లక్ష్మీదేవికి తోటికోడలివి కావాలని, విష్ణుమూర్తిని మరిదీ అని పిలిచి పనులు చేయించుకోవాలని, ఈ లోకంలో నీచేత పూజలు చేయించుకునే దేవదేవు లందరూ నీకే పూజలు చెయ్యాలని కోరికగా లేదటమ్మా ? ఇవన్నీ లభిస్తున్న నువ్వు ఎంత అదృష్టవంతురాలవో! ఆలస్యం చెయ్యక దేవేంద్రుని ఏలుకో ?"

ఆమె వెంట వచ్చిన ఇతర దూతికలు కూడా "అదే మంచిదని'... "ఇంకా ఆలోచించడం దేనికీ ?".... అంగీకరించినట్లేలే.... అని అనేక రకాలుగా బలపరిచారు. దమయంతి మాత్రం దేవేంద్రునికి మనసులోనే మ్రొక్కి చిరునగవులతో ఇలా సమాధానం చెప్పింది.

"ఓ దేవదూతికా ! నాల్గువేదాలు కూడా వేయినోళ్ళతో దేవతలను పొగుడుతున్నాయి. ఇక ఆ దేవేంద్రుని పొగిడేంత శక్తి మనకెక్కడిది ? కనుక నువ్వు అలా వర్ణించే సాహసాన్ని మానుకో. ఆయన నీతో చెప్పి పంపిన మాటల్ని పూదండలాగ తలలో తురుముకుంటాను. మా మానవ లోకంలోనే గల నలుడనే రాజుకు నా మనసెప్పుడో అంకితం చేశాను. అందువల్ల మరొకరిని వరించే ప్రసక్తే లేదుగదా !

నాలుగురకాల ఆశ్రమాల్లో గృహస్థాశ్రమం గొప్పది. అదే విధంగా లోకాలన్నింటిలో భూలోకమే గొప్పది. సర్వధర్మ కర్మలలో పతికి సేవ చేస్తూ భాగస్వామినై ఉంటాను. ఈ లోకం నుంచి ఇంకా పై లోకానికి వెళ్ళవచ్చును గాని, స్వర్గలోకంలో ఉన్నవారు జనాంతరం వెళ్ళేది అధోలోకానికే గదా ? పై నుంచి క్రింద పడ్డం గొప్పదో, క్రిందినుంచి పైకి వెళ్ళడం మంచిదో నీకు మాత్రం తెలియదా ?

స్వర్గలోకపు సుఖభోగాలు కామాతురులైన వారికి నచ్చుతాయేమో గాని, సంస్కారం గల ఆర్యులకు గిట్టవు. కనుక నువ్విక అనవసరాయాసంతో ప్రశంసించవద్దు" అని హెచ్చరించింది. ఆమె మాటలను బలపరచియున్న ఇతర దూతికలతో దమయంతి ఇలా అంది.

మీరు మనసుల్లో ఏమనుకుంటున్నారో నాకు తెలుసు. ఏదో వాదించాలని శ్రమ పడకండి. అన్నిటికీ ఆది మూలమైన ఆత్మ నిర్ణయానికే నేను కట్టుబడి ఉంటాను. ప్రపంచంలో కీటకం నుంచి పరబ్రహ్మ వరకు ప్రతి ఒక్కరూ ఆ విష్ణుమూర్తి అంశాలే. ఈ కీలకం తెలియక ఒకరికంటె మరెవరో గొప్ప అని వాదించడం అవివేకం.

అయితే, కొందరు రాళ్ళు పిండిచేసి సాధించుకున్నది తింటారు. మరికొందరు వెన్నెలలే తాగి బతుకుతూంటారు. ఎవరి ఆహారం వారికి రుచిస్తుందిగాని, ఒకరికి మరొకరి రుచి సహించదు. బంధువులు మంచీ చెడూ తెలుసుకుని మరీ మాట్లాడాలి. మీరు నాకిష్టం లేని మాటలు చెప్పకుండా మరేమైనా చెప్పండి. అడ్డురాకుండా వింటాను."

దమయంతి మళ్ళీ ఆ దూతికలను "మనసు అర్పించుకున్న పురుషుని గురించి తప్ప ఇతర పురుషుల పొగడ్తలు వినడం పతివ్రతా ధర్మం కాదు. కనుక ఇకముందు మీరు నా వద్ద పరపురుషుల పొగడ్తలు చేశారంటే ఆ

దేవేంద్రుని పాదాలమీద ఒట్టే"నని కట్టడి చేసింది. అంతటితో ఇంద్రుని దూతిక శెలవు తీసుకుని వెళ్ళిపోయింది. ఇతర దేవతల దూతికలు కూడా తమకూ అదే సమాధానమని గ్రహించి వెళ్ళిపోయారు.

## దమయంతి వర్ణన

**అ**దృశ్యంగా ఉన్న నలుడు ఈ సంభాషణలు వింటూ దమయంతి అందాన్ని కళ్ళతోనే జుర్రుకుంటున్నాడు. అతని చూపులు ఆమె శరీర కాంతిలో మునిగాయి. ఆనందరస సముద్రంలో తేలాయి, సంతోషాశ్రుధారలతో నిండాయి. ఆమెను ఆపాదమస్తకం చూస్తూనే మదనసుఖాలు పొందినంత అనుభూతి కలిగింది.

ఆమె ముఖంలోని సౌందర్యకాంతి క్షణక్షణం ఎక్కువౌతున్నందువల్ల నలునికి చూచే ధైర్యం చాలక కళ్ళు క్రిందికి మళ్ళించాడు. అక్కడ ఎత్తుగా లేచిన గుండ్రని కొండ శిఖరాల్లాగ ఆమె కుచాలు కనిపించాయి. అతని చూపు లెక్కువగా దమయంతి పెదవుల మధ్య చనుల మధ్య గల పల్లంలోను, నాభీబిలంలోను మునగదలచినట్లు ఆడుకుంటున్నాయి.

గుండ్రని కుచాల్ని చూస్తుంటే అతనికి కళ్ళు తిరిగి నట్లయింది కాబోలు – కింద పడిపోకుండా నిలదొక్కుకోడానికి అతని చూపు లామె తొడలనే అరటిస్తంభాల్ని కావిలించుకున్నాయి. "ధరించబడినందువల్ల నేతచీరెకు అంతటి భాగ్యం అబ్బింది కాని నేత్రాలకు ఆ భాగ్యం లేకపోయింది గదా" అనుకుంటూనే నలుడు ఆ దమయంతి స్తనాలనూ, తొడలనూ చూచి నిట్టూర్చాడు.

నలుడు తనలో తాను; "ఈ సౌందర్యరాశిని సృష్టించడం లోనే బ్రహ్మదేవుని శిల్పకళా నైపుణ్యం వెల్లడవుతూంది. ఈమె యౌవన మనే సముద్రంలో పుట్టిన హావ భావ ప్రణయ శృంగారాలకు ప్రతిబింబం. ఈమె శరీరకాంతి కనులు మిరుమిట్లు గొలుపుతూంది. ఈమె శరీర కోమలత్వం

చూచి సిగ్గుపడి పూలలోని చిగురు రేకులు కూడా దుమ్ములో పడిపోతున్నాయి. ఈమె ముఖంలోని మెరుపుకాంతులకు జడిసే చక్రవాకాలు చంద్రుని కాంతినే త్రాగవలసి వచ్చింది.

"మన్మథుడు తన పంచబాణాలలో మూడింటితోనే మూడు లోకాలూ జయిస్తూ, మిగిలిన రెండు బాణాలతో ఈమె కళ్ళకు పట్టాభిషేకం చేసినట్టు న్నాడు. బ్రహ్మ కలువలను, చకోరాలను, మెరుపులను, గండు చేపలను, వెన్నెలను, తమ్మి పూరేకులను మంచి ముత్యాలను, రత్నశక్తులను గుర్తుచేసుకుని ఆయా విశేషణాలను అమృతంతో రంగరించి కొంచెం విషం బొట్లు కూడా కలిపి ఈమె కళ్ళను సృష్టించి ఉంటాడు. నిత్యం సంచలించే ఈమె చూపులకు అటూ ఇటూ చెవులనేవే అడ్డు లేకపోతే, అవి తల చుట్టూ తిరగ్గలిగేవే సుమా!

మూడు బాణాలతోనే మూడులోకాల్నీ జయించగల మన్మథుని నువ్వు పూబాణం వంటిది ఈమె ముక్కు. ఈమె నోరు తీయని పూలతేనెల సంపుటం. పళ్ళచిగుళ్ళు దానిమ్మగింజల్ని, పలువరుస మంచిముత్యాలసరాల్ని గుర్తు చేస్తున్నాయి.

ఈమె మాటలు వింటుంటే – సరస్వతీదేవి వీణ మీటుతున్నదేమో అనిపిస్తున్నది, కోయిలలు ఈమె వద్దనే పాటలు నేర్చుకుంటున్నాయేమో! సృష్టికర్త ఈమె నడుమును సన్నంగా చేయడం వల్ల మిగిలిన మాంసకృత్తులన్నీ కలిపి రొమ్ములను బరువుగా ఏర్పరచాడనుకుంటాను. ఈమె చెవులు శ్రీకారాన్ని, కంఠం శంఖువునూ సూచిస్తున్నాయి.

ఈమె పాదాలు పగడాలమీద కోపించి ఎర్రనై, లక్ష్మీనివాసమైన పద్మాల వలె ఉన్నాయి. ఈమె మోము, కుచాలు, చేతులు, పాదాలు, గోళ్ళు కూడా పూర్ణ చంద్రబింబాల్లా ఉండి చతుష్షష్టి కళలు మొత్తం ఈమెలోనే కాపురమున్నట్లు తోపింపచేస్తున్నాయి" అని ఆమె అంద చందాలను వర్ణించుకుంటున్నాడు.

ఈ విధంగా తాను కనిపించకుండా ఉంటే దేవతల దౌత్యం నెరపలేనని, నలుడు అదృశ్యరూపాన్ని వదలి, నిజ స్వరూపంతో దమయంతికి ప్రత్యక్ష మయ్యాడు.

## నలదూత్యము

**న**లుడు సహజ సుందర మోహనమూర్తిగా ప్రత్యక్షమయ్యేసరికి దమయంతికి ఆశ్చర్యం, సిగ్గు , తత్తరపాటు కలిగాయి. సభలోని ఇతర యువతులంతా కూడా – కాళ్ళ గజ్జెలు, కంకణాలలోని రత్నాలు ఝణఝణమని మ్రోగినట్లు హడావుడిగా లేచి అతనికి నమస్కరిస్తున్నారు. ఈ దృశ్యం జేగంలు మ్రోగించి దేవినికి సమస్కరిస్తున్నట్లు తోచింది.

దమయంతి రాచమర్యాద లెరిగిన ధీరవనిత కాబట్టి అంతలోనే తన తత్తరపాటు కనిపించకుండా సర్దుకుని సింహాసనం మీదనే మరింత ఠీవిగా కూర్చుంది. మనసెంతో ఆనందంతో పరవశం చెందుతున్నా "ఎవడవు! ఎక్కడ నుంచి వచ్చావు ? ఎలా లోపలికి వచ్చావు ?" అని అడగాలనుకుంది. కాని అతడు విష్ణువో, చంద్రుడో, ఉపేంద్రుడో, మన్మథుడో ననే సందేహాలు కలిగి నోరు పెగలడం లేదు.

లోగడ రాజహంస ఒక ఆకుమీద తన ప్రియుని రూపాన్ని గీసి ఇచ్చింది. ఇతని పోలికలు అచ్చుగుద్దినట్టు అలాగే ఉన్నాయి. కనుక ఇతడు నలుడేనని అనుకుంది. కాని – ఈ అంతఃపురంలోకి మానవులు అనుమతి లేకుండా రాలేరుగదా, ఇతడు నలరాజు కాదేమోనని సందేహించింది.

ఎప్పుడూ ప్రియునే ఊహించుకుంటూ, అతను తన ప్రక్కనే ఉన్నట్లు భావించడం అలవాటైపోయింది. గనుక – ఈ దృశ్యం కూడా ఊహయే కావచ్చు ననుకుంది కూడాను, సఖీజనం కూడా ఏమీ మాట్లాడడంలేదు. అందువల్ల తానే ధైర్యం చేసి అతనితో మాట్లాడసాగింది.

"మహాశయా ! వచ్చిన వారికి ముందుగా అతిథి మర్యాదలు చెయ్యడం ధర్మమని ధర్మశాస్త్రోపనిషత్తులన్నీ చెబుతున్నాయి. అదుగో బంగారుపీఠం. ఇష్టముంటే దానిమీద కూర్చోండి. ఏదైనా తొందర పని మీద మరెక్కడికో వెడుతున్నారా ఏం ? లేత ఆకులు, పువ్వులకంటే సున్నితంగా ఉన్న మీ పాదాలు కందిపోయేటట్టు చాలా దూరం నడిపించిన మీ మనసు ఎంత కఠినమైనదండీ!

ఏ దేశం నుండి వస్తున్నారు. ఎక్కడికి వెళుతున్నారు ? మీ గుర్తూ, పేరూ ఏమిటి ? రక్షకభటులు విచ్చుకత్తులతో కాపలాకాస్తున్నా ఈ అంతఃపురం లోకి ఎలా వచ్చారు ? ఇంత సాహసం చేసింది మమ్మ అదృష్టవంతుల్ని చెయ్యడానికేనా, లేక మరేదైనా కారణం ఉందా ? నీలిరంగు దేవుడివా, మన్మథుడివా, చంద్రుడివా ? లేక నిజంగా నిషధ రాజగు నలుడవేనేమో నిజం చెప్పు!" అంటూ అనేకవిధాల అతన్ని పొగుడుతూనే మనసులో తోచిన ప్రశ్నలన్నీ వడివడిగా అడిగింది.

అంతలో పరిచారికలు అతని కొక రత్నఖచిత స్వర్ణపీఠం వేశారు. నలుడా ఆసనం మీద కూర్చుని దమయంతీ సఖు లిచ్చిన అతిథి మర్యాదలు స్వీకరించారు. అతడేం చెబుతాడోనని దమయంతి, ఆమె పరివారమూ కుతూహలంతో ఎదురు చూస్తున్నారు. నలు డీ విధంగా చెప్పసాగాడు!

"నేను దిక్పాలుర వద్దనుండి నీ వద్దకు దూతగా వచ్చాను. వాళ్ళు చెప్పి పంపిన కార్యభారం నాకు ప్రాణసమానం, నే తెచ్చిన రాయబారాన్ని సఫలం చేస్తే అదే నాకు అతిథి మర్యాదగా భావిస్తాను. అసలు సంగతి వినడానికి నీ కిప్పుడు తీరుబడే గదా ? దేవతల రాయబార రహస్యం ఇక్కడే చెప్పవచ్చునా ? మనవాళ్ళు తప్ప ఇతరు లిక్కడ లేరుగదా ? అయితే చెబుతున్నా, శ్రద్ధగా విను.

ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు నన్ను పంపించారు. నారద మహాముని నీ అందచందాల్ని గురించి వారితో చెప్పాడట. అప్పటి నుంచీ వారికి నీ మీదనే మనసులు లగ్నమై విరహ వేదనలు పడుతున్నారు.

వారిలో ఇంద్రుడు మరీ బాధపడుతున్నాడు. నందనోద్యానంలో విహరించడం లేదు; కల్పవక్షం మీద నున్న ఏ కోకిలైనా కూస్తే మదనజ్వరం మరింత ఎక్కువౌతుందని భయపడుతున్నాడు. మన్మథుని బాణాలు కోటాను కోట్లుగా తగిలిన ఇంద్రుని హృదయం అంతకంటె రెట్టింపుగా నిన్ను కోరుకుంటున్నది.

మన్మథుడు పూర్వం మూడు కన్నులున్న శివుని ఎదిరించి భస్మమై అనంగు (శరీరం లేనివాడు) డైనాడు; ఇప్పుడు వేయి కన్నుల ఇంద్రునికి కోపం వస్తే ఏమైపోతాడో పాపం! ఇంద్రుడు లోగడ ప్రతినిత్యమూ శివుని పూజించే వాడు. ఇప్పుడలా పూజించేప్పుడు శివుని తలలో ఆభరణంగా ఉన్న చంద్రుడు తన మదజ్వరాన్ని మరింత పెంచుతాడనే భయంతో శివపూజలే మానుకున్నాడు.

అడిగినవారి కోరికలన్నీ తీర్చగల దేవలోకపు పూలకు దేవేంద్రుని మదనతాపాన్ని తీర్చేశక్తి లేకపోయిందంటే – నిజంగా నువ్వెంత అందగత్తెవో! మన్మథుడు ఎడతెరిపి లేకుండా పుష్పబాణాలు విడుస్తున్నందు వల్ల కలుగుతున్న చెరుకువింటి నారి ధ్వనులకు ఇంద్రుని చెవులు చెవుడై పోయాయి. బ్రహ్మ 'ఇది తప్పయ్యా' అని నీతిశాస్త్రాలు చెబుతున్నా ఇంద్రుడు నీ మీది ప్రేమను తగ్గించుకోలేకపోతున్నాడు.

సకల దేవతలూ పూజించే దేవేంద్రుడే నిన్ను మనసులో పూజిస్తున్నా డంటే – నువ్వెంత భాగ్యశాలివి !

ఇక అగ్నిదేవుని సంగతి సరేసరి. అతడు లోగడ మన్మథుని కాల్చి బూడిద చేసినందుకు మన్మథుడు ఇప్పుడు కసి తీర్చుకుంటున్నాడు. సకల

సౌందర్యరాశివైన నీ బలంతో పుష్పబాణ పరంపరలు అగ్నిపై కొడుతూ వేధిస్తున్నాడు. యజ్ఞ యాగాలలో, నిత్యాగ్ని పూజలలో ముల్లోకాల భక్తులూ సమర్పిస్తున్న నేయి అగ్నిదేవునికి రుచించడం లేదు. అతని జీర్ణశక్తి నిన్ను గురించిన ఊహలతోనే నిండి మందగించింది. పంచామృతాలంటేనే అతనికి డోకు వస్తున్నది.

మదజ్వరం ఇంకా పెరుగుతందనే భయంతో అర్చకు లర్పించే పూల వంకైనా చూడడం లేదు.

యమధర్మరాజు నీ మీద విరహంతో నిద్రాహారాలు మాని తెల్లబడి పోతున్నాయి. నిన్ను ప్రేమించిన విరహతాపం మంటలై వర్షదేవుని నీటి నంతటినీ ఆవిరి చేసివేస్తున్నది. అతనికిప్పుడు వర్షించేశక్తి సన్నగిల్లిపోయింది.

ఈ విధంగా దిక్పాలురు నలుగురూ కూడా తమ స్వర్గలోక సుఖ భోగాలను, కాంతా పరివారాలను, శక్తి యుక్తులను మరచి రేపు నీ స్వయంవరో త్సవంలో పాల్గొనాలని ఇక్కడికి వచ్చారు. మీ కోట బయట వేచి ఉన్నారు. నీ పొందుతో తమ శరీరాలు ధన్యం చేసుకోవాలని, నీ ప్రేమ చూపులతో తాము విరహంతో కోల్పోతున్న ప్రాణాలను రక్షించుకోవాలని నాకు అదృశ్యవిద్య నేర్పి ఇలా రాయబారిగా పంపించారు.

ఆ దేవతారాజులు నీతో ప్రత్యేకంగా 'మేము మన్మథుని మీద ఒట్టు వేసి చెబుతున్నాం – నీ అడుగుల క్రింద దుమ్మును కూడా మా ప్రాణాలతో సమానంగా భావిస్తున్నాం. మా దైవత్వాన్ని నీకు ధారపోస్తామని చెప్పడానికి సిగ్గుగా ఉంది. నీ అంతటి అందగత్తె మా లోకంలో కూడా లేదు గనుక నువ్వు మాకంటె గొప్పదాని వనుకుని, మేమందరం నీ పాద దాసులంగా ఉండ దలచాము' అని చెప్పవలసిందన్నారు.

ఆ దేవప్రభువులు చెప్పమన్న విశేషాలు నా శక్తివంచన లేకుండా నీకు చెప్పాను. ఆ నలుగురిలో ఎవరో ఒకర్ని వరించి నా రాయబారం ఫలించేట్లు చెయ్యి" అని నలుడు ఆమెవంక ఆసక్తితో చూచాడు.

దమయంతి సహజ చాతుర్యంతో ! "ఏ ప్రశ్నకైనా సూటిగా సమాధానం చెప్పాలిగాని, యుక్తితో అసలు ప్రశ్నను దాటవెయ్యడం మనిద్దరికీ మంచిది కాదు. నీ పేరూ ఊరూ ఏమిటయ్యా అని అడిగితే ఎంతసేపూ మరెవరినో తెగబారెడు వర్ణిస్తావేమిటీ ? నీ మాటలు ఒక్కోసారి ప్రత్యక్షంగా చెబుతున్నట్టు, ఒకోసారి పరోక్షంగా అంటున్నట్టు కుతూహలం కలిగించాయి. దిక్పాలకులు ఎంత గొప్పవారైనా కావచ్చు గాని – నీ వివరాలమీదే నాకు ఆసక్తి ఎక్కువ యింది. దాహమైనవారికి మంచినీరు రుచిగానీ, నెయ్యెందుకయ్యా ?

నే నడిగిన మొదటి ప్రశ్నలకు నీవు సమాధానాలు అప్పుపడ్డావు, ఇప్పుడైనా ఆ బాకీ తీర్చుకోమ"ని హెచ్చరించి ఊరుకుంది. నలుడు కూడా చమత్కారంగానే బదులు చెప్పాడు.

"దేవీ! ఎవరి వంశాన్ని గురించి వారు చెప్పుకోవడం తప్పు. ఒక వేళ హీనవంశమైతే చెప్పడం సిగ్గుచేటు. గొప్ప వంశమైతే స్వోత్కర్షా దోషం (స్వంత భజన) అంటుకుంది. పైగా నేను మరొకరి దాసుడుగా నీ వద్దకు వచ్చాను. రాకుమార్తెవు, గౌరవించదగిన దానివీ గనుక కొన్ని అంశాలు మాత్రం చెబుతాను.

నేను రాజవంశంలో పుట్టాను. ఏదో ఒక దేశాన్ని పాలిస్తున్నాను. ఇక – నా పేరడుగుతావా, అలాంటి ప్రశ్నే వద్దు. శాస్త్ర నియమాచారాల ప్రకారం ఎవరి పేరు వారు చెప్పుకోవడం దోషం. అదీగాక – మనమిద్దరం ముఖాముఖీ మాట్లాడుకుంటున్నప్పుడు, పేరులు వివరాలతో అవసరమేముంది ? నా మాటలు నీకూ, నీ మాటలు నాకూ బాగానే వినిపిస్తున్నాయి గదా ?" అని తన వివరాలు చెప్పక తప్పించుకున్నాడు.

దమయంతి అతన్ని అంతటితో వదలదలచలేదు. "వంశం పేరు చెప్పి, మీ పేరూ, వివరాలు చెప్పక పోవడం మమ్మల్ని గౌరవించి నట్లేనా ? మమ్మల్ని ఈ విధంగా మోసం చెయ్యాలనుకుంటున్నారేమో, మేం కూడా మోసం చెయ్యగలం. నీకు పేరు చెప్పడమే నామోషీ అయితే, మాకు నీతో మాట్లాడ్డం తప్పు కాదా ? మా వంటి రాచకన్నెలు పర పురుషులతో ఇంతసేపు ఇన్ని రహస్య విశేషాలు మాట్లాడడం తప్పు కాదా ? అందులోనూ – నీ అంత అందగాడితో అంతఃపురమందిరంలో ఇంతసేపు మాట్లాడుతూన్న కన్నెను గురించి ఇతరులెంత అపోహపడతారో నీకు తెలియదా ?" అని నిష్ఠురంగా అడిగింది.

నలుడామె చతురతకు మురిసిపోయాడు. తప్పించుకోగల ఉపాయా లింకేవీ కనిపించడం లేదు. అందువల్ల తన రాయబార విశేషాలనే త్వరత్వరగా చెప్పసాగాడు.

"దేవీ! నా మీద నీలాపనిందలు వెయ్యడం దేనికి ? నీ ప్రేమను ఆ దిక్పాలుర మీదికి మరలించి నా రాయబారం సఫలం చెయ్యి. నన్నింత గౌరవించినందుకు కృతజ్ఞుణ్ణి. నా కోసమైనా దిక్పాలురలో ఒకర్ని వరించ వలసిందని చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. అవతల దేవేంద్రుడూ, ఇతర దిక్పాలురూ విరహవేదనలతో నా కోసం ఎదురు చూస్తుంటారు. నే వెళ్ళడం ఆలస్యమైతే వాళ్ళ ప్రాణాలు ఏమైపోతాయో! చల్లనిమాట చెప్పి నాకు శెలవిస్తే వెళతాను" అని తొందరపెట్టాడు.

దమయంతి "మీ మాటలకు నవ్వు వస్తున్నది. నవ్వితే గర్వమను కుంటారు. నా ప్రశ్నలకు సమాధానం చెప్పవలసిందేనని పట్టుబడితే మరీ పెంకిపిల్లని అంటారు. కనుక నే అసలు విషయం చెబుతున్నాను.

అనేకమంది దేవతాంగనలున్న దేవేంద్రునికి ఈ నరకాంతతో పొత్తు తగదు. నేను అతని కర్పూరాలినీ కాదు, ఆయనంత కక్కుర్తి పడవలసిన

అవసరమూ లేదు. ఏ జంతువైనా స్వజాతితోనే జంటను చూసుకుంటుంది గాని, ఏనుగు లేడిని పెళ్ళాడుతుందా ? నేను అమరలోకపు రాజును ఎలా ప్రేమిస్తాను.

ఒకరిని ప్రేమించినదాన్ని, పొగడ్తలతోగాని, నిందలతోగాని మరొకర్ని ఎక్కువగా తలచడం పతివ్రతల ధర్మం కాదు. నేను నిషధ రాజైన నలుని ప్రేమించాను. ఆయన నన్ను ప్రేమించకపోతే అగ్నిలో పడి ప్రాణాలర్పిస్తానే గాని, మరొకర్ని జన్మజన్మలా తలచను. ఇదే నా శపథం" అని ఖచ్చితంగా, బిగ్గరగా చెప్పివేసింది.

తనకు నచ్చిన కూత మళ్ళీ మళ్ళీ వినాలని రెట్టించే కోకిలలాగా నలుడు ఆమె మాటలు మళ్ళీ వినాలనే కుతూహలంతో సంభాషణను పొడిగించాడు.

"అయ్యో! నీకు లౌకికం బొత్తిగా తెలియనట్లుంది. సిరి రా మోకాలొడ్డుతున్నావు. అమరలోకపు రాజే కోరి వస్తే వద్దు పొమ్మనే స్త్రీ ఉంటుందా ? యాగాల వల్ల కూడా లభించడం కష్టమయ్యే దేవత్వం నీకు వెక్కసమయిందా ? ఇనుము రసయోగంతో బంగారం కావడానికి ఇష్టపడకుండా ఇనుముగానే ఉంటా నన్నట్టుంది నీ ధోరణి.

నీవు కాదు కూడదన్నా దిక్పాలురు తమ కోరికలు సాధించుకోకుండా ఊరుకోరు. వారిని తప్పించుకుందామనే పాతివ్రత్యంతో – తాళ్ళతో ఉరి బెట్టుకుంటే దేవేంద్రునికి దక్కుతావు, నిప్పుల్లో దూకావంటే అగ్నికోరిక తీరుతుంది. ఏ నీటిమడుగులో మునిగినా వరుణుడు స్వీకరిస్తాడు, ఏ విధంగా ప్రాణాలు పోగొట్టుకున్నా యమునికి దక్కుతావు గదా! నా మాట విని వారిలో ఒకర్ని వరించు.

స్త్రీల మాటలకు వక్రార్థాలుంటాయట! వద్దు వద్దంటే – కావాలనే అర్థంతో అంటున్నావా ఏం ? అయితే నేను చెప్పిన నలుగురిలో ఎవరు

కావాలంటున్నావో చెప్పు. ఈ ఎన్నిక లోనే నీ తెలివితేటలు బయటపడతాయి" అని నలుడు సరసవాక్యాలతో ఆమెను కవ్వించాడు.

చెక్కిలికి చేయి చేర్చుకుని ఆసక్తితో అతని మాటలు వింటున్న దమయంతి 'నా' మాట లితనికి అర్థమైనట్టు లేవే ? అని విచారిస్తూ, నలునితో ఇలా చెప్పింది :

"నీవు పలికే పలుకులు నాకు ములుకుల్లా ఉన్నాయి. పరపురుషుల్ని నా వద్ద పొగడవద్దయ్యా అంటే  అదేపనిగా ఆ దేవతల్ని అభివర్ణిస్తున్నావు. వారి దూతవు గనుక నీ కిది సహజమే గాని నాకు బాధాకరం.

నా స్వయంవర సమయం దగ్గరైంది. ఇప్పుడీ అనవసరపు మాట లెందుకు. అంతవరకూ ఓపిక ఉంటే నువ్విక్కడే ఉండు. ఆ ఘడియ కోసం చాలామంది ఎదురు చూస్తున్నట్లే ఆ వేల్పులు కూడా ఎదురు చూస్తూంటారు గాని పుట్టి మునిగి పోదులే! నువ్విక్కడ నుంచి వెళ్లకపోయినా ఫరవాలేదు.

లోగడ ఒక రాజహంస నాకిచ్చిన పటాన్నిబట్టి ఆ నలుని పోలికలు నీలో కనిపిస్తున్నాయి. నిన్ను చూస్తుంటే నాకెంతో సంతోషంగా ఉంది. అయితే దేవతల పాణిగ్రహణం చెయ్యడం నా చేతికి పీడాకరమని గ్రహించి వారిని గురించి మాట్లాడ్డం మానెయ్. నీకు దణ్ణం పెడతాను" అని దమయంతి ప్రార్థించింది.

ఆమె మాటలూ, దృఢనిశ్చయమూ నలుని మనసును వశం చేసుకు న్నాయి. అయినా దేవతల దూతగా వచ్చిన బాధ్యతలను మరువకుండా, మళ్ళీ సంభాషణ ప్రారంభించాడు.

"నీ నిశ్చయం ఎలా ఉన్నా దిక్పాలురు తలచుకుంటే నువ్వేమీ చెయ్యలేవు గదా! దేవేంద్రుడు కల్పవృక్షాన్ని కోరితే నిన్నెత్తుకుపోయి ఇవ్వదా ? కోరికలు

తీర్చే సప్తశిఖలతో అగ్ని నిన్ను లాక్కుపోతుంటే ఎవరడ్డు రాగలరు ? యముడు తన పాశాన్ని వదిలితే నువ్వు తప్పించుకోగలవా ? వరుణుడు కామధేనువు నడిగితే నిన్ను తీసుకుపోయి అతనికి అర్పించదా ? దిక్పాలుర మీద భక్తి లేకపోతే అన్ని పనులకూ అడ్డంకులే కలుగుతాయి సుమా!" అని హెచ్చరించాడు.

ఇష్టంలేని మాటలు పదేపదే వినవలసి రావడం వల్ల దమయంతి హృదయానికి కష్టం వేసింది. దూత చెప్పినట్లు జరిగితే తనకు దిక్కుండదనే భయంలో కళ్ళు కరిగి దుఃఖాశ్రుధారలు కార్చసాగింది. పద్మాల్లాంటి కళ్ళకు ఈ అశ్రుధారలే కాడలేమో ననిపించింది. ఈ కన్నీరు ముత్యాల హారాల మీద పడుతుంటే ముత్యాలరంగు నీలిగా, పచ్చగా మారిపోతూంది. కన్నీరు చనుమొనలపై పడుతుంటే, ఆ మొనలచుట్టూ ఉన్న నలుపు మచ్చలు తుమ్మెదల్లా కనిపిస్తున్నాయి.

దమయంతి ఆ విధంగా తలవంచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంటే, నలుడు చూడలేకపోయాడు. చిరకాలంగా ఆమెమీద పెంచుకున్న ప్రేమ, విరహం కట్టలు తెగి ప్రవహించడంతో నలుడు దేవతల రాయబారిననే సంగతి ఆ క్షణంలో మరిచిపోయాడు. తనను తానే మరచి ఊహాసుందరితో మాట్లాడు తున్నట్లు, పలవరిస్తున్నట్లు మాట్లాడనారంభించాడు.

## నలుని ఆత్మనివేదన

"**త**రుణీ! ఎందుకేడుస్తున్నావు ? పద్మం లాంటి నీ ముఖం పైకెత్తి ఇలా చూడు. నేను నిషధరాజగు వీరసేనుని కుమారుణ్ణి, నలుణ్ణి !

నీవిలా దుఃఖిస్తుంటే – పూలరేకుల వంటి నీ పెదవులు నిట్టూర్పుల వేడికి పగిలి బీటలువారుతున్నాయి. నీ గొంతు గద్గదం అవుతూంది. ఎందుకింత విచారిస్తున్నావు? నే చెప్పిందంతా తప్పా ? నే నిక్కడ ఉండడం అపరాధమా ? ఈ అంతఃపురంలో ప్రవేశించడం పాపమా ? దేవదూతగా

ఉండడం తప్పా ? దూతలు ఎక్కడ ప్రవేశించినా తప్పులేదు గదా ? నాది తప్పంటే నీ పాదాలు పట్టుకుని క్షమాపణ కోరుకుంటాను.

నన్ననుగ్రహించు. కరుణతో చూడవలసిందని కోరుతూంటే పిడికిలి బిగించి కొట్టవద్దు. నీ మనసు తేటపడాలి. నీ మొహం కళకళా వికసించాలి, నీ పెదవుల మీద చిరునవ్వులు మొలకెత్తాలి, నీ క్రీగంటి చూపులు నాపై ప్రసరించు. నీ దుఃఖాశ్రువుల్ని ఆనందభాష్పాలుగా మార్చి వెన్నెల్లాగా నవ్వు దేవీ !

నీ తీయని మాటలతో నా చెవుల్ని ధన్యం చెయ్యి. నిన్ను కౌగిలించుకోవాలనిపిస్తుంది. నీ రొమ్ములకు సేవలు చేయనియ్. దయతో ఒక్క ముద్దివ్వు ! నీ చను మొనలమీద నా గోళ్ళతో ఒక్కసారి గుచ్చనియ్!'' అని మదన జ్వరాతిరేకంతో పలవరించుతున్నాడు.

మళ్ళీ అంతలోనే అతనికి లోకజ్ఞానం కలిగింది. తా వచ్చిన పని గుర్తువచ్చింది. ప్రేమోన్మాదంలో పడి, బాధ్యతలు మరచి దేవతలకు అన్యాయం చేశానే అనే చింతతో మనసులోనే ఇలా అనుకున్నాడు.

'ప్రేమ అనే భ్రాంతిలోపడి, వారు చెప్పిన పనికి భంగకరంగా ప్రవర్తించినందుకు – అందరి హృదయాల్లోని భావాలూ ఇట్టే గ్రహించే దేవేంద్రాది దిక్పాలకులు నన్ను ఎంత తప్పుబడతారో ? నా పేరు చెప్పడం వల్ల, ఆ దేవతల పనికి భంగం కలిగించి ఉంటాను.

పూర్వం పరోపకారబుద్ధితో దూతగా వ్యవహరించిన ఆంజనేయుడి లాగా నేను ప్రవర్తించలేకపోయాను. నాబోటి ఉన్మాదులు రాయబారులుగా తగరు. ఇక ఇప్పుడేడ్చి మాత్రం ప్రయోజనం ఏముంది ? దేవుని విచిత్ర మహిమ వల్ల నాకు లోకజ్ఞానం పోయింది. ఆ సమయంలో దైవ కార్యమంతా చెడగొట్టేశాను. దేవుని గీటునుంచి తప్పించుకోవడం ఆ దేవతలకైనా చేతకాదు గదా!'

దేవదూతగా వచ్చినవాడు నలుడని స్పష్టం కాగానే దమయంతి దిగ్గున లేచి, కన్యలకు సహజమైన సిగ్గుతో ఒక పట్టుతెర చాటుకు వెళ్ళి, ప్రియుణ్ణి ఓరగంట చూస్తూ నుంచుంది. ఆమె శరీరం ఆనందంతో పూలు పూసినట్లు పులకరించింది.

ఇంతవరకు మాట్లాడినవాడు తన ప్రియుడని తెలియగానే ఆమె ఇక ముఖాముఖి మాట్లాడలేక – చెలికత్తెను పిలిచి తన మదిలోని మాటలాయనకు చెప్పవలసిందని నేర్పి పంపింది. ఆ చెలికత్తె నలుని వద్దకు వెళ్ళి “మా దేవిగారు– ‘ఎన్ని కష్టనష్టాలు వస్తాయని తెలిసినా అడిగినవారికి లేదనకుండా అభయమిచ్చి రక్షించే మీరు – మన్మథబాణాల దాడికి భయపడుతున్న నన్ను రక్షిస్తానని అభయమివ్వరా ?’ అని అడుగుతున్నారండీ.

అంతేగాక ‘ఆ మన్మథుని బంధువులైన దేవతలెవరు వరించవలసిందని అడిగినా వారిని చండాల జాతివారుగా భావిస్తారు. వారి గాలి సోకకుండా నాకు అభయం ఇవ్వరా ?’ అని అడుగుతూందండీ” అని చెప్పింది.

ఈ సమ్ముఖ రాయబార వాక్యాలు నలునికి ఎంతో ఆనందం కలిగించినా, తాను దేవతల దూత గనుక మనసులోని కోరిక చెబితే తన బాధ్యత నిర్వర్తించినట్లు కాదని ఎంచి మాట్లాడకుండా ఊరుకున్నాడు.

ఈ మౌనానికి దమయంతి భయపడింది. ‘ఈయన నిక్కచ్చిగా దూతగానే వ్యవహరిస్తున్నాడు. ఇంతకు ముందు జరిగిన సంభాషణలలో నేనేమయినా పొరపాటుగా మాట్లాడానేమో’ అని చింతిస్తున్నది. నలుడు కూడా : ‘త్రికరణ శుద్ధిగా ప్రయత్నించినా దేవతలంపిన పని సఫలమయ్యేట్టు లేదే’ అని విచారిస్తున్నాడు.

# హంసాగమనము

ఈ సంగతులు ఎప్పటికప్పుడు దేవలోకంలో తెలుస్తూనే ఉన్నాయి. తను మెచ్చిన ప్రేయసీ ప్రియులు విచారంలో మునిగివున్నారని గ్రహించగానే రాజహంస క్షణంలో దివి నుండి భువికి దిగివచ్చింది. నల దమయంతులు దాన్ని చూడగానే కొంత తేరుకుని కుశలాలడిగారు.

అప్పుడా హంస ! "నలరాజా! నీ మనసు నిర్మలం. నీ గొప్పతనాన్ని వర్ణించలేము. నీవు దూతగా వ్యవహరించిన తీరును లోకాలన్నీ కీర్తిస్తాయి. ఆ దిక్పాలురకు మాత్రం నీ స్వభావం తెలియదటయ్యా ? మరి ఇంకా విచారించడం దేనికి ? ఊరడిల్లు" అని ధైర్యం చెప్పింది.

ఆ హంస దమయంతితో "రాకుమారీ! ఇంక సందేహాలతో బాధపడకు. ఈ నలుడే నీకు మగడౌతాడు. ఈ సంగతి ఏనాడో బ్రహ్మ దేవుడే చెప్పాడన్నాను దగటమ్మా! ఆయన మాట అబద్ధం అవుతుందా ఏం ?" అని ప్రోత్సహించింది.

ఆ ఇద్దరినీ ఉద్దేశించి ! "దంపతులకు శుభం. ఆ తరువాత జరుగవలసిన స్వయంవరం, పెళ్ళీ నిర్విఘ్నంగా కొనసాగుతాయి. అక్కడ నాకు బ్రహ్మను సేవించవలసిన పని ఉంది. మీరు విచారగ్రస్తులై ఉన్నారని ఊరడించ వచ్చాను. ఇక వెళ్ళివస్తాను మరి" అని శెలవు తీసుకుని వచ్చినంత వేగంగా దేవలోకానికి వెళ్ళిపోయింది.

ఆ రాజహంస చెప్పిన మాటలతో నల దమయంతులకు చింత తొలగి, ధైర్యానందాలు కలిగాయి, నలుడు తన మనసులో దిక్పాలురను తలుచుకుని నమస్కరించి :"నా మనసులో మీయందున్న భక్తిని గ్రహించండి. నేను ఈ సందర్భంలో తప్పు చేశాననుకుంటే వెంటనే నాకు కఠిన శిక్ష విధించండి. ఈమె దగ్గరలోవుండి నా విరహాన్ని దాచుకోలేక పోతున్నాను – తరువాత నన్ను నిందించకండి" అని మౌనంగా విన్నవించాడు.

దమయంతి తెరచాటునుంచే : "రాకుమారా! నేను ఆత్మశుద్ధిగా పతివ్రతను, నిన్ను కోరి వరించడం మిగతావారి నందరినీ అవమానించడం కాదు గదా! రేపు ఆ దిక్పాలకుల్ని భక్తితో ప్రార్థించి – స్వయంవరోత్సవంలో మిమ్మల్నే వరిస్తాను. అన్ని లోకాల ధర్మాలు తెలిసిన దేవతలు అసూయతో ప్రవర్తించరులెండి" అని దిటవుగా చెప్పింది.

ఈ విధంగా ఆ ఏకాంత సభామందిరంలో ఆ ప్రేయసీ ప్రియులిద్దరూ అంతసేపటినుంచీ మాట్లాడుకుంటున్నవన్నీ, అదృశ్యంగా వచ్చి పొంచివున్న దిక్పాలురు నలుగురూ మొదటి నుంచీ వింటూనే ఉన్నారు. వాళ్ళు నలుని కూడా అదృశ్యరూపునిగా చేసి తమ వెంట – స్వయంవరానికి వచ్చినవారి విడుదులున్న చోటికి తీసుకువెళ్ళారు.

## స్వయంవరాగతులు

ఇంద్రాది నలుగురు దిక్పాలురూ నలుని చిత్తశుద్ధి కెంతో సంతోషించి 'నీ తప్పులే'దని నలుని పంపించారు. విదర్భరాజు పరివారం నలునికి కూడా మంచి విడిది నిచ్చింది. దిక్పాలురు దమయంతి తమను వరించలేదని చింతించారు. తుది ప్రతయ్నంగా – తాము కూడా నలుని రూపాలు ధరించి స్వయంవరోత్సవంలో పాల్గొని అదృష్టం పొందాలనుకున్నారు.

దమయంతీ స్వయంవరోత్సవంలో పాల్గొనడానికి సప్త సముద్రాల మధ్యనున్న భూలోకంలోని అన్ని దేశాల రాజులూ, రాకుమారులూ తమ ప్రత్యేక సైన్యాలతోను, పరివారంతోను, రథాదులతోను వచ్చారు. వారిలో భుజబల పరాక్రమాలకు పేరొందినవారు, అందంలో మన్మథునితో పోటీ పడగలవారు, కుబేరుడంతటి శ్రీమంతులు, అధిక విద్యావంతులు ఎందరో ఉన్నారు.

రాచకులంలో పుట్టి ఆ ఉత్సవానికి రానివాడు, దమయంతిని తలచి విరహం పొందనివాడు భూలోకంలో లేడంటే అతిశయోక్తి కాదు. వారిలో

కొందరు దమయంతి తమనే వరిస్తుందనుకుంటూంటే, మరికొందరు బలాత్కారంగా ఎత్తుకుపోయైనా ఆమెను పెళ్ళాడగలం అనుకుంటున్నారు. కొందరు ఆమె సౌందర్యాన్ని పొగిడితే చాలనుకుంటుంటే మరికొందరు ఆ ఉత్సవం చూస్తే చాలులెమ్మనుకుంటున్నారు.

కుండిన నగరం వెలుపలి ప్రదేశాలూ, విడుదులూ, వీథులు కూడా ఇసుక వేస్తే కింద రాలనంత జన సమ్మర్థంతో నిండిపోయింది. స్వయం వర సభాస్థలికి బయలుదేరి వెళుతూంటే రాకుమారులు తొక్కిసలాటలో నలిగిపోతున్నారు. ముందు వెనుక అటు ఇటు ఎటు చూచినా కిరీటధారులైన రాకుమారులే !

కర్కోటకుడనే నాగరాజు కోటిమంది నాగులు తన కీర్తి విశిష్టతలను పొగుడుతూ వెంటరాగా, తన పగడల మీద రత్నములు దశదిశలా వెలిగేటంతగా మెరుస్తూండగా, ఎర్రని కళ్ళతో ఠీవిగా బయలుదేరాడు. ఆ నగర పౌరులూ, ఇతరదేశాల నుంచి వచ్చిన వారూ కర్కోటకుని సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు.

శివుని మెడలో ఆభరణంగా ఉండే వాసుకి అనే నాగరాజు కూడా వచ్చాడు. ఆయన సభాస్థలికి వెడతూంటే వెంట అనేకమంది నాగకన్యలు మంగళగీతాలు పాడుతూ రెండువైపులా బారులుతీరి నడుస్తున్నారు. ఆ వాసుకి పగడపైనున్న మణులకాంతి ఆకాశమంతటా ప్రసరిస్తున్నది.

ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు కూడా బయలుదేరి ఉత్సవ స్థలానికి వెళుతున్నారు. శుక్రాచార్యుడు సలహా ఇచ్చినందువల్ల రాక్షసుడు రాలేదు. వాయుదేవుని వాహనానికి దమయంతి కన్నుల్ని చూస్తే సిగ్గని రానన్నదట – అందువల్ల వాయువు రాలేదు. కుబేరుడు తన అందాన్ని అద్దంలో చూచుకుని

తనే సిగ్గుపడి బయలుదేరలేదు. ఈశాన్య దిక్పాలకుడు అర్థనారీశ్వరుడు గనుక దమయంతికి తగనని రాలేదు. ఈ అడ్డంకులు లేకపోతే ఈ నలుగురు దిక్పాలకులు కూడా వచ్చేవారే!

కుండిన నగరమంతా రాకుమారి పెండ్లి సందర్భంగా అందంగా అలంకరించబడింది. రాజవీధుల ప్రక్క గోడల మీద రంగురంగుల లతలూ, బొమ్మలూ చిత్రించారు. కాని అన్నివేలమంది రాకుమారులు కిరీటాలు ధరించి వెళుతూంటే రాజనగరి అందాలు వెలతెలబోతున్నాయి.

ఈ అపూర్వ స్వయంవరోత్సవాన్ని చూడ్డానికి విష్ణువు శివుడు దేవతా పరివారంతో వచ్చి ఆకసంలో నిలచి ఉన్నారు. సనకసంనందనాది యోగులు, భరద్వాజాది మహర్షులు, తమ తమ మేళతాళాలతో సహా అప్సరసలూ కూడా వచ్చి ఆకాశం నుంచి ఈ ఉత్సవాన్ని చూస్తున్నారు.

సేవకులు తమ రాజులకు సుగంధద్రవ్యాలు పులిమి అగరుధూపాలు వేస్తున్నారు. చెలికత్తెలు వింజామరలు వీస్తుంటే ఈ సుగంధాలు గాలిలో కలిసి పైనున్న దేవతలకు ధూపనైవేద్యాలుగా అందుతున్నాయి.

నలుడు ఉత్సవానికి వెళుతుంటే రాజులందరూ ఆశ్చర్యంగా చూస్తూ తలలు వంచుకుంటున్నారు. సూర్యుని ముందు నక్షత్రాల్లాగా నలుని ముందు రాకుమారులు వెలవెల బోతున్నారు. అతని అందానికి మన్మథుడే సిగ్గు పడేట్టున్నాడు. దేవతలు కూడా నమస్కరించేంత అందంగా, ఠీవితో అతడు స్వయంవరోత్సవ సభలో ప్రవేశించి ఒక ఉన్నతాసనం మీద కూర్చున్నాడు.

అంతకు ముందే సభలో ప్రవేశించి ఉన్నతాసనాల మీద కూర్చున్న నలుగురు దిక్పాలకులూ నల దేవిధంగా ఉన్నాడో చూచి, తమ రూపాల్ని ఆ విధంగా మార్చుకుని అతనిలాగానే ఠీవిగా కూర్చున్నారు.

పాతాళ, భూ, నభోలోకాలనుంచి వచ్చిన వరులతో నిండిన ఆ సభ ముల్లోకవాసులకూ ముచ్చటగా కనిపించింది.

విదర్భరాజు వచ్చిన వారందరికీ తమసేవకులు తగు మర్యాదలు చేస్తున్నారని గ్రహించి సంతసించాడు. ఇంతమంది వరులను గురించి పేరుపేరునా ఒక్కొక్కరి గుణగణ విశేషాలను ఎక్కువ తక్కువ ల్లేకుండా దమయంతికి చెప్పాలంటే మానవమాత్రులెవ్వరికీ సాధ్యం కాదని – సరస్వతీ దేవియే ఇందుకు సమర్థురాలని రాజనుకున్నాడు.

భీమసేనుడు సరస్వతీదేవిని మనసారా పొగుడుతూ ధ్యానించే సరికి, ఆమె అతని భక్తికి మెచ్చి సాక్షాత్కరించింది. ప్రత్యక్షమైన దేవికి ఆ రాజుతో పాటు సభలోని వారందరూ కూడా చేతులు జోడించి నమస్కరించారు. భీముడు ఆమెను ప్రార్థించి దమయంతికి తోడ్పడ్డానికి దేవి నంగీకరింపజేశాడు.

## దమయంతి ప్రవేశము

**భీ**మసేనుడు లగ్నబలం, శుభ శకునాలూ అనుకూలంగా ఉన్నాయని తెలుసుకుని – వధువును తీసుకు రావలసిందని పరిచారికలకు ఆజ్ఞ ఇచ్చాడు.

అనన్యమైన అందచందాలన్నీ ఒకచోటనే రూపొందిచినట్లున్న దమయంతి పరిచారికలతో సభాస్థలికి వచ్చింది. అందరినీ ఆకర్షించగలంత సిద్ధమంత్రశక్తి ఆమె అందానికుంది. స్వచ్ఛమైన నీళ్ళలో బంగారం ప్రతిఫలిస్తున్న రంగులోన ఉంది ఆమె శరీరం. ఆమె కళ్ళచూపులు మన్మథ సందేశాలను తోపింప చేస్తున్నాయి. అసాధారణమణులతో హారాలు వ్రేలాడుతున్న వక్షంలోని రొమ్ములు మల్లయుద్ధంలోనైనా లొంగనంత దృఢంగా ఉన్నాయి. ప్రతి అంగము కూడా తీర్చిదిద్దబడిన సౌందర్యరాశిలా మెరిసిపోతోంది దమయంతి.

నవరత్నాలు రకరకాలుగా పొదగబడిన నానావిధ భూషణాలూ – ఆమె ధరించడం వల్ల బంగారానికి సువాసన అబ్బినంత అదృష్టాన్ని పొందాయి.

ఆమె కళ్ళ అంచులలో కర్పూర, కస్తూరి, రేఖలున్నాయి. కొంచెం పలువరుస కనుపించేటట్లుగా ఎడమైన నదరు పెదవులు సరస్వతీదేవి క్కూడా ముద్దు వచ్చాయి. ఆమె రాజహంసలకు నడకలు నేర్పే చందంగా లావణ్యంతో నడచి వస్తుంటే ప్రతి అంగమూ కదలి, ఆమె ధరించిన నగలు సన్నగా సంగీతం పాడుతున్నాయి. క్షణక్షణం కొత్త అందమేదో ఏ అంగంలోనో భాసిస్తున్నదని సభలోని వారందరూ రెప్పలార్పకుండా ఏకాగ్రతతో చూస్తూ, ఆమె అందాన్ని తేనెలాగా జుర్రుకుంటున్నట్లున్నారు.

అప్సరసలవంటి గాయనీమణులు రెండువైపులా నిలబడి శుభగీతాలు పాడుతూ వెంటరాగా దమయంతి వేదిక మధ్యకు నడచి వస్తున్నది.

## రాజుల ఆశ్చర్యము

**ద**మయంతి లోపలి గుమ్మం దాటి ఈవలకు రాగానే తమ కళ్ళ కరువు దీరా చూచినవారు 'అద్భుతం' అనుకున్నారు. ఆమె కొంచెం ఇవతలికి నడిచేసరికి – వారి శరీరాంగాలన్నింటినీ పులకింపచేసిన ఆమె అందానికి నమస్కరించాలని చేతులు జోడించి ఎత్తబోయిన వారు కూడా చాలా మంది ఉన్నారు.

ముక్కుమీద చూపుడు వేలు వేసుకుని, తల పంకించి, రెప్పల చివరలు అతుక్కునేట్టుగా కళ్ళు చిలికించి మళ్ళీ కనుబొమలు ఎడమయ్యేంతగా కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ ఆమె ఆనందాన్ని మెచ్చుకోనివాడు ఆ సభలో ఒక్కడు కూడా లేడు.

సభాసదులు దమయంతి అందాన్ని రకరకాలుగా మనసుల్లోనే వర్ణించుకుంటున్నారు.

"ఆమె మోము చందమామ వంటిది. నాభిస్థానం కూడా అలాంటిదే. కనుబొమలు కాముని బాణచాపాలు. రతీ మన్మథుల కేళీసౌధాల వరకూ పెరిగిన బంగారుకలశాల్లా ఉన్నాయి ఆమె చన్నులు. ఈమె లేలేత పూవులకంటె సుకుమారి. అటువంటి ఆమెకు తుంగనైనా కోయగలంత పదునైన గోళ్ళనెందుకు సృష్టించాడో ఆ బ్రహ్మ! బ్రహ్మ ఈమెను తయారుచేసేప్పుడే నడుమున పిడికిట బట్టుకుని, త్రాసుదండం లాగా ఎత్తి అటు ఇటు బరువు సమానంగా ఉండాలని – అటు కుచ ద్వయాన్ని, ఇటు పిరుదద్వయాన్ని సరి సమానముగా అమర్చివుంటాడు."

ఇంతలో దమయంతి తండ్రి సూచనపై సరస్వతీదేవికి నమస్కరించింది. శారదాదేవి వధువును పలురకాల ఆశీర్వదించింది. తలమీద అక్షింతలు చల్లి –సేవకులు భుజాలమీద మోసే "శిబిక" అనే వాహనం మీద ఎక్కించి, తాను కూడా ప్రక్కను నిలిచి సభాసదుల్లో ఒక్కొక్కరినే పరిచయం చేయనారంభించింది.

"అరుగోనమ్మా! అటు తూర్పుదిక్కున కూర్చున్నవారు దేవతలు. వారిలో ఒక్కొక్కరిని గురించి చెప్పాలంటే వేయి సంవత్సరాలు పడుతుంది. అందులోనూ వారు ముప్పై మూడు కోట్ల మంది ఉన్నారాయె! కనుక వారిలో మీకు ఎవరు నచ్చితే వారిని వరించు–నా బాధ్యత ఇంతటితో ముగుస్తుంది. నందనోద్యాన వనాలూ, చింతామణి వేదికలూ, మందాకినులూ వీరికి విహారస్థలాలు. అసలే కనురెప్పలు మూయనివారు, మరింత శ్రద్ధగా నిన్ను చూస్తూ ఆశపడుతున్నారు. అమృతం త్రాగే వీరికి నీ అధరామృతం మరెన్నో రెట్లు రుచిగా ఉంటుంది" అని దేవి చెప్పింది.

ఆ మాటలు వినగానే దమయంతి చేతులు జోడించి నుదురు కెదురుగా పెట్టుకుని, తలవంచి దేవతలకు నమస్కరించింది. అంతటితో తనకు వారిని

చూచే అవసరమైన లేనట్లు చూపులు తరువాతి వారిమీదికి మరల్చింది. ఆమెకు వేల్పుల మీద ఇష్టంలేదని గ్రహించిన వాహకులు శిబికను ముందుకు మోసుకు వెళ్ళారు.

## వాసుకి

"దమయంతీ! ఈయన వాసుకి, శివునికి చేతి కంకణంగా, మెడలో ఆభరణంగా, శిఖముడిపై పూవులా ఉంటూ ఆయన్ని పూజించే మహానుభావుడు. ఇతని రెండు నాలుకలలో – ఒకదానితో శివుని సిగలో ఉన్న చంద్రుడు ఇచ్చే వెన్నెల అనే అమృతాన్నీ, రెండో నాలుకతో నీవిచ్చే అధరామృతాన్నీ త్రాగవచ్చాడు. నీ అధరామృతం సేవిస్తేగాని ఇతనికి అసలు రుచంటే దేనిదో అర్థం కాదులే!

కేళీసమయంలో ఇతన్ని ముద్దుపెట్టుకుంటే హాని జరుగుతుం దనుకోకు. అతని నోటిలోని విషానికి మించిన శక్తిగల అమృతం నీ నోటిలో ఉందిలే!" అని సరస్వతీదేవి వివరించింది.

మణిమయ పీఠం మధ్య నిలచి, నేవళంగా ఉన్న తన శరీరాన్ని నిటారుగా నిగుడించి, పడగను విశాలంగా విప్పుకుని, నాలుకలు ఆశగా చాస్తూ వాసుకి ఆసక్తితో దమయంతిని చూస్తున్నాడు. అది గమనించిన ఆమె వళ్ళు గగుర్పొడిచింది. ఇతరులది చూచి 'ప్రేమించి పులకరించిందో, భయంతో వణికిపోయిందో' తెలియక తికమక పడుతున్నారు.

దమయంతి తలను అయిష్టంగా తిప్పుకుంది. శిబిక ముందుకు నడిచింది. ఆమె తమను ప్రేమించడం లేదని గ్రహించిన నాగరాజు లందరూ నిట్టూర్పులు విడుస్తూ బాధతో బుసకొడుతున్నారు. ఇక సభలోని వారందరూ తమ ఓటమికి ఎగతాళి చేస్తారేమోనని పడగలు ముడుచుకుంటూ చరచర బయటికి వెళ్ళిపోయారు.

## పుష్కరద్వీపాధిపతి

**అ**ప్పుడు సరస్వతి పుష్కరద్వీపాధిపతిని చూపించి : 'ఈయన పుష్కర ద్వీపాధిపతి. ఆ ద్వీప సముదాయంలోని ఇతర దీవులను ఏలే వారందరూ కూడా ఆ ప్రక్కనే వరుసగా కూర్చున్నారు. వారినందరినీ బాగా చూడు. అందరూ మహారథులే!

పుష్కరద్వీపం స్వర్గలోకానికి నాభిలా మధ్యలో ఉంటుంది. ఆ ద్వీపం చుట్టూ తీయని చల్లని మంచినీటి సముద్రం ఉంటుంది. అందొక మర్రిచెట్టునీడను, ఒక దివ్యమందిరంలో బాలకృష్ణుడు పవ్వళించి ఉంటాడు. పుష్కరద్వీపాధిపతిని పెండ్లాడి, నువ్వు భర్తతో కలసి ఆ దేవుని చూడ్డానికి వెళ్ళినప్పుడు ఆయన తాను సృష్టించిన నిన్ను చూచి 'చాలా గొప్ప శిల్పి'నని గర్విస్తాడు.

ఆ మర్రిచెట్టు పుష్కరద్వీపాని కంతటికీ గొడుగుపట్టి సేవిస్తున్న ట్టుంటుంది. దాని నీడ పడిన చల్లని నీటిలో మీరిద్దరూ జలకాలాడవచ్చును." అని చెప్పింది. దమయంతి తలను అడ్డంగా ఆడించడంలోనే అయిష్టతను తెలియజేసింది.

## శాకద్వీపాధిపతి

**స**రస్వతి ఆ కన్యను ముందుకు నడిపి – "ఇతడు శాక ద్వీపాధిపతి. పేరు హవ్యుడు. చాలా పుణ్యవంతుడు. అందంలోనూ, ప్రేమానుతాపం తీర్చడం లోను మన్మథునితో సమానుడు. తల సరిగ్గా ఎత్తి చూడు. ఇతన్ని వరించి ఎంతకూ తరగని ఐశ్వర్యాన్ని, ముసలితనం రాని జీవితాన్నీ అనుభవించు.

ఆ ద్వీపంలో శాకవృక్షం నీడను మీరిద్దరూ క్రీడిస్తూంటే – ఆ చెట్టు ఆకులు నీడలిస్తాయి. కొమ్మలలోని పిచ్చుకలు చిలుకలు మధురంగా

పాడుతూంటాయి. ఆ ద్వీపం చుట్టూ పాలసముద్రం ఉంది. అందులో శేష శయనుడై మహావిష్ణు ఉంటాడు.ఆయన్ని రోజూ స్వయంగా పూజించుకోవచ్చు.

పాలసముద్రం మీదినుంచి వచ్చే తీయని గాలులు పీల్చి పీల్చి బొజ్జ పెరిగిన ఒక నాగేంద్రుడు ఈ హవ్యునికి పాన్పుగా ఉంటుంది. శేషశయనుడైన విష్ణుమూర్తితో లక్ష్మిలాగా, ఇతనితో నీవు పవ్వళించి మన్మథునికి బుద్ధి చెప్పగలవు" అని వివరించింది.

అతడు కూడా దమయంతి కే మాత్రమూ నచ్చలేదు. శిబిక ముందుకు కదిలింది.

## క్రౌంచద్వీపాధిపతి

**స**రస్వతి మరొకర్ని చూపించి : "ఇతడు క్రౌంచద్వీపాధిపతి. భుజబల పరాక్రమాలలో మేటి. ఎటు చూచినా అంతు కనిపించని పెరుగు సముద్రంలో ఉన్న క్రౌంచద్వీపం చాలా అందంగా ఉంటుది. ఆ ద్వీపంలో ఉన్న క్రౌంచాచల మనే కొండ నీ పాదాలకు పూజ చేస్తుంది.

ఆ ద్వీపంలో నెలవంకను సిగలో ధరించిన శివుడుంటాడు. ఆయన్ని కోట్లాది పెరుగుబిందెలు నైవేద్యం పెట్టి పూజించు. లోపల ఉన్నవాడు బైటికి కనిపించే పారదర్శక స్ఫటిక సౌధాల్లో సయ్యాటలాడుతూంటే – దధి సముద్రం మీదినుంచి వచ్చే తీయని చలిగాలులకు నీ చెమట బిందువులు మంచుగుళికలై పటికగోడలతో కలసిపోతాయి. నీకు శ్రమే అనిపించదు" అని అభివర్ణించింది.

కాని – దమయంతి కతడు కూడా మనసు కెక్కలేదు. శిబిక మరికొంత ముందుకు వెళ్ళింది. శివప్రభావం పొందిన ఒక మహానుభావుడు అచటి పీఠం మీద కూర్చుని ఆసక్తితో దమయంతిని చూస్తున్నాడు.

## కుశద్వీపాధిపతి

సరస్వతి ఆతని గురించి ఇలా వివరించింది : "ఇతను కుశద్వీపాధిపతి. ఆ ద్వీపం నేతి సముద్రం మధ్య ఉంటుంది. ఇతన్ని పెళ్ళి చేసుకుంటే నీకు నిత్యం వసంత వైభోగ సుఖాలు లభిస్తాయి. నేతి సముద్రతీరాల్లో గల వనాలలో విహరించవచ్చు.

ఆ ప్రక్కనే నీకొక మహాద్భుతం నిత్యం కనిపిస్తూంటుంది. నేతి సముద్రంలో ఎగిరిపడుతూండే ఉధృతతరంగాలకు అలవోకగా ఊగుతూ, కత్తి అంచుమీద నృత్యం చేస్తున్నట్టు మందర పర్వతము కన్నుల పండుగ చేస్తుంది. అదొక స్తంభంలాగా ఆకాశంలోకి పెరిగి ఉంటుంది. దాని కే ఆధారంగాని, పునాది పీఠంగాని లేవు. అలల తాకిడికి మునిగి పోకుండా అంత పెద్ద కొండ నిలబడి ఉంటున్నదంటే అద్భుతం కాదూ మరి!

ఆ పర్వత స్తంభం నుంచి నేయి కాగుతున్న సువాసనలు వస్తూంటాయి. దేవదానవులు పామునే కవ్వం తాడుగ చేసి ఆ పర్వతంతో సముద్రాన్ని చిలికిన కాలంలో, ఆ పాము కాళ్ళవల్ల ఆ పర్వతంలో అనేక రంధ్రాలేర్పడినాయి. నేతి సముద్రపు అలల తాకిడికి ఆ రంధ్రాలన్నీ రకరకాల గుహలుగా, మందిరాలుగా రూపొందాయి. శివుడెక్కువ సంతోషంగా ఉన్నప్పుడు ఆ బిలమందిరాల్లో నృత్యం చేస్తూంటాడు. అందువల్ల వాటిల్లో ప్రతి భాగమూ పుణ్యప్రదమైందే. ఆ గుహల్లో మీరిద్దరూ ప్రేమ కలాపాలతో ఏళ్ళూ పూళ్ళూ గడపండి.

ఆ పర్వత గుహద్వారాలనే మెట్లుగా చేసుకుంటూ మీ దంపతులిద్దరూ పైకి, పైపైకి వెళ్ళి ఆనంద పరవశులై క్రీడించవచ్చు."

ఆ వరుడు దమయంతికి నచ్చలేదు. శిబిక ముందుకు కదిలింది. సరస్వతీదేవి మరొకతని గురించి చెప్పవలసి వచ్చింది.

## శాల్మలిద్వీపాధిపతి

**"తే**నె సముద్రంలో ఉండే శాల్మలి ద్వీపానికి అధిపతి అదుగో, అతడే! శతృవుల్ని తన ఖడ్గంతో అవలీలగా జయించిన యోధుడు. ఈ భూలోకంలోని రాజు లెవ్వరూ కూడా అతన్ని ఎదిరించలేదు.

దూర్వాసుడు కోపించి నీటిసముద్రాన్నంతటినీ ఒక్క గుక్కగా తాగివేసినపుడు మిగతా సముద్రాలన్నీ రక్షించేవారు లేరని గడగడ వణుకుతుంటే ఇతడే రక్షించాడు. ఆ ముని నీటిసముద్రాన్ని మళ్ళీ వదిలే వరకూ ఇతడు తన సముద్రపుతేనెతో అందరి దాహమూ తీర్చాడు.

పూలతా కుటీరాలు – ఇతని తేనె సముద్రం పంచనున్న వనాల ముందు ఎందుకూ పనికిరాని కట్టెలు. నువ్వు ఇతనితో కూడి అలాంటి వనాల్లో విహరించు. ఆ శాల్మలిద్వీపంలో ద్రోణాచలమనే కొండ ఉంది. ఆ కొండ మీకు విహార స్థలంగా ఉపయోగపడుతుంది. ఆ కొండ అనేక ఔషధ వృక్ష, మూలికలతో, సుగంధద్రవ్య వృక్షాలతో ఆకశాన్నంటుతున్నట్టుంటుంది సుమా!"

ఈ విధంగా చెప్పినా ఆ దమయంతికి ఆ ప్రభువూ నచ్చలేదు. శిబిక మరికొంచెం ముందుకు వెళ్ళింది.

## ప్లక్ష ద్వీపాధిపతి

**శా**రద ఆ రాజుకుమారికి ప్లక్ష ద్వీపాధిపతిని చూపించి ఇలా వర్ణించింది. "చెరుకురసపు సముద్రంలోని ప్లక్షద్వీపాన్ని ఏలే ఈతడు దేవేంద్రునికి మిత్రుడు. ఇతని కీర్తి కాశ్మీరపు పూల సువాసనల కంటె ఎక్కువని ప్రజలు చెప్పుకుంటారు. ఉత్తమ భక్తుడు రెండు పూటలా చంద్రుని చూడకుండా భోంచెయ్యడు. ఇక ముందు నీ మొగమనే చంద్రబింబాన్ని చూస్తూ భోజనమే మానుకుంటాడేమో!

చెరకురసపు సముద్రం అంచులమీద గల వనాంతరాల్లో విహరిస్తూ, తీయని చెరకుముక్కలు తింటూ, చెరకు తోటల మధ్య నుండే ఇసుక తిన్నెలమీద పవ్వళించే ప్రేయసీ ప్రియులెంత ఆనందిస్తారోగదా" అని నోరూరించినా దమయంతి అయిష్టాన్నే ప్రదర్శించింది.

సరస్వతి కన్నె మనసు తెలుసుకుని శిబిక వాహకుల్ని "పదండి, పదండి" అని హెచ్చరించింది. రాజహంసాకారంలో ఉన్న ఆ శిబికను వాహకులు కొంచెం ముందుకు మోసుకు వెళ్ళి మరొక వరుసకు మళ్ళీ నిలబడ్డారు.

## జంబూద్వీప రాజులు

**శా**రదాదేవి దమయంతితో, "ఆ వరుసలో కూర్చున్న వాళ్ళు జంబూద్వీపంలోని దేశాలకు రాజులు. ఒక్కొక్క రొక్కొక్క మన్మథుని వలె అందంగా ఉన్నారు. మిగతా ఆరు దీవులూ వీరి జంబూద్వీపం చుట్టూ కాపలా ఉన్నట్టుంటాయి. ఈ ద్వీపం చుట్టూ ఉప్పునీటి సముద్రం ఉంది. ఈ ద్వీపంలోని నేరేడుపళ్ళు నిగనిగలాడుతూ బంతులంతంత ఉంటాయి.

అవి బంతులూ, నీటి ముద్దలా, నేరేడు పళ్ళా అని గంధర్వ కాంతలు పందేలు వేసుకుంటూంటారు. జగతి కంతటికీ అలంకార ప్రాయమైన ఈ ద్వీపరాజులలో ఒకరిని వరించు. ఎవరిమీద ప్రేమ ఉందంటే ఆ రాజును గురించిన వివరాలన్నీ చెబుతాను" అంది. ఆ మాటలకు దమయంతి విచారంగా తల వంచుకుంది; సరస్వతీదేవి "నీ కంత కష్టంగా ఉంటే వీరి నెవర్నీ వరించవద్దులే, మరొకరిని చూపిస్తాను, పద" మని బుజ్జగించింది.

## ఉజ్జయినీపతి

**"రా**కుమారీ! ఇతడు ఉజ్జయినీ రాజు. దానధర్మాలు చేయడంలో ఇతనికితడే సాటి. యాచకులు ఇతన్ని అడిగి పొందలేని భాగ్యభోగాలు లేవు. అందువల్లనే యాచకులితన్ని కామధేనువో కల్పవృక్షమో అని అభివర్ణించు

తూంటారు. ఎన్ని రకాల ఎంతెంతగా దానం చేసినా తరుగని రత్న రాసులో, చింతామణి వంటి దివ్యరత్నమో ఇతనికి ఉందనుకుంటారు.

ఉజ్జయినిలో మేడలన్నీ నీడలు తేలే చలువరాలతో నిర్మించినవే. శివుని సిగలోని చంద్రరేఖ ఆ నగరాన్ని తన అమృతంతో కడిగి శుభ్రంగా ఉంచుతూంటుంది. ఆ నెలవంకతోనే శివుడు–ఉజ్జయినీ నగర స్త్రీ జనానికి ప్రతిక్షణం ప్రణయజ్వరం కల్పిస్తూంటాడు. అలాంటి శివుడే ఒకప్పుడు మన్మథుని మూడో కంటిమంటతో ఎందుకు బుగ్గి చేశాడో ఇప్పటికీ అర్థం కాదు.

ఆ ఉజ్జయినిలోని స్త్రీలు భర్తలమీద అలగడానికే భయపడతారు. ఎందువల్లనంటే క్షణక్షణానికీ కొత్తరకం మదనక్రీడా వాంఛలు పుడుతూండే నగరం అది! పైగా ఆ నగరం శాంతికి పుట్టిల్లు. ఆ ప్రక్కనే శిప్రానది ప్రవహిస్తూంటుంది. ఆ నదిలో జలకాలాడ్డం, ఆ నగరి సౌధాగ్రాలమీది ఆసనాల మీది క్రీడించడం స్త్రీ జన్మకు సార్థకాలంటారు" అని వివరించింది.

దమయంతికి అతడూ నచ్చలేదు. ఆ సంగతి పసిగట్టి వాహకులు శిబికను తమంత తామే ముందుకు తీసుకువెళ్ళారు.

## గౌడరాజు

**స**రస్వతి ఆ తరువాత రాజును ఇలా పరిచయం చేసింది. "ఇతడు గౌడరాజు. మృదుమధురంగా ప్రణయ క్రీడలు జరపడంలో నేర్పరి, ఇతన్ని సరిగ్గా చూడు– ఇతని అందం ముందు చందమామ వెన్నెల నల్లబడి పోతున్నది కదూ ? మన్మథుని గిరజాల జుత్తు ముడిలో సంపెంగ పూలమాల ఉన్నట్లు – ఇతని కౌగిలిలో బంగారం వంటి యువతులెందరో ఉంటారు. ఇతని పొడవైన చేతులు యుద్ధరంగంలో శత్రువులను చీల్చి చెండాడుతూనే, 'వైరి భార్యల

చనుమొనలమీద పడుతున్న అశృకణాల్ని చెమట బిందువులుగా మార్చి కొనగోటితో మీటి వేస్తూండగల ప్రణయచతురుడు. ఇతని చరిత్ర అన్ని లోకాలలోను అద్భుతంగా వ్యాపించింది.”

అతన్ని చూడగానే దమయంతి మొగంలో వెగటు తోచింది. అది గ్రహించిన సరస్వతి శిబిక వాహకులకు ముందుకు పొండని సైగ చేసింది.

## మధురాధిపతి

**“ఇ**తడే మధురాధిపతి పేరు పృథుడు. ఇతడు చంద్రునంత చక్కగా దేశాన్ని పరిపాలిస్తున్నాడు. మీసాలైనా లేని ఇతని మొహం ఆ కృష్ణునికంటె ఎంతో అందంగా ఉంది చూడు! అతని చేతులెంతబలంగా ఉన్నాయో చూడు. ఆ భుజాన ధరించిన విల్లంబులు శతృసంహారంలో పేరెన్నిక గన్నవి.

యమునా నది నాభిలాగా కాళింది మడుగున్న ప్రాంతంలోనే మధుర ఉంది. మీరిద్దరూ వేసవికాలంలో ఆ చల్లని నదిలో జలక్రీడలాడవచ్చు. గోవర్ధన పర్వతం మీద మేఘాలు ఆడుకునేప్పుడు, అడవి నెమళ్ళు పురులు విప్పి నాట్యం చేస్తుంటే – మీరిద్దరూ చెట్టాపట్లాలు పట్టుకుని వాహ్యాళి చెయ్యండి.

మధురానగరం ప్రక్కనే గల బృందావనంలోని పూల సువాసనలు మీది మనసుతో కృష్ణుడు వాహ్యాళికి వస్తూంటాడు. ఆ వనంలో తిరిగి తిరిగి అలసినప్పుడు దాహం తీర్చుకోడానికి మీ దగ్గరకు వస్తాడు. ఆ సమయంలో మీరిద్దరూ రతికేళిలో ఉన్నా కృష్ణుని చూచి సిగ్గుపడనక్కరలేదు. అతిధి మర్యాదలు చేయనక్కరలేదు. పూతన చనులలోని విషాన్ని తాగినవాడు – రతికేళీ సమయంలో నీ స్తనాలకు పట్టిన చెమట బిందువులే తాగి దాహం తీర్చుకుంటాడులే!” అని సరస్వతి వివరిస్తూంటే దమయంతి వినీ విననట్లు నటించింది, పెడమొహం పెట్టింది. ఆ రాజు చాలా చిన్నబోయాడు పాపం !

## అయోధ్యాపతి

**స**రస్వతి ఆ తరువాత ఉన్న అయోధ్యాపతిని పరిచయం చేసింది. "ఇతని పేరు ఋతుపర్ణుడు. అయోధ్యరాజు. ఎంత విశాలనేత్రుడో గమనించావా ? ఇతని తాతయైన భగీరథుడు ఆకాశగంగను భూలోకంలో ప్రవహింపజేస్తే, ఇతడు తన కీర్తి అనే గంగను మూడులోకాలలోనూ ప్రవహింపజేస్తున్నాడు. కవులు ఎంత వర్ణించినా ఇతని కీర్తి అనే సముద్రంలో బిందువంత మాత్రమే చెప్పగలరు.

ఇతని ధర్మకీర్తినే కాక, వీరత్వాన్ని కూడా ఎవరూ పూర్తిగా వర్ణించలేరు. శత్రురాజు సముద్రంలో ఇతడొక బడబానలం వంటివాడని ప్రతీతి. కాళిందీ తటితోసహా యమున, గంగానదులలో గల నీటికంటె ఇతడు సంహరించిన శత్రురాజుల స్త్రీ జనం రోధించగా పారిన జలం ఎక్కువ ఉంటుందంటారు."

అయోధ్యాపతి వంక దమయంతి కన్నెత్తియైనా చూడకుండా ఆ తరువాత వానివంక చూడబోయింది. కన్నె మనోభావం గ్రహించిన సరస్వతి శిబికను అక్కడికి నడిపించింది.

## కాశీరాజు

**"ఇ**తడు కాశీరాజు. ఇతని రాజధాని పుణ్యక్షేత్రమైన కాశి. ఇతని కులదైవం శివుడు. మూడులోకాల ప్రజల దుఃఖాన్నీ తుడిచివేయగల గంగానది ఒడ్డున అంత విశాలమైన విడుదులు యాత్రీకులకు కట్టించాడు. ఇతడేర్పరచిన అన్నసత్రాల వల్లనే శివుని భార్య యగు అన్నపూర్ణాదేవి పేరింకా నిలబడింది.

కాశీరాజు భుజాన్ని చూస్తేనే శత్రురాజులు పసిబిడ్డల్లా ఝుడుసుకుంటారు. అతని చేతులు నీ చక్రస్థలాన్ని ఒత్తుతూంటే; చిలుకలు పండ్లమీద వ్రాలి 'కాయో పండో' నని గీసినట్టు. అన్నపూర్ణాదేవి పాదాల కుంకుమ చెదిరి పడినట్లు నీ

చన్నులపై ఎర్రని గీతలు పడితే ఎంచక్కా ఉంటుంది." అని శారదాదేవి మురిపెంగా చెబుతూంటే దమయంతి కనుబొమలు చిట్లించి అయిష్టత ప్రదర్శించింది.

## పాండ్యుడు

**ఆ** తరువాత కూర్చుని ఉన్న రాజు పాండ్యుడు. అతన్ని సరస్వతి పరిచయం చేయసాగింది. "ఇతడు పాండ్యరాజు, మన్మథునికంటె అందగాడు. ఇతని కీర్తి భూలోక మంతటా పర్యటించి, స్వర్గలోకంలో వ్యాపించడానికి దినదినం పై కెగుస్తూ ఉంటుంది. ఇతడు ఏటేటా దండెత్తి శత్రువుల్ని దును మాడుతూ ఉంటాడు. అందువల్ల శత్రురాజులు ఏటేటా అడవుల్లోకి పారిపోయి తలదాచుకోవలసి వస్తున్నది. వాళ్ళు స్వంత నగరాలకి తిరిగి వచ్చేప్పుడు కూడా మారువేషాలు ధరించి దొంగల్లా వ్యవహరించవలసి వస్తున్నది.

ఇతని వీరప్రతాపాన్ని సూర్యబింబంలోని మంటలంత తీక్షణంగా ఉంటుంది. ఇతని ఏనుగులబలం కొండల్లా నడచివెళ్ళి యుద్ధరంగంలో ఘీంకరిస్తూంటే దశదిశలా బ్రద్ధలవుతున్నంత ధ్వని వ్యాపిస్తుంది. శత్రువుల మధ్య మండే సూర్యుడిలా ఇతడు బాణపరంపరలు విసురుతూంటాడు. ఇతని వక్షస్థలం మీద విజయశ్రీ ఎప్పుడూ కొలువుంటుంది.

ఇతనితో యుద్ధం చేయడానికి శత్రురాజులు బయలుదేరితే, వారి భార్యలకు ఆకాశంలో నల్లని గుంటలున్న దోవ కనిపిస్తుంది. తమ భర్తల నా గుంటలలో పూడుస్తారని, వారి రక్తంతోనే పడమటి దిక్కు ఎర్రబడిందనీ ఆ స్త్రీలు భావించడం కద్దు"

సరస్వతి ఈ విధంగా అతని గొప్పదనాలు వర్ణిస్తూంటే దమయంతి మధ్యలోనే అయిష్టంగా తలూపింది. అది గమనించిన ఒక చెలికత్తె "అక్కా,

అటు చూడండి. అటు మేడమీద ఒక జెండా ఎగురుతూంది. ఆ పతాకం మీద నీరు ప్రవహిస్తున్నట్లు గుర్తుంది. ఆ చిహ్నం నిజంగానే నీరనుకుని దాహం తీర్చుకోడానికి ఒక కాకి ఎగిరింది ..కానీ – ఆ సరస్సులో దిగే వీలుదొరక్క 'కాకాకా' యని ఏడుస్తున్నది" అని అనవసర ప్రసంగం ప్రారంభించింది.

ఆ పిట్టకథవిని సభలోని వారంతా నవ్వుతుంటే పాండ్యరాజు మొహం నల్లబడిపోయింది. సరస్వతి విశేషార్థం గ్రహించి శిబికను ముందుకు నడిపించింది.

## కాళింగుడు

"ఇతడు మహేంద్రగిరిని ఏలు కళింగ గజపతి. నీకు తగిన రూపసంపద గలవాడు. అయితే అతని రాచనగరిలో ఒక ప్రమాదం ఉంది. అక్కడి మద గజాలు బలిసి తమ తలలతో పట్లుపడుతూ గరగర రాసుకుంటూం టాయి. వాటిని చూచినప్పుడు నీ కుంభస్తనాలకు పులకరింతలు పుట్టి – నీవూ ఆ ఏనుగుల కుంభస్థలాలతో నీ చనులను మోటించి పోరాడాలనే కోర్కె కలగవచ్చును.

గజపతి వస్తున్నాడనే మాట వింటే యుద్ధరంగంలోని శత్రురాజులు పరుగు పరుగున పారిపోయి నిద్రపోతారు. నిద్రలోకూడా గజపతి వచ్చి చంపుతున్నాడని పలవరించుతూ వణికిపోతారట. ఇది గమనించిన రామచిలుక కూడా 'గజపతి వచ్చె'నని తమ రాజుల్ని భయపెడుతూంటాయి.

ఇతని శతృరాజుల స్త్రీలు వైధవ్యంతో అడవులపాలైనా, అక్కడి చెంచు స్త్రీలతో స్నేహంగా ఉంటూ – 'మా రాజ్యాన్ని ఇప్పుడేలే గజపతి చల్లని చంద్రునివంటివా'డని పొగడుతూంటారట! ఆదిశేషుడు, ఇతర జలదేవతలూ

స్నానం చేస్తూవుంటే పాతాళ సముద్రానికి కూడా తన కీర్తిని వ్యాపింపజేసిన గజపతిని గురించి నాగకన్యలు వర్ణిస్తూంటే – నాగరాజు చెవులు రిక్కించి వింటూ ఆనందబాష్పాలు రాలుస్తూంటాడు, పులకరిస్తాడు. భూమిని తన తలపై మోస్తూ కూడా తలూగించుతూంటాడు." అని సరస్వతీదేవి వర్ణిస్తూంటే దమయంతి వెగటుగా నవ్వింది.

ఆమె కా కాళింగుడు ఇష్టం లేదని తెలిసిన శారద మరొకరిని పరిచయం చేసింది.

## నేపాళరాజు

"దమయంతీ, ఇతడు నేపాళ దేశపు రాజు. ఇతని ప్రతాపాగ్నికి గురైతే వాయువు కూడా వాయువేగంతో పారిపోవలసిందే. ఇతని కీర్తి అన్ని లోకాలలోని అన్ని దిక్కులకూ వ్యాపించి నాట్యం చేస్తున్నది. ఇతని శరలాఘవం చాలా గొప్పది. ఇతడు వింటినారిని సారిస్తే – సముద్ర కెరటాల ఘోష. శివుని ఢక్కామోత కలిసి వినిపించే ధ్వని పుడుతుంది. భూమివంక చూస్తూ ఆకాశంలో ఉన్న లక్ష్యాన్ని గురి తప్పకుండా కొట్టగలడు. శత్రురాజుల ఏనుగుల మస్తిష్కాలను చిల్లులుగా కొట్టగలిగాడు.

ఇతనిచేత ఓడిపోయిన రాజుల ముఖకాంతులు ఇతని కాళ్ళ గోళ్ళకు చేరుకుంటాయి. వాళ్ళ ముఖాలు నల్లబడిపోతాయి. శత్రువుల ప్రాణాలు ఇతడు అమృతంలా సేవిస్తాడు. పట్టపుటేనుగుల దంతాల కాంతిని, శివుని ఆభరణమైన నెలవంక కాంతిని, స్వర్గలోకాల్లోగల మంచుకొండల కాంతినీ మించినంత ధవళంగా ప్రకాశిస్తున్నది ఇతని శౌర్యకీర్తి."

అతనినీ రాకుమారి వరించలేదు.

## కామరూపాధిపతి

**త**రువాత రాజును వాణి వర్ణించింది ! "ఇతడు కామరూప దేశానికి ప్రభువు. వీరి రాజధాని ప్రాగ్జ్యోతిషపురము. వీరులలో గొప్పవాడు. యుద్ధ రంగంలో ఇతడు సాధించిన కీర్తి కాంతి సూర్యకాంతి చేరగల ప్రదేశాలంతటా, సుగంధం వ్యాపించగల ప్రదేశాల్లోనూ కూడా ప్రవేశించింది. ఇతని 'వరించు' అంది. దమయంతి మోమును మరో వైపుకు తిప్పుకుంది.

దేవి అభిప్రాయాన్ని గుర్తించిన చెలికత్తె "సరస్వతీదేవీ! ఈతనిని మా రాకుమారి వరించదు. కనుక ఆ తరువాత కూర్చుని ఉన్న ఉత్కళ రాజును గురించి వివరంగా చెప్పండి" అని ప్రార్థించింది. శిబిక మరి కొంచెం అవతలికి వెళ్ళి ఆగింది.

## ఉత్కళుడు

**శా**రద ఇలా చెప్పింది! "ఇతడు ఉత్కళ దేశాధీశుడు. ఎదురు తిరిగిన రాజుల నవరత్నఖచిత కిరీటాలతో పాదపూజ లందుకున్న మొనగాడు. కోటిమందిని జయించిన ఈతని చేబట్టితే- చంద్రుడే వచ్చి నీవు జలక్రీడలాడే కొలనును తన బిందువులతో నింపుతాడు, పద్మాలు రాత్రులందు కూడా నిద్రపోవు. మల్లి మొల్ల మొదలైన నవపుష్టకుసుమాలు నీ సిగను అలంకరిస్తాయి.

ఇతడు యుద్ధానికి బయలుదేరినప్పుడు చెలరేగే శబ్దాలకు భయపడి, దేవతావీరులు కూడ చాటుకు తప్పుకుంటారు. క్షణక్షణం దానాలు చేస్తున్నా తరుగని సందలున్న ఈ రాజు కూర్చునే మహాసింహాసనం కూడా సగర్వంగా ఎంతో ఎత్తుంటుంది. అడిగిన వారికి అడిగినకంటె ఎక్కు వెక్కువగా దానం చేస్తున్న ఇతన్ని చూచి కల్పవృక్షం సిగ్గుపడుతూంటుంది."

ఇలా వర్ణించినా దమయంతి ఉలకక, పలకక నిలిచింది. ఆమె హృదయంలో నలరాజుకు తప్ప మరెవరికీ చోటులేదని తెలిసిన సరస్వతీ

దేవి, పైకి తెలియనట్లే నటిస్తూ వాహకులకు కనుసైగ చేసి, శిబికను తరువాత రాజువద్దకు నడిపించింది.

## కీకటుడు

**"ఇ**తడు కీకటదేశపు రాజు. ఆ దేశాన్ని త్రివిష్టపం అని కూడా అంటారు. ఇతడు బాటసారులు శ్రమ తీర్చుకోడానికి దేశమంతటా అనేక చల్లని సత్రాలు కట్టించి, తీయని మంచినీటి చెరువులు త్రవ్వించాడు. ఇతని కీర్తి అనే పూర్ణచంద్రుడు తమమీదికి దండెత్తి వస్తాడనే భయంతోనే సూర్యుడూ, చంద్రుడూ కూడా ఆకాశంలో ఒదిగి ఒదిగి పారిపోతుంటారు గాని భూమిమీద నడవడానికి దిగడం లేదు" అని సరస్వతీదేవి ఎంతో చమత్కారంగా చెప్పినా దమయంతి నవ్వనూలేదు. ఆ కీకటుని చూడనూలేదు.

## నలపంచకం

**ఆ** తరువాత ఒకే వరుసలో అయిదుగురు నలరాజులు ఒకే భంగిమలో ఠీవిగా కూర్చుని ఉన్నారు. వారిలో నిజమైన నలుడెవరో, ఇంద్రాగ్ని యమవరుణులెవరో సరస్వతీదేవికి తెలుసుగాని దమయంతికి తెలియదు గదా! ఆ అయిదుగురిలోను నలుని ప్రత్యేకంగా గుర్తించడానికి వీలుగానూ – ఇతర మాయా నలురైన నలుగురికీ అన్వయం ఉండేట్టుగాను, నర్మగర్భంగా సరస్వతీదేవి వివరాలు వర్ణించ నారంభించింది.

"ఇతన్ని చూడు – అపాయాల కపాయుడు, అతివిశాల పద్మసమాన నేత్రుడు. నిజ వీరసేను నలరించువాడు, సర్వలోకాల రాజులను జయించగల బలాఢ్యుడు, భూమిన్మహేంద్రుడు.

అతణ్ణి చక్కగా చూడు – భాస్వరరూప సపంద గలవాడు, ఎప్పుడూ పైకెగిరే శక్తి చూపేవాడు. అధిక ప్రతాపుడు, అగ్నిశిఖల వల్ల పుట్టిన వాడు.

ఎల్లప్పుడూ విబుధులవైపే చూచువాడు, శత్రువుల్ని గడ్డిపోచలుగా భావించు వాడు, ఈత డనలుడు, లోకపాలకులందు దిట్ట. అనేక రుచుల స్నేహంతో బలసినవాడు.

ఇంకొకరెవరనుకుంటావో – భయంకరమైన పెద్ద గదతో దండించే వ్యక్తి, సమవర్తి, ధర్మరాజు, మిత్రనందనుడు, కమలలోచనుడు, దక్షిణ నాయకుడు.

'మరొకడున్నాడే – ఆయన అపార గంభీర విశేషాల నిధి, నదీనుడు, స్వచ్ఛమైన మంచినీటి సముద్రం కంటె బలం గలవాడు, భువనాధిపుడు."

ఈ నాలుగు వర్ణనలలో మాయా నలరూపులై వరుసగా ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు గుర్తుండునట్లు శారదాదేవి చెప్పినా దమయంతి వారిని సరిగా పోల్చుకోలేక తత్తరపడింది. అయిదుగురు నలరాజులు ఒకే వరుసలో ఎవరు నలుడని నిశ్చయించగలదు ? కనుసైగలతోనే ప్రశ్నవేస్తూ సరస్వతీ దేవి వంక చూచింది.

ఆ వాగ్దేవి మరింత చమత్కారంగా ఆ దిక్పాలుర్ని నలుగురినీ పొడుగుతున్నట్లు నటిస్తూనే, నిజమైన నిషధ రాకుమారుని చూపుతూ, అతని గుణగణాదుల్ని కీర్తించసాగింది.

"ఇతన్ని శ్రద్ధగా చూడు. వందమంది శత్రురాక్షసులెత్తి వచ్చినా ఓడించ గలనన్నట్టు చేష్టలతోనే చెబుతున్న ఇతడు జీమూతవాహనుని వలె ఉన్నాడు. ఇది నిజం. అంతేగాక అగ్నిహోత్రుని వలె అనేక యజ్ఞాలలో పూజలందిన తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఇంకా – యమధర్మరాజు వలె ప్రాణాలు తీయడానికీ యివ్వడానికీ కూడా సమర్థుడులాగాను, జ్ఞానుల్ని సంతోషపెట్టేవాడు గాను ఉన్నాడు. మరో విశేషం ఏమిటంటే వరుణదేవుని లాగా ఎదురుగాలికి లేచిపడే తరంగాల సముద్రంతో సేవింపబడుతున్నట్టు కనిపిస్తున్నాడు. ఒకే

రూపున కనిపిస్తున్న ఈ అయిదుగురు పురుషుల్లో నీ ఇష్టం వచ్చిన వారిని ఎన్నుకో”మని ఊరుకుంది.

సరస్వతీదేవి చమత్కార భాషలో సూచించడం వల్లనో, ఆత్మ పాతివ్రత్య మహిమ వల్లనో, పూర్వపుణ్యం వల్లనో దమయంతి కపటవేషధారులైన దిక్పాలుర్ని నలుగుర్నీ దాటి, అయిదవ నలుడుగా ఉన్న నిజమైన నలరాజు ఎదుటికి వెళ్ళి నిశితంగా చూచింది.

కాని – అంతలోనే మన్మథుడు తన పుష్పశరాలను వడివడిగా దమయంతి హృదయంలోకి గురిచూచి కొడుతూ విరహవేదనను, సంకోచాన్ని పెంపొందించాడు. ఆమె మనస్సు చికాకై పోయింది. దృష్టి చెదిరింది. మళ్ళీ ఆ అయిదుగురిలో ఎవరు నిజమైన నలుడో, ఎవర్ని వరిస్తే తప్పో, ఎవర్ని కోరితే ఒప్పోననే సందేహంతో ఆమె మనస్సు తొక్కిసలాడింది.

‘ఈ సమయంలో మా యిద్దరికీ ప్రాణమిత్రుడైన రాజహంస ఉంటే – నీటి నుంచి పాలను వేరుచేసినట్లుగా మాయా రూపులలోని నిజమైన నలుణ్ణి చూపేది గదా’ అని ఆ కన్య అనుకుంది – రాయంచ రానందుకు ఎంతో చింతించింది.

ఆమె తన మనసులో ఇలా తర్కించుకోసాగింది. ‘రెండురకాల చంద్రులుంటారనే ప్రతీతిని వినడం వల్లనా ? అతి స్వచ్ఛంగా ఉండే పదార్థంలో కనుపించే అనేక ప్రతిబింబాలా ? నా కళ్ళు చెదిరాయా ? మదనుడు అదృశ్య విద్యతో ఇన్ని రూపాలు దాల్చాడా ? విరహం ఎక్కువై నేనే భ్రమిస్తున్నానా ? నలుడే విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడా ? దేవతలే కపట నాటకం ఆడుతున్నారా ? సరస్వతీదేవి పరిహాసం చేస్తున్నదా ? లేక ఈ అయిదుగురిలో – ఒకడు నలుడు, ఒకడు పురూరవుడు, మరొకడు మన్మథుడు, మధ్యనున్న ఇద్దరు దేవతల వైద్యులూనేమో – ఏమీ అర్థం కావటంలేదు.

దేవతలైతే నలుని చూపించవలసిందని ప్రార్థిస్తాను. కాని – వారికే కామజ్వరం ఎక్కువై అధిక దాహంతో నన్ను లోబరచుకో చూస్తున్నప్పుడు నలుని నాకు దక్కనివ్వరు కదా !

అయినా – నన్ను వంచిస్తూ అయిదు ఆసనాల మీద ఒకే రూపుతో, ఒకే దుస్తులతో, ఒకే రకం ఆభరణాలతో, ఒకే మాదిరిగి కూర్చున్న ఈ అయిదుగుర్నీ జాగ్రత్తగా పరిశీలించి నిజమైన నలుడెవ్వడో గ్రహించ ప్రయత్నిస్తాను' అని ఆమె నిశ్చయించుకుంది.

## నలుని గుర్తింపు

**ఆ** అయిదుగురనూ నిశితంగా చూచింది. వారిలో నలుగురు విచిత్రంగా కనిపించారు. వాళ్ళ పాదాలు నేలమీద ఆనటం లేదు. వారి నుదురుల మీద చెమట చుక్కయినా లేదు. వారి వక్షాలమీద వ్రేలాడుతున్న మాలికలలో ఒక్క పూవుగాని, పూలకేసరాలు గాని వసివాడలేదు. వాళ్ళ కనురెప్పలు ఒక్కసారైనా మూతలు పడడం లేదు. అందువల్ల ఆ నలుగురూ దేవతలని, అయిదవవాడే నలరాజనీ దమయంతి గ్రహించింది.

'దేవతల దయ లేనిదే ఏ పనీ కాదు. వారికి దీపధూప అభిషేక పూజా నైవేద్యాలు సమర్పిస్తే గాని కరుణించి కల్పవృక్షాలూ, కామధేనువులూ, రోజుకు వేయి మణుగుల బంగారం ఇచ్చే చింతామణి వంటివి దానం చెయ్యరు గదా' అని మనసులో తర్కించుకున్న దమయంతి సభలోని దేవతలకు నమస్కరించి, భక్తిగేయాలు పాడి వారిని ఆనందింపచేసింది.

దేవతలు సంతోషించి ప్రసాదించిన జ్ఞానశక్తితో నిజమైన నలుని మళ్ళీ చూచి, అంతలోనే కన్యాసహజమైన నునుసిగ్గుతో ప్రక్క కొదిగింది. ప్రియుణ్ణి సూటిగా చూడనూలేక, చూడకుండా విరహాన్ని ఆపుకోనూ లేక సతమతమౌతూ మెల్లగా వెనక్కు నడిచి ఆ శారదాదేవి హృదయం మీద వాలి, బేలగా చూచింది.

సరస్వతీదేవి ఆ కన్యభావాన్ని గుర్తించి, సన్నగా నవ్వుతూ కన్య హస్తాన్ని తన చేతిలోకి తీసుకుని ధైర్యం ఇస్తూ, సభలోని వారందరూ వినేట్టు ఇలా అంది.

"ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు ఈ దమయంతిని కరుణార్ద్ర దృష్టితో చూడాలి. ఒకే ఒక్క కన్య ఇందరినెలా వరించగలదో మీరే చెప్పండి. మీ నలుగురిలో ఒకర్ని వరిస్తే మిగతా ముగ్గుర్నీ కించపరచినట్లేగదా ? ఈ విషమ సమస్య తలెత్తకుండా ఈమె మీ నలుగురి గుణగణాలూ, ప్రసాదాంశాలతో పుట్టిన ఒకే ఒక్క మహానుభావుడైన నలుణ్ణి వరించి తరిస్తుంది. అది అందరికీ ఆనంద దాయకమే గదా!"

ఈ మాటలు వినగానే ఆ నలుగురు దిక్పాలకులూ సంతసించారు. సరస్వతీదేవి ప్రబోధము, నలుని చిత్తశుద్ధి, దమయంతి భక్తి పాతివ్రత్యాలను తలచుకుని తమ కామ వాంఛలను ఉపసంహరించుకున్నారు. నలుని వలె ఉన్న తమ రూపాలను కూడా యధాస్థితికి మార్చుకుని ప్రత్యక్షమయ్యారు.

అప్పుడు దమయంతి చూపులు తమ బిడ్డ చూపులవలె వారికి తోచాయి. ఇంద్రుడు తన వేయికళ్ళతోను ఆమెను చల్లగా చూచాడు. అగ్ని కామాంధకారం తొలగిన చల్లని వెలుగులు ప్రసరించుతూ మదనుని ప్రేమబాణాలు తాకలేని బూడిదరంగు ధరించాడు. యముడు కామపాశం లేని నిజ పాశంతో ప్రత్యక్షమై ఆశీర్వదించాడు. ఆ నలుగురూ తమ తమ నిజరూపాలలో కనిపించేసరికి సభలోని వారందరూ 'గారడీవారేమో' అనుకున్నారు.

సరస్వతీదేవి రాచకన్నెతో : "వీరు దేవతలని, అతడు నలుడని స్పష్టంగా తెలుసుకున్నావు గదా, ముందీ దేవతలకు నమస్కరించి, తరువాత నలుని వరించి, కలకాలం పతివ్రతా ధర్మం పాటిస్తూ సుఖ దాంపత్య జీవితం గడుపు"మని చెప్పింది.

దమయంతి చేతికంకణాలు ఝణఝణ మ్రోగునట్లుగా చేతులు జోడించి దిక్పాలురకు నమస్కరించి ఆశీస్సులు పొందింది.

## స్వయంవరము

**ద**మయంతి శిబిక నుండి దిగి, సరస్వతీదేవి చేతిని పట్టుకుని, మెల్లగా నలుడున్న బంగారుపీఠాన్ని ఎక్కి, అతని మెడలో పూలహారాన్ని వేసి వరించింది.

ఆ దండలో అక్కడక్కడ లేలేత ఆకులున్నూ ఉన్నాయి. ఆ మాలలోని పూల సుగంధ పుప్పొడుల కాశించి తుమ్మెదలు ఝుంకారం చేస్తూ వాటి చుట్టూ తిరుగుతూనే ఉన్నాయి.

కనుపించీ కనుపించకుండా ఉన్న మదన బాణాలవలె ఆ పూలదండ నలుని ఛాతీమీద చక్కగా అమరి, ప్రతిఫలిస్తూ ప్రణయభావాలను సృష్టిస్తున్నది. దమయంతి శరీరమంతటా పులకిరింతలు జనించడం వల్ల, సిగ్గుతో తలవంచుకుని మరింత అందంగా కనుపించింది.

ఆమె తన మెడలో వేసిన దండను నలుడు ప్రేమతో తాకేసరికి, అతని అరచేయికి, చెమట పట్టినట్లయింది. పెళ్ళి సమయంలో కన్యాదాత వదిలే జలానికి ఇది సూచనగా తోచింది. ఆ సమయంలో మదనబాణాలకు సుకుమారియైన దమయంతితోపాటు, మేరుపర్వతంకంటె ధైర్యవంతుడైన నలుడు కూడా చలించి, తూలిపోబోయాడు. ఈ విధంగా నలరాజు కామునికి బందీ అయ్యాడు.

## ఇంద్రాదుల వరాలు

**ఎం**తోకాలంగా ఒకరినొకరు మనసారా కోరుకుంటూ ఈ శుభ ఘడియ కోసమే ఎదురు చూచిన ఆ వధూవరుల్ని దేవతలు ఆశీర్వదించారు.

ఇంద్రుడు "నీవు మాకు దూతగా వ్యవహరించడంలో చిత్తశుద్ధితో వ్యవహరించావు గనుక మెచ్చి, వరాలిస్తున్నాము. నీవిక ముందు చేసే యజ్ఞ యాగాలలో నేను నా నిజస్వరూపంతో వచ్చి నైవేద్యాలు స్వీకరిస్తాను" అన్నాడు. అగ్ని కామరూప మంత్రాన్ని ఉపదేశించాడు. యముడు ధర్మబుద్ధిని, ఎన్ని గుద్దులు గుద్దుతున్నా అలసటరాని శక్తినీ ప్రసాదించాడు. వరుణుడు "నీవు కోరినచోటల్లా వర్షిస్తాను. నీవు ధరించే పూలు ఎన్నటికీ వాడిపోకుండుగాక" అని వరాలిచ్చాడు.

## చింతామణి మంత్రం

**స**రస్వతీదేవి అంతవరకు ధరించిన నరస్త్రీ రూపాన్ని వదలివేసి – పుస్తకము, వీణ పట్టుకున్న చేతులతో, రొమ్ములపై ఆనే తులసీదళాల దండతో, మంచు బిందువుల వంటి శరీరంతో వాగ్దేవి రూపంలో ప్రత్యక్షమైంది.

ఆ అయిదుగురు దేవతలూ కలిసి ! "హిమాచలుని కుమార్తె, ఆదిశక్తి యగు పార్వతీదేవి వలె కలకాలం ముత్తయిదువుగా వర్థిల్లు, భర్తకు అర్థశరీరివై అతని జీవితంలో భాగస్వామివి కమ్ము. రాజులు నీకు పాదపూజలు చేయుచుందురుగాక!" అని దమయంతిని దీవించారు.

దమయంతి వారికి పాదాలంటి నమస్కరించింది. ఆ తరవాత సరస్వతీదేవి నలునితో ఇలా చెప్పింది !

"చింతామణీ మంత్రం – కల్పతరువు, కామధేనువుల వలె కోరికలు తీర్చే మహత్తు గలది. అది నన్ను ప్రార్థించే మంత్రమే. దానిని మనువు ఎప్పుడూ మననం చేస్తూంటాడు. అదే విధంగా నువ్వు కూడా భక్తితో స్మరించి తరించు. దాన్ని నీకు రహస్యంగా బోధిస్తున్నాను.

ఇప్పుడు నీ చెవిలో నే చెప్పిన మంత్రం బంగారు ఆభరణం వంటిది, రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. పాపాల్ని పోగొట్టి మహాశక్తి నిస్తుంది. ప్రసిద్ధ దేవతలందరి ప్రార్థనా పదాలూగల ఈ మంత్రాన్ని ఉపాసించు.

శుచిగా, తెల్లవారుఝాముననే లేచి, తూర్పువైపుకు తిరగి శ్రద్ధగా ఈ మంత్రాన్ని ఉచ్చరించు. నీకు శుభాలు లభిస్తాయి. ఈ చింతామణీ మంత్రంతో నన్ను ఉపాసిస్తే మరే కృషీ లేకుండానే సారస్వతాన్ని సృష్టించే శక్తి యుక్తులు లభిస్తాయి.

ఎటువంటి మూర్ఖుడైనాసరే – ఈ మంత్రాన్ని ఉపాసించుతూ అబ్దకాలం (ఒక సంవత్సరం) భక్తితో గడిపితే, కవితా సిద్ధాంత రహస్యోపనిషత్తులు బోధించగల ఉపాధ్యాయుడే కాగలడు. సూర్యోదయవేళ నీ వీ మంత్రంతో నన్ను ప్రార్థించి – దమయంతిని పొందినట్లే, కవితా కన్యనను కూడా పొందు. శివునివలె పాపాలు పోగొట్టే వాడవై మహా కీర్తివంతుడవు కమ్ము" అని ఆశీర్వదించింది.

మళ్ళీ దమయంతిని ఇతర దేవతలతో కలసి శారదాదేవి కూడా ఇలా ఆశీర్వదించింది : "పతివ్రతలకు ఆదర్శమైన పతివ్రతవు గనుక నీవు సాధించలేని దుండదు. కాని – దేవతలమైన మేము ప్రత్యక్షమైనప్పుడు నరులకు వరము లీయకుండా వెళ్ళరాదు. నీ పాతివ్రత్య నియమాన్ని పాడుచేసే దుర్మార్గుడు వెంటనే మాడి మసైపోతాడు! మేము ఇష్టం వచ్చిన మారురూపాలు ధరించడం చూచి నీవు ఎంతో ఆశ్చర్యపడ్డావు. నీవు కోరినప్పుడు అలా కామరూపధారిణివి కాగలవని వరమిస్తున్నాము."

అప్పుడు సరస్వతి ఇంద్రాగ్ని యమ వరుణులతో కలసి జంబూ ద్వీపం రాజుగారి విమానం ఎక్కి పైకెగిరారు. ఇతర రాకుమారులు కూడా లేచి తమ తమ విడుదులకు బయలుదేరారు. అలా వెడుతున్న వారి అందెల రవళితో పాటు దేవదుందుభి ధ్వనులు కలసి ఆకసాన్ని ఒరుసుకునేట్టు చెలరేగాయి. నలుడు పెళ్ళికుమారునిగా అలంకరించుకోడానికి విడిదికి బయలుదేరాడు. దమయంతి తన మందిరంలోకి వెళ్ళిపోయింది.

దమయంతి ఇంతమందిలో తనను వరించి, తన కోర్కెను సఫలం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని నలుడు దోసిళ్ళతో వెండి బంగారాలు, నవరత్నాలు పంచిపెడుతూ విడిదికి వెడుతున్నాడు. తనను పొగిడేవారికంటె దమయంతిని పొగుడుతున్న వారికి ఎక్కువ ముట్టచెబుతున్నాడు.

కొందరు రాజులు అతని అదృష్టానికి అసూయపడుతూ "ఎత్తైగిరిన వాడు క్రింద పడక మానడులే!" "పెరుగుట విరుగుట కొరకే "... "అతి సర్వత్ర వర్జయేత్" "కామముతో కళ్ళు మూసుకుపోయినవాడికి సిగ్గుండదులే" "స్త్రీ సంగమంతో విప్రత్వం నశిస్తుందిలే" అంటూ గుసగుసలతో నలుని ఎగతాళి చేస్తున్నారు.

నలుడీ సూటిపోటి అపవాదులు వింటూ చిరునవ్వుతో విననట్లు నటించాడు. ఎవరో అపవాదులు సృష్టించవలసి వచ్చిందంటే తనలో అసలు దోషం లేదనే గదా! ఉత్తమ మనీషి తనలో లేని దోషాల్ని ఇతరులు చెప్పుకుంటూంటే నవ్వుకుంటాడు. నలుడు తన విడిదిలోకి వెళ్ళాడు.

## పెళ్ళి ఏర్పాట్లు

**వి**దర్భరాజగు భీమసేనుడు వైదికుల్ని పిలిచి, కర్పూరం తాంబూలాలిచ్చి, గంధంతో పూజించి "మంచి పెళ్ళి ముహూర్తం నిశ్చయించం"డని అడిగాడు. వారటువంటి శుభలగ్నం వెంటనే ఉన్నదని, పెండ్లికొడుక్కి కబురంపి వధువును సిద్ధంగా అలంకరించ వలసిందని తొందరపెట్టారు. కన్యాదాత వెంటనే పెళ్ళికొడుక్కి కబురంపాడు.

## వధువు

**స**ఖియలు, పరిచారికలు దమయంతిని తీసుకువెళ్ళి ముత్యాల కొలనులో కులాచారం ప్రకారం తలంటి స్నానం చేయించారు. ఆ సమయంలో చెలికత్తెల

చంకలలో నున్న బంగారు చెంబులు "దమయంతీ కుచాల అందం ముందు ఓడిపోయాముగదా" అని దుఃఖాశ్రువులతో నిండి పొర్లుతున్నట్టు తోచాయి.

దమయంతి నగ్నశరీరంతో పన్నీట స్నానం చేస్తుంటే, చలువరాతివలె నున్నగా తెల్లగా ఉన్న ఆమె శరీరం మరింత మెరుస్తూ – వర్ష, శరదృతువులలో కనుపించే సంధ్యాకాంతవలె ముచ్చటగా ఉంది. ఆమె శరీరం మీద నీటిబిందువులు మంచి ముత్యాలను మరిపిస్తున్నాయి.

ఆ తడి లేకుండా చెలియలు మెత్తని బట్టతో ఒత్తుతూంటే – బంగారపు బొమ్మకు సన్నని ఆకురాతితో మెరుగు పెడుతున్నట్లుంది ఆమె శరీరం. సువాసనలతో గుభాళిస్తున్న మెరుపుతీగలాంటి ఆమె అందం – సుగంధ పుష్పాల సారం రంగరించుకున్న బంగారంలా ఉంది.

చెలికత్తెలు ఆమె నొక బంగారు పీట మీద కూర్చోబెట్టి తలవెంట్రుకల తడి ఒత్తారు. తుమ్మెద రెక్కల్ని గేలి చేయగలంత నల్లగా నిగనిగ లాడుతున్న ఆమె కురులను సుగంధద్రవ్యాలతో పొగపట్టించారు. ఒకతె తన సన్నని పొడవయిన గోళ్ళతో జుట్టు చిక్కుతీసింది. ఒక సఖియ – పొగలలుముకుంటున్న దమయంతి శరీరాన్ని ఎగాదిగా చూచి, ఆమె స్తనాల మొనలచుట్టూ ఉన్న నల్లని వలయాలు కూడా జుట్టేననుకుని తన చిటికెనవేళ్ళ గోళ్ళతో చిక్కు తీయబోయింది. చెలులంతా ఫక్కున నవ్వారు.

సృష్టికర్త యగు బ్రహ్మవద్దనే అలంకార విద్య నేర్చినారనిపించే పరిచారికలు పెండ్లికుమార్తెను అలంకరించడం ఆరంభించారు. ఒకతె తలలో పూలు పెడుతుంటే, మరొకతె బంగారు బాసికం నుదుట కట్టింది. ఒకతె నొసలమీద కాటుక దిద్దింది. మరొకతె కనుగొనల అంచున నీలి రంగు కాటుకరేఖలు సవరించింది. ఇంకొకతె పద్మాలవంటి ఆకారంలో గల రత్నఖచిత లోలకాల్ని చెవులకు పెట్టింది.

ఒకతె ముక్కుకు ముత్యాల బులాకి పెట్టింది. ఇంకొకతె కంఠం మీద గంటసరిగె అమర్చింది. వేరొకతె పద్మరాగాల హారం వేసింది. ఒకతె నవరత్నాలూ అందంగా అమర్చబడిన ఒడ్డాణం పెట్టింది. ఒకతె బంగారు కడియాలు తొడిగింది. ఇంకొకతె కంకణా లలంకరించింది. వేరొకతె మట్టెలు సవరించింది. ఒకామె కొత్తపారాణీ పూసింది.

ముత్యాలను పిండిచేసి అంగాంగాల మీద చల్లారు. నుదుట చాదుతో చందమామ వంటి బొట్టుదిద్ది, పూరేకులు కూడా చిత్రించారు. తలపై తమలపాకు, పాపిట – రత్నహారాలు, మెడలో మరెన్నో భూషణాలు, దండకడియాలు, వీరముద్దియులు – పాయవట్టము మొదలయిన వేలాది రకాల నగలు అలంకరించారు. బుగ్గమీద దిష్టిచుక్క కూడా దిద్దారు.

అప్పుడిద్దరు పరిచారికలు ఒక నిలువుటద్దం ఎత్తి ఆమె కెదురుగా పెట్టారు. దమయంతీ కన్య తన ప్రతిబింబాన్ని చూచి – “చంద్రుణ్ణి వెక్కిరించాలనే నాకింత అలంకారం చేశారేమో ఈ చెలికత్తెలు ” అనుకుంది. అంత అందంగా, కన్నుల పండుగ్గా ఉంది ఆ వధువు. ఆమె వెంటనే లేచి బ్రాహ్మణ స్త్రీలను పూజించి, నమస్కరించింది. ఆ పుణ్య దంపతులు కన్యను మనసారా దీవించారు. అక్షింతలు జల్లి, తాంబూల ఫలాలు పుచ్చుకుని వివాహ వేదికవైపు వెళ్ళారు.

## వరుడు

**వి**డిదిలో ఉన్న నలునికి కూడా సేవికలు మంగళ స్నానం చేయించి, పెళ్ళికొడుగ్గా అలంకరించసాగారు. విసనకర్రలతో గాలి వీచి కురుల తడి ఆరజేశారు గిరజాల జుత్తును అగరుధూపం పట్టించారు. ఆ పొడవాటి జుత్తును అందంగా కొంచెం కుడిప్రక్క నుండేట్టు ముడి చుట్టారు.

పదారువన్నె బంగారంలా ప్రకాశిస్తున్న నలుని శరీరానికి మంచి గంధం పూశారు. సువాసనలు గుభాళించే పూలతో చెంగలువ జాజులు కలిపి దండలు కట్టి, అతని కొప్పుచుట్టూ అమర్చారు. ఒకతె నవరత్న మణియమైన కిరీటం పెట్టింది. అతని గుండ్రని మోము మధ్యన బంగారు బాసికం కట్టారు. భుజాలు తాకేట్టు వ్రేలాడే చక్రాలవంటి కుండలాలను చెవులకు తొడిగారు. అనేక రత్న మణిమయ భూషణాలు ధరింపజేశారు. ఒకతె పసుపుకొమ్ము. మామిడాకు గల తోరణాన్ని అతని మణికట్టు మీద పెండ్లి కంకణంగా కట్టింది.

కంకణాలు, మురుగులు, భుజకీర్తులు, ముత్యాలసరాలు అమరిన కల్పవృక్షమంతటి విశాల శరీరుడైన నలునికి తలమీద కిరీటం పూల తురాయిలాగా భాసించింది. ఆ విధంగా అలంకారాలు పూర్తి అయిన తర్వాత నలుడు ఒక నిలువుటద్దంలో తనను తా చూచుకున్నాడు. కాని ఎక్కువసేపు తన అందాన్ని చూచుకోలేకపోయాడు. ఊహాకాశంలో దాగి ఉన్న మన్మథుడు పుష్పబాణాలను ఎడతెగకుండా విసురుతూ విరహ వివశుణ్ణి చేస్తుంటే, తాళలేక ఈవలికి నడిచి వచ్చాడు.

## వివాహానికి ప్రయాణం

ఆడపెళ్ళివారు పంపించిన మహారథం మీద పెళ్ళి కొడుకు వివాహ మండపానికి బయలుదేరాడు. శత్రురాజు లెందరినో గెలచి 'జిష్ణుడు', అనే కుల కిరీటాలతో పాదపూజ లందుకుని 'కిరీటి', 'విజయుడు', 'ధనుంజయుడు' అని కీర్తి పొందిన నలుడు పెళ్ళికుమారుడై రాజవీధులలో ఊరేగుతూ పెళ్ళికి తరలి వెడుతుంటే పురకాంతలు తమ మేడలపై కెక్కి పిట్టగోడల మీదుగా ఇతన్ని చూస్తున్నారు.

ఒక యువతి తాంబూలం వేసుకుందామని తమలపాకుల చిలక చుట్టుకుంటూనే మేడమీద ఎక్కి నలుని చూడసాగింది. అతన్ని చూస్తూ కళ్ళు

తిప్పుకోలేని ఆనందంలో ఉండి ఆ ప్రక్క తోరణాల్లో ఉన్న మామిడాకుల్నే తాంబూలమని నమలసాగింది.

ఒక స్త్రీ "నేను పొట్టిదాన్ని, నాకా పెళ్ళికొడుకును చూపించవలసిం"దని తనతో ఉన్న ఉపనాయకుణ్ణి అడిగింది. భుజాలమీద ఎక్కించుకోమని ఒత్తిడి చేసింది. "నలుగురూ చూచి నవ్విపోతా"రంటే ఆమె ప్రియునిమీద అలిగి "ఇక నా యింటికి రావద్దు" అంది. అతడామెతో రహస్య ప్రణయాన్ని కోల్పోలేక ఆమెను భుజాలమీద ఎక్కించుకున్నాడు.

ఒకతె కనురెప్పలల్లార్పకుండా నలుని అందాన్ని చూస్తూ అప్సర సాంగనగా మారి, బంభరనృత్యం చేసింది. స్త్రీ లందరికీ ఎంత ఆసక్తి ఉందో అంత ఆత్రుత మొత్తం తనలోనే ఉన్నట్లుగా ఒకతె శరీరమంతా కళ్ళే చేసుకుని నలుని సౌందర్యాన్ని చూస్తున్నది.

ఒక యువతి నలుని అందాన్ని చూస్తుంటే ఆమె చనులు పిటపిట ఉబ్బి, పైపైటను కూడా చింపివేశాయి. ఆ గుబ్బలమీది శృంగారముద్రలు, మొనలు పూలబాణాలు తగిలినట్లుగా గగుర్పొడుస్తూ ఊగుతూంటే ఆమెకు మదనజ్వరం ఎక్కువయింది.

"ఇతడే జాణ, ఇతడు మగవారిలో పురుషుడు, ధీరోధాత్తుడు" అనుకుంటూ పురకాంతలు నలుని కళ్ళప్పగించి చూస్తున్నారు. "అంత మంది దేవతలు, రాజుల మధ్య దమయంతిచే ఎన్నుకోబడిన ఇతడు – మదనకేళిలో మన్మథుని జయించగల మొనగాడే అయివుంటాడు" అనుకుంటున్నారు.

"మన్మథుడు, జయంతుడు, నలకూబరుడు, ఇంద్రజిత్తు కూడా అందంలో ఇతని కాలిగోరు ముందు బలాదూరు" అనుకుంటున్నారు మరి కొందరు స్త్రీలు.

ఒకామె : "ఈ స్వయంవరోత్సవంలో ఓడిన ఇంద్రుడు ఇక యింటికి వెళ్ళడని పందెం! సిగ్గులేని మొహంతో ఇంటికి వెళ్ళినా ఆ శచీదేవి అతణ్ణి మళ్ళీ  పూర్వం వలె ప్రేమతో చూస్తుందా ఏం ?" అని స్నేహితురాలితో పందెం వేసింది.

"ఆ బ్రహ్మదేవుడు సకల స్త్రీలలోని అందాల్నీ స్త్రీత్వాన్నీ రంగరించి దమయంతిని సృష్టించి, ఆమెకు తగిన వాడుగా నలునికి మగవారి అందరి పుంస్త్వాన్నీ కట్టి పెట్టి ఉంటాడు. మన్మథుడు తన శక్తినంతటినీ ఈ వధూవరులిద్దరికీ సమంగా పంచి ఉంటాడులే !" అని మరికొందరు గృహిణులు చెప్పుకున్నారు.

"దేవేంద్రుని వరిస్తే శచీదేవికి సవతి అయ్యేది. నలుణ్ణి పెళ్ళాడితే దమయంతి దమయంతిగానే  ఉంటుంది. సవతిగా ఉండడం కంటె స్వయం వ్యక్తిత్వంతో ఉండడమే స్త్రీలకు సుఖం అని దమయంతి గ్రహించిందంటే – ఎంత వివేకవతో –"నని ఇంకొందరు ఇంతులు ఆశ్చర్యంగా చెప్పుకున్నారు.

నలుడు ధరించిన ఆభరణాలలోని నవరత్నల కాంతులు కళ్ళు మిరుమిట్లు గొలిపేట్టు మెరుస్తున్నాయి. సేవికలు వింజామరలు వీస్తున్నారు. వందిమాగధులు స్తోత్రపాఠాలు చదువుతున్నారు. సామంతరాజులు, పెండ్లికి వచ్చిన ఇతరులు ముందు నడుస్తున్నారు. నానావిధ మంగళవాద్యాలు మధురంగా మోగుతున్నాయి. సువాసనల నూనెలతో వెలుగుతున్న కాగడాలు వైభవాన్ని చాటుతున్నాయి.

రాజమందిరం వాకిళ్ళలో కర్పూరంతో, ముత్యాలతో ముగ్గులు దిద్దివున్నాయి. పూలూ, కస్తూరీ, పునుగు, జవ్వాజీ, అగరుధూపాల సువాసనలు కమ్ముకుంటున్నాయి. ముత్తయిదువులు పూలూ, పళ్ళూ చీరెలూ, కానుకలూ, పన్నీరు పట్టుకుని సింహద్వారం దాపులకు వెళ్ళారు.

భీమసేనుని పిలుపందుకుని కుంతల, గౌడ, చోళ, గాంధారాది దేశాల రాజులు పెళ్ళి చూడ్డానికి తరలివచ్చారు. మరెందరో ప్రముఖులు, సామంతులు మంత్రులు భార్యలతో సహా వివాహమండపం చుట్టూ ఉచితాసనాల మీద కూర్చున్నారు.

దమయంతి తమ్ముడయిన 'దముడు' కాలినడకన ఎదురు వచ్చి పెళ్ళికొడుకును పూజించి, గౌరవాచారాల ప్రకారం రథం నుంచి దింపాడు. పెళ్ళి పెద్దలు వియ్యాలవారివలె సరస సల్లాప ప్రసంగాలతో, చమత్కార సంభాషణలతో కడుపార నవ్వుకుంటున్నారు.

బావమరిది ఆహ్వానంతో నలుడు ద్వార ప్రవేశం చేసి, ముత్తయిదువుల హారతులందుకుని, వివాహ వేదిక మీద బ్రాహ్మణోత్తములు సూచించినట్లు ఆ ప్రక్కనున్న తెర చాటుకు వెళ్ళాడు. మంగళ వాయిద్యాలు రెట్టింపుగా మ్రోగాయి.

## పెళ్ళి

**తె**రచాటున ముత్తయిదువులు నలునికి కర్పూరహారతు లిచ్చి దీవించారు. అతడు ఆచార ప్రకారం దమయంతి చేతిని పట్టుకుని – ఆమెతో కలిసి వివాహవేదిక మీదికి వచ్చాడు. వధూవరులు తగు పెండ్లిపీటల మీద ఆసీనులయ్యారు.

భీమసేనుడు వరునికి పానకం ఇచ్చి,మధుపర్కాలు సమర్పించాడు. మామ ఇచ్చిన పానకం తాగుతూ 'ఈయన కూతురి అధరామృతం ఇంకెంత రుచిగా ఉంటుందో' అనుకున్నాడు నలుడు.

పురోహితులు వధూవరుల చేతులు మరొక పచ్చతోరణంతో కట్టి, వరుని చేతిమీద వధువు చేతిని బెట్టి పుణ్యాహవాచనం చేయించారు. భీమసేనుడు కూతురు చేతిలో సువర్ణాక్షతలు, పన్నీరూ పోసి అల్లునికి తన కన్యను దానం చేశాడు.

రాజు అతనికి చింతామణి వంటి కోర్కెలుదీర్చే రత్నాన్ని, తన పదునుతో యమునినే సవాలు చేయగల బంగారపు ఖడ్గాన్ని, శివుడు తన కిచ్చిన బంగారు రథాన్ని కానుకలుగా ఇచ్చాడు. ఆ రథం ఎక్కినవాడు తలచిన చోటికి ఎక్కడికైనా సరే వేగంగా చేరగలడు. యుద్ధంలో దేవేంద్రుని కూడా ఎదిరించగల సాహసాన్ని పురికొల్పే ఒక తెల్ల గుర్రాన్ని, మహత్వం గల వస్త్రాలను కూడా భీమసేనుడు వరకట్నంగా ఇచ్చాడు.

విశ్వకర్మ ఒకే మాణిక్యాన్ని తొలచి పెద్ద పెట్టెని తయారు చేసి మహేంద్రుని కిచ్చాడు. దాన్ని విదర్భరాజు ఇంద్రుని మెప్పించి పొందాడు. ఆ మహాద్భుత వరప్రసాదాన్ని ఇప్పుడు మామగారు నలునికి ఇచ్చాడు. ఆ పెట్టెని చూస్తే నెమలి విషాహారం తినడమూ, పించం విప్పి నాట్యం చెయ్యడం మానివేస్తుంది. శివుడు కపాలనృత్యం చెయ్యడం ఆపుతాడు. ఇక ఆ పెట్టెకు ఎంతటి మహత్తు ఉన్నదో గదా!

భీమసేనుడు అల్లునికి ఆరణంగా ఏనుగులు, గుర్రాలు, లొట్టి పిట్టలు, నవరత్నాలు, బంగారం, దాసదాసీజనం, నాట్యకత్తెలు, వాద్యగాళ్ళతో ఇచ్చాడు. ఆ కానుకలు వాటికవే సాటి అనేంత గొప్పగా ఉన్నాయి.

వధూవరులు అగ్నికి ప్రదక్షిణం చేసి వివాహ ప్రతిజ్ఞలు చేశారు. ఆకాశంలోని ఉత్తానపాది, అరుంధతీ నక్షత్ర దర్శనం చేసుకున్నారు. బ్రాహ్మణులు, ముత్తయిదువులు, పెళ్ళి పెద్దలు ఆశీర్వాదక్షతలు జల్లిన తర్వాత తలంబ్రాలు పోసుకున్నారు.

తలంబ్రాలు పోసుకునేప్పుడు దమయంతి మగని ఎక్కువసార్లు చూడగలిగింది. అంతకు ముందు మరీ సిగ్గుతో తల వంచుకునే ఉన్నదామె. రెండు చేతులా అక్షింతలు దోసిలిపట్టి, పైకెత్తి అతని తలమీద పోసేప్పుడు

కనులు పెద్దవిచేసిన్నీ, క్రీగంటితోనూ నలుని మోమును చూస్తున్నది. అలా దోసిలి పైకెత్తేటప్పుడు చనుకట్టు మీది కంచుకం ఒదులుతున్న ట్టుండి తన భుజదండ కడియాల రాపిడికి చనులమీద గిలిగింతలు పుడుతున్నాయి.

ఆ విధంగా భర్త మోమును చూచినప్పుడల్లా ఆమెకు నవ్వు వస్తున్నది. ఆయన తనమీద పోస్తున్న తలంబ్రాలు చెవులకు, చెక్కిళ్ళకు, రొమ్ములకు తగిలి పూలమొగ్గల్లా గిలిగింతలు పెడుతున్నాయి. ఒళ్ళంతా జలజలమంటూ పులకలెత్తుతూంది. కోరిక లూరుతూంటే ఆమెకు మరీ సిగ్గవుతున్నది.

పెళ్ళి అయిపోయింది. ఒక ముత్తయిదువ వచ్చి వధూవరులను లేవదీసి ఒకరి చిటికెన వ్రేలును మరొకరి కొనవ్రేలికి గీలించి "గట్టిగా పట్టుకోండి" అని హెచ్చరించింది. శోభన గృహప్రవేశానికి ఇద్దరూ జంటగా నడుస్తూంటే నలుడు కొనగోటితో ఆమె వ్రేలిని గుచ్చాడు. అది ఆమెకు బాధ కలిగించక, మదనబాణం తగిలినట్లు ఒడలంతా జలదరింప జేసింది. ఆ భావంతో వివశయైన ఆమె కొంచెం మందంగా అడుగులు వేస్తూంటే మగడు తొందరగా చిటికెనవ్రేలును నొక్కిపట్టి లాక్కుపోతున్నాడు.

నూతన దంపతులను స్త్రీలంతా కలసి కేళీమందిరంలో ప్రవేశపెట్టి తలుపులు మూసేశారు. కాని ఆ మందిరానికి ఎటు చూచినా వేయికంత లున్నాయని; స్త్రీలు తమకు జరిగిన శోభనాలను, జరుగనున్న కేళీసుఖాలను పుక్కిలింతలుగా తలచుకోడానికి ఆ కంతలకు కళ్ళు చేర్చారని నల దమయంతు లకు తెలియదు గదా! సిగ్గుతో రెండుచేతులా కళ్ళ మూసుకుని, మళ్ళీ కుతూహలంతో వ్రేళ్ళు ఎడంచేసి మగని చూస్తున్న దమయంతిని నలుడు అమాంతం కౌగలించుకుని, అలవోకగా ఎత్తి ముద్దాడుతూ మంచం మీదికి ఎత్తుకెళ్ళాడు.

## పెళ్ళి సరదాలు

**అ**ప్పుడు పెళ్ళికి వచ్చిన వారందరికీ భోజనాలు వడ్డించడం మొదలైంది. పెండ్లిపందిరి నంతటినీ శుభ్రం చేయించి, పన్నీరుజల్లి, పట్టాల వరుసలు వేశారు. అగరునూనెల దీపాలు అమర్చారు. వెండిపీటల మీద బంగారుపళ్ళేలు ఉంచారు. తగు జంతువుల వెంట్రుకలతో నేయబడిన రకరకాల రత్నకంబళాలను ఆసనాలుగా వేశారు.

ప్రేమతో, వావివరుసలతో యెకసక్కేలు ఆడుతూ, కేరింతాలు కొడుతూ సరదాలు తీర్చుకుంటున్నారు– మర్యాదలు చేస్తున్నవారూ, అతిథులూ కూడాను. “ఒరే – అంతంత నీరు తాగినా దాహం తీరటం లేదు నీకు; కామదాహ మెవరు తీరుస్తార్రా బావా” అని ఒకడు ఎగతాళి చేస్తే, ఆ బావగారు “మీ అక్కనే అడగరా” అన్నాడు. స్త్రీలను పరోక్షంగా వర్ణించే ఎబ్బెట్టు మాటలతో కూడా కొందరు విరసం కాని సరసాన్ని ఒలికించారు.

పిండివంటలు, పానకాలు, పాయసాలు, కూరగాయలు, పచ్చళ్ళు, రసాలు, పెరుగు, మీగడ, వెన్న, నేతులతో అపూర్వమయిన విందులు వడ్డించి అందరినీ తృప్తిపరిచారు. తాంబూలాలిచ్చి పంపారు.

## అప్పగింతలు

**న**ల దమయంతులు మూడురాత్రులు నిద్రలయిన తరవాత నిషధానికి బయలుదేరారు.

పురోహితులు తగు మంత్ర శ్లోకాలు చదివారు. నలుడు తన పరివారాన్ని గుడారం ముడిచి, బయలుదేరవలసిందని కబురంపించాడు.

“మా అమ్మాయి ఒక్క రోజయినా మమ్ము వదలి యుండలేదు. ఎప్పుడూ మా దగ్గరే పడుకునేది. నీతో కాపురానికి తీసుకు వెళుతున్నావు. దాన్ని వదిలి

వేము, మమ్ము వదిలి అదీ దూరాన ఉండవలసి వచ్చింది'' అంటూ అత్తమామలు కన్నీరు పెట్టుకున్నారు. మూన్నాళ్ళ క్రితం అల్లుడయిన నలుని సాగనంపడాని క్కూడా ఆ దంపతుల కెంతో బెంగగా ఉంది.

నూతన దంపతుల్ని రథమెక్కించారు. రథం కదలబోయే ముందు దమయంతి తలిదండ్రుల వంక జాలిగా చూచి దిగ్గున కిందకి దిగి వచ్చింది. తండ్రి ఆమెను దగ్గరగా తీసుకుని "అమ్మా! ఇకముందు నలుడే నీకు భర్త, ప్రభువు, గురువు, చుట్టం, పుణ్యం, దేవుడు, మనస్సు, తృప్తి, వాత్సల్యం, సర్వస్వమూను. మామీద బెంగ పెట్టుకోవద్దు.

దేవతల్ని, అత్తమామల్ని పూజించుకో... సవతుల్ని తోబుట్టువుల్లాగా పొగుడు, పరిచారకులను దయతో చూడు, భర్త మెచ్చుకుంటే గర్వపడకు, ఆయన కోపించితే అలుగకు, తోడికోడళ్ళతో కలసిమెలసి ఉండు,దాసీ జనాన్ని తల్లిలా చూడు, గురు బ్రాహ్మణ బంధువులను భక్తి విశ్వాస స్నేహ భావాలతో చూడు, ధర్మం తప్పకు" అని మంచి బుద్ధులు గుర్తుచేసి, ఆమె కన్నీరు తుడిచి బుజ్జగించి పంపాడు.

ఆమె తోడబుట్టిన వాళ్ళు – కస్తూరి, పునుగు, జివ్వాజి, కుంకుమ పువ్వు, పచ్చకర్పూరం, పన్నీరు, చాదు, కాటుక, బంగారుగాజులు, ఇతర ఆభరణాలు బళ్ళకెత్తి దమయంతి వెంట పంపించారు. పూలతోటలు, పండ్లతోటలు, నీటివసతులు, జలపాత పాషాణాది నిథులతో సహా నూరు గ్రామాలను ఆమెకు పసుపు కుంకుమలకని కట్నంగా ఇచ్చారు.

బంధు మిత్ర గురు పురోహితుల్ని వదలి వెళ్ళేప్పుడు దమయంతి కంట విచారం పెల్లుబుకుతుంటే, ప్రక్కకు చేరిన నలుడు కొనగోట అశృబిందువులు తుడుస్తూ ధైర్యం చెప్పి, పెద్దలకు నమస్కరించి, రథాన్ని ముందుకు తోలించాడు. అలా కాపురానికి వెడుతున్న దమయంతిని పురవాసులు కూడా బెంగగొన్నట్టు చూశారు.

## పురప్రవేశము

**న**లుడు భార్యతో వస్తున్నాడని ముందే వర్తమానం అందినందువల్ల – నిషధ మంత్రి సామంత దండనాధికారులు, పురప్రముఖులు, పౌరోహితులు, పరిచారకులు, ముత్తయిదువులు రాజధాని కోటల బయిటికే మంగళవాద్యాలతో ఎదురు వచ్చి హారతులిచ్చారు.

కోట గుమ్మం చేరేవరకూ ప్రక్కలనే అనుసరిస్తున్న మంత్రి, దండనాధుడు ఏవేవో రాజకీయ విశేషాలు నలునికి చెప్పి తగు సమాధానాలు పొందుతూనే ఉన్నారు. కాని – దమయంతి తదేకంగా తనవంకే చూస్తున్నదని ఎరిగిన నలుడు క్రీగంటితో ఆమెను చూస్తూ కొంత పరాకుగా ఉన్నట్టున్నాడు.

నూతన దంపతులకు నిషధ పౌరకాంతలు ఘనంగా సంతోషంగా స్వాగతాలిచ్చారు. మేడలమీదినుంచి పూలు జల్లారు. కొత్త రాణీగార్ని చూడాలని జనం తొక్కిసలాడుతూ ఒకరి భుజాలమీద ఆని మరొక రెగురుతూ చూస్తున్నారు.

నలుడు దమయంతితో అంతఃపుర ప్రవేశం చేసేప్పుడు – పెళ్ళి నాటినుంచి అప్పటివరకు ప్రతి కార్యాన్నీ ఆనందంతో చూస్తూ అదృశ్యంగా ఉన్న – దేవతలు వారిమీద పూలవర్షం కురిపించి ఆశీర్వదించారు. నూతన దంపతులు పెద్దలకు నమస్కరించి కేళీగృహంలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నారు.

## దేవతల ప్రయాణం

**అ**ప్పుడు ఇంద్రాది దేవతలు తమ లోకానికి ప్రయాణమై ఆకాశ మార్గాన వెళ్ళసాగారు. ఇంద్రుని రథం ఆ సారధి మెలకువల ప్రకారం వేగంగా నడుస్తుంటే మేఘాలు దారిగా ఏర్పడుతున్నాయి. ఆ రథచక్రాలు దొర్లేప్పుడు మేఘాలనుండి ఉరుములు, మెరుపులు పుడుతున్నాయి. రథం మీది జెండా సగర్వంగా ఎగురుతూంది. ఆ వెనుక అగ్నిహోత్రుడెంతో ఆనందంతో

నృత్యం చేస్తున్నాడు. చూచేవాళ్ళు 'దమయంతి ఇతన్నే వరించిందేమో' అనుకుంటున్నారు.

స్వయంవరోత్సవ సందర్భంలో దమయంతి పలికిన మాటలు తమ చెవుల్లో ఇంకా మృదుమధురంగా ప్రతిధ్వనిస్తున్నందువల్ల ఇంద్రాగ్ని యమ వరుణులు సంతోషాతిశయంతో వేగంగా తమతమ ఇళ్ళకు వెడుతున్నారు. వాళ్ళు చాలా కాలం దమయంతిని మనసారా కోరినా – అంతటి అందగత్తె తమ శిష్యునికే లభించింది అనే తృప్తితో ఆశీర్వదించే గురూత్తముల్లాగా, పితృభావాలతో పరవశమౌతున్నారు. వాసుకి మొదలయిన కొందరికి మాత్రం ఇంకా దమయంతి మీద ఆశ వదలనూ లేదు, పెరగనూ లేదు.

దేవత లావిధంగా, పక్షులు ఎగిరే ప్రాంతం, మేఘాలు నడయాడే త్రోవ, గంధర్వలోకం, చంద్రలోకం, సూర్యుడు తిరుగాడే కక్ష్య, మందాకినీ నది ప్రవహించే లోకం, ధృవనక్షత్రమండలం వరుసగా దాటి స్వర్గ లోకానికి చేరుకున్నారు.

## మన్మథుడు

**వా** రా లోకంలో ప్రవేశించేసరికి ఏదో గొప్ప కలకలం వినిపించింది. అనేకమంది జనం ఒకేసారి కిలకిల నవ్వుతున్న ధ్వనులు, వారి ఆభరణాలు కదులుతున్న సవ్వడులు, రత్నాల నుండి తళతళ వెడలుతున్న కాంతులు నిండాయి. ఆ దేవతలకు ఎదురొచ్చి ఆహ్వానిస్తున్నట్లుగా ఒక రాజహంస చిగురుటాకులు ముక్కున బట్టి మెల్లమెల్లగా వారి దోవలో ఎదురయింది.

ఆ తరువాత నిత్యయౌవన సంతోషులైన యువతీ యువకుల గుంపొకటి కేరింతలు కొడుతూ కనిపించింది. ఆ గుంపు మధ్యన ఒక చిలుక రథాన్ని లాగుతూంది. ఆ రథసారధి ఒక లేత ఆకునే చెరణాకోలగా ఉపయోగిస్తున్నాడు. ఆ రథంమీద రతీ మన్మథులు నాట్యం చేస్తున్నట్టున్నారు.

రతీదేవి కుచద్వయం అటు నిటు కదులుతూంటే మన్మథుని కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి. చెరకువిల్లు, పూలబాణాలు ఎడమ చేతిలో పట్టుకున్నాడు. వక్షస్థలం మీదుగా భుజాల మీద పచ్చ జిలుగు పట్టుపంచె వేసుకున్నాడు. నృత్యం చేస్తున్న అతని పాదాలు వీర శృంగార రసాల్ని సృష్టిస్తున్నాయి.

చీకటిలో పరసతుల్ని కలిసేవారు, దూతికలు కబురు చెప్పగానే సిగ్గువదలి పరపురుషుల్ని చేరేవారు, వేళా నియమాలు లేకుండా కామాతురులయ్యేవారూ ఆ మన్మథుని చుట్టూ జేరి భక్తితో భజనలు చేస్తున్నారు. అతని రథంమీద గండుచేప చిహ్నంగల జెండా రెపరెపలాడుతూన్నది. తులసీదళాల దండ అతని వక్షస్థలం మీద వ్రేలాడుతున్నది. ఆ దళాలు వాడకుండా పైన ఓ జిలుగుల గొడుగుంది.

కానీ – నలుని, దమయంతిని చూచిన దేవతల కళ్ళకు ఈ రతీ మన్మథులు డోకువచ్చారు. ఆ వెగటును దేవవైద్యులైనా పోగొట్టగలరో లేరోననుకుంటూ దిక్పాలురు త్వర త్వరగా ముందుకు వెళుతున్నారు.

## క్రోధుడు

**కొం**తదూరం వెళ్ళేసరికి ఒక భయంకరుడు ఎదురయ్యాడు. అతని కళ్ళెర్రగా సెగలు కక్కుతున్నాయి. కోపంతో ఒళ్ళంతా కావిరంగుకు మారింది. చెమటలు కారుస్తున్నాడు. చిమ్మచీకటి వంటి కనుబొమలు నుదురు మధ్యకు లేస్తున్నాయి. కోరలవంటి దంతాలు నూరుకుంటుంటే నోటి అంచుల నుంచి రక్తం కారుతుంది. పెదవులదిరిపడుతున్నాయి. మీసాలు కంపిస్తున్నాయి. గొంతులో హుంకారం వినవస్తున్నది. క్రోధుడనే అతడు నేలనీ ఆకాశాన్నీ కూడా మింగేస్తానంటున్నాడు.

అతడు లోకాలు దద్దరిల్లేట్లు హుంకరిస్తూ దేవతల్ని ఎదురించాడు. పూర్వం – మన్మథుని బాణాలు ఎన్నడూ తగలని దూర్వాసుడు లోకాలమీద అలిగినప్పుడు ఆ ముని మనసులో పుట్టిన కోపం అది. దానికెన్నడూ పట్టాభిషేకం జరగలేదు. ఆ కాంక్షతో ఎదిరించిన క్రోధాన్ని చూచి దేవేంద్రుడు తన వేయికళ్ళూ మూసుకుని రథాన్ని ప్రక్కదోవకు మళ్ళించి వెళ్లసాగాడు.

క్రోధం తన హృదయంలో మూలమూలలకూ వెళ్ళి తనే మండుతూంటుంది. కళ్ళు బయర్లు గమ్ముతాయి. బైరాగికి ప్రేమకలాపం తెలియనట్లే క్రోధానికి తన సుఖ సంతోషాలేమిటో తెలియవు. కనుబొమల్ని నల్లత్రాచుల్లా చేసుకుంటూ, వక్రదంతాలు నూరుకుంటూ, తన రక్తాన్ని తానే త్రాగి ఆ రుచికి మత్తెక్కి మరింత హుంకరిస్తూ క్రోధుడు మరెటో వెళ్ళిపోయాడు.

## లోభుడు

**దే**వతలు మరికొంత దూరం వెళ్ళేసరికి లోభుడు ఎదురు వచ్చాడు.

లోభుడి వాలకం చూస్తేనే జాలి పుడుతుంది. మొహంలో ఏదో పోగొట్టుకున్న దిగులు; అనవసరంగా పళ్ళు ఇకిలించడం, చేతులు బారలు సాచి వాడిపోయిన తోటకూర కాడల్లా విదల్చడం, సగం మూసుకుపోయిన గొంతుతో అరకొరగా మాట్లాడ్డం అతని అలవాటు.

కడుపులో దహించుకుపోయిన ఆకలి మంటల సెగలు తగిలి కనుకొలకులు మాడిపోయినవారు. అనుభవించేవారిని పులుకూ పులూకూ అసూయగా, ఏహ్యంగా చూచి గుటకలు మింగేవారు; ఎవరైనా ఊరకే పెడితే ఆకలైనకంటె ఎక్కువగా తినేవారు; ఇతరులు డబ్బు ఇస్తామంటే పరుల ప్రాణాలు తీసే పనులకైనా ఒప్పుకునేవారు; కాకికి కడచేత్తో, ఈగకెడంచేత్తో ఎంగిలైనా విసరనివారు; ధనరాసులకు కాపలా ఉండే దయ్యాన్ని తోలేవారు – ఇలాంటి వారంతా ఆ లోభిని పూజిస్తూ కీర్తిస్తూ చుట్టూ చేరారు.

కామ క్రోధాలకంటె లోభం బహు చెడ్డది. కామక్రోధాల వల్ల పుణ్యపాపాల్లో ఒకటిగాని, రెండుగాని లభించవచ్చు. లోభం పంచ మహాపాత కాలకూ కారణభూతం.

దేహమనే గృహంలో అనేక అంగాలు, జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. అన్నిటిలోనూ గృహానికి గొప్పది నాలుక. ఆ నాలుకకు కావలసిన రుచులు తన సొమ్ముతో అందించడు. పైగా ఆ నాలుకతోనే తనకెంత సిరిసంపదలున్నా నిరుపేదనని దీనంగా వాగుతూంటాడు. ఆకలైనవాడు ఏడుస్తూ భిక్షాపాత్రను ముందుకు చాస్తే, ఆ పాత్రలో పడుతున్న అతని కన్నీరు కూడా తన కుపయోగపడాలని తన పెరటిచెట్లకు పోయించి, ధర్మమీయక, భార్యా బిడ్డలెవరైనా బిచ్చం వేస్తామంటే వద్దని కట్టడిచేస్తాడు. ఇతరుల వన్నీ తనకు చేరాలని సదా కోరుతూంటాడు. చోర, జార, ధూర్తత్వాలు నేర్పే కలిమహారాజుకు నచ్చిన స్నేహితుడు-లోభి. ఆ లోభుడు దేవతలకు మ్రొక్కి దూరంగా వెళ్ళిపోయాడు.

## మోహుడు

**కొం**తసేపటికి ఇంద్రాది దేవతలకు మోహుడనేవాడు ఎదురు వచ్చాడు. అతని శరీరం చాలా పెద్దది. అన్నింటా తనకే 'పట్టాభిషేకం' జరుగుతుందనే గర్వంతో నవ్వుకుంటూ ఒంకర టింకర దోవలగుండా నడుస్తూ మోహుడు వచ్చాడు. పసివాళ్ళు, తామే గొప్ప అనుకునేవాళ్ళు, మిడిమిడి జ్ఞానులు, భోగలాలసులు, ఇతరులతో మమైకంగా ఉండలేని వారు - మోహునికి పరివారంగా వెంట వస్తూ, అతన్ని వేనోళ్ళ పొగుడుతున్నారు.

మోహం అంటే-జ్ఞాన మనే దీపానికి సుడిగాలి వంటిది, కామ, క్రోధ, లోభాలకు కారణం, నిత్య జీవితంలో కపట విద్య, ధర్మమార్గంలో ముళ్ళకంప, శూన్యంలోనే బంగారం పండించవచ్చుననే పిడివాదం. జ్ఞానోదయానికి అడ్డుతెర, అంధకారాన్ని వ్యాపింపచేసి అదే వెలుగనుకునేది. కళ్ళకు నిద్ర, మనసుకు

జోలపాట, కళ్ళకు చత్వారం, చెవులకు చెవుడు, అలాంటి గుణాలన్నీ ఉన్న మోహుడు ఎదురయ్యేసరికి ఇంద్రుడు మొదలయిన దేవతలంతా కళ్లప్పగించి చూస్తూ నిలబడిపోయారు.

## కలిరాజు

**అం**తలో కలిరాజు ప్రవేశించాడు. పాపాలనే నీలిరంగు వస్త్రాలు ధరించినవారు, పగటివేళ నిద్రలనే ధోవతులు కట్టినవారు. పరధూషణాలనే భూషణాలుగా ధరించినవారుగా అన్యకాంతలపై కామవాంఛ శరీరముల రంగుల గలవారు, అసూయ అనే పర్వతంపై నాట్యం చేసేవారు, మంచి వారిని తిట్టడమే పూలదండలుగా ధరించినవారు, అబద్ధాలనే బొట్లు వెట్టుగా పెట్టుకున్నవారు, తీరని ఆకలినే ఆయుధంగా గలవారు – కలిరాజుకు నమ్మిన బంటులు. అలాంటి వారంతా ఆ రాజు వెంటనే ఉన్నారు.

అలాంటి పరివారం ప్రక్కను మరికొందరున్నారు. వారిలో – కొందరు కుండల్లా పెరిగిన బొజ్జలకింద దిండ్లులాగా చిట్టా ఆవర్జాలు కట్టుకున్నారు. కొందరు బూజుపట్టి, వాసనవేస్తున్న శరీరాలపైన అగరునూనెలు జల్లుకున్నారు. మరికొందరు తమ బట్టతలలు కనిపించకుండా పట్టుచీరెలు తలపాగాలుగా చుట్టుకున్నారు. ఇంకొందరు భుజాలకంటా వ్రేలాడే చెవుల తమ్మలకు ఎర్రపోగులు తొడుక్కున్నారు. మాటిమాటికీ కలిరాజు గొప్పతనాల్ని పొగడుతూ వెంటవచ్చారు.

వాళ్ళంతా కలసి మూడులోకాలూ వినేటంత బిగ్గరగా మాట్లాడసాగారు! “యాగఫలము, చల్లని నీటిలో స్నానము, దేశాంతరంలో, దేహాంతరంలో, కాలాంతరంలో కూడా పొందేది ఆత్మేననే మాట నిజమే. వేద రహస్యాలన్నీ విడమర్చి, విమర్శించి వేద ప్రమాణాలు చూపిస్తేనే గదా బుద్ధుడు జీవితం, జగతీ స్థిరం కాదని నిరూపించాడు! కనుక ఎప్పుడేది ఆత్మకు సుఖం, సంతోషం,

తృప్తి ఇస్తుందో దాన్ని చేసి, అనుభవించడమే ధర్మం, బుద్ధి. పౌరుషాలు లేని అధములు మాత్రమే అగ్నిసాక్షి అనీ, ఈషణ త్రయమనీ, పాపపుణ్యాలనీ వైరాగ్యమనీ చెబుతూ ఉపాయంగా జీవిస్తూంటారు. స్వచ్ఛందంగా మనసులో కోరేదే ధర్మం! కాముడే దైవం! చావుతో జీవితం ముగుస్తుంది. మండి బూడిదైపోయిన మనిషి మళ్ళీ జన్మిస్తాడనటం కంటె బుద్ధి తక్కువ మరొకటి లేదు. అందువల్ల బ్రతికి ఉన్న ప్రతిక్షణం ఏ విధంగా నయినా సరే కోరినవన్నీ అనుభవించడమే ధర్మం.

తమను తాము రక్షించుకోలేని నీరసులు 'పర స్త్రీలను తల్లులుగా చూడా'లంటూ రక్షించ ప్రయత్నిస్తారు. అదే వంశాచారం అంటారు. మన్మథుడు తమను తప్ప మరెవర్నీ ప్రేమజ్వర పీడితుల్ని చేయడా ఏం? ఇంద్రుని కంటె ధర్మాలు తెలిసినవాడు ఏ లోకంలోనూ లేడంటారు. అతడు అహల్యతో వ్యభిచారం చేసి పుణ్యలోకాలేలుతున్నాడంటే - అందరూ వ్యభిచారం చేయడానికి అనుమతి ఇచ్చినట్లే గదా?

మదనుణ్ణి ఎవరూ ఎదుర్కోలేరు. ఈ సంసారమనేది పూర్వకాలం నుంచీ ఉన్నదే. వంశాన్ని పెంచడం, సంరక్షించడం ఎప్పుడూ ఆడవాళ్ళ చేతుల్లో ఉన్న బాధ్యతే. ఇక జాతిని పవిత్రంగా కాపాడుకోవాలంటే ఎలా సాధ్యం.

బ్రాహ్మణులారా! మీకు రాజు చెప్పిందల్లా ధర్మమే. చంద్రుడు మీ రాజు. వాడు గురువుగారి మంచమే ఎక్కి గురుభార్యతో పవ్వళించాడు. మీరూ అలాగే ధర్మంగా ప్రవర్తించడయ్యా!

ఏ పని సుఖాన్నిస్తుందో ఆదే సుకృతం అని వేదాలు ఘోషిస్తున్నాయి. సుకృత పుణ్యంకంటే జీవితలక్ష్యం లేదని అంతా అంటారు. అయితే ఏ కార్యమైనా రతికార్యం కంటే ఆనందాన్నిస్తుందటయ్యా ? మరి-అది సుకృతం కాదంటారేం మహానుభావులారా ?

రాళ్ళను ఎంత అందమైన బొమ్మలుగా చెక్కినా వాటి మీద విత్తులు జల్లితే మొలవవు. పువ్వూ పువ్వూ కలుసుకుంటేగాని ఫలాలు పుట్టవు. అడవుల్లోని పువ్వులు కొయ్యటం, విత్తనాలు జల్లి మొలకెత్తించడం తప్పంటారు ఎందుకయ్యా?

ఇతర స్త్రీలను ఇష్టంలేకుండా రమించడం హింస, పాపం అంటారు. అయితే – ఓ వేద పండిత విప్రులారా! జీవహింస పాపమని ఎరిగికూడా యజ్ఞ యాగాలు మానరేమయ్యా ? మనువు నీతిశాస్త్రంలో – బలాత్కార క్రియలన్నీ అధర్మం అని వ్రాశాట్టగా ? యజ్ఞ యాగాలలో ఎన్ని బలత్కారాలు చేస్తున్నారోగదా బ్రాహ్మణులూ రాజులూను ! ఇక తతిమ్మావాళ్ళు జనులందరూ కూడా ఎన్ని రకాల బలాత్కారాలు చేస్తే మాత్రం పాపమేమిటండీ ?

వివిధ శాస్త్రాల మధ్య ఐకమత్యం లేదు. నిగమ శాస్త్రాలు ఒకచోటా నిలవవు. ఆగమశాస్త్రాలు మరోరకంగా నడుస్తాయి. తర్కశాస్త్రం బురదలో కూరుకున్న స్తంభం లాంటిది–ఉండనూ ఉండదు. ఊడనూ ఊడదు. మంత్ర పారాయణలు వేలరకాలు. సాంఖ్యయోగం దారే మరొకటి. దర్శనం ఏదయినా వ్రాసినవాడి తెలివితేటలు మాత్రమే. వీటిని ఏ విధంగా నయినా వ్యాఖ్యానించు కోవచ్చు. ఇన్ని రకాలెందుకు అసలు – దుఃఖం కాకుండా సుఖం పొందే మార్గాలేవో అవే అనుసరించడం అసలు ధర్మం.

బ్రతికినంతకాలం ఇష్టం వచ్చిన సుఖాలన్నీ పొందిన శరీరం అగ్నిలో మండి బూడిదై పోయిన తర్వాత ఇంకా పాపం, పుణ్యం ఏమిటయ్యా ? అందువల్ల బ్రతికినప్పుడే అందినవన్నీ అనుభవించి, స్వస్త్రీలు, పరస్త్రీలు అనే భేదం లేకుండా అందినవారినల్లా అనుభవించి మీ ఆత్మలను సుఖ పెట్టుకోండి.

చచ్చిపోయినవాడటా – పుడతాట్ట, పెరుగుతాట్ట ! పైగా ఇంకెవడో తింటే ఆ చచ్చినవాడికి తృప్తీ, పుణ్యమూనట ! కర్మఫలమట ! ఇదంతా బుద్ధిలేని

మోసగాళ్ళు పొట్టకూటి కాశపడి చెప్పే నీతే సుమా! నమ్మకండి. నమ్మితే మోసపోతారు. సుఖించండి!

ఏ ఫలితం కోసం కృషి చేసినా – కొన్ని ఫలిస్తాయి, కొన్ని జరగవు. ఫలిస్తే – మంత్ర తంత్ర శకున దైవ పుణ్య ఫలితం అంటారు. చెడిపోతే – పాపఫలం అంటారు. ఇంతకంటే మూర్ఖత ఉండదు. మనువు ధర్మశాస్త్రంలో – యాచించినవాడికి పెట్టాలో, అక్కర్లేదో, అది పుణ్యమో పాపమో తేల్చకుండా ఉభయపక్షాలకూ బలం చేకూరుస్తూ వాదాలు చేశాడు. ఇట్లా ఎందుకు చేశాడో మీరు గ్రహించారా ? లోకుల్లో ఎవరివద్ద తన కెక్కువ లాభం ఉంటే వారి తరఫున వాదించి, ధన సుఖ భోగ సంపాదన చేసేందుకే!

మానవులు చేసే పాపాలకు భూదేవి కూడా బాధలు పడుతుందని మనల్ని భయపెడుతూంటారు. ఈ భూలోకంలోని కోటానుకోట్ల జీవులు క్షణక్షణం అనేక రకాలుగా పాపాలనేవి చేస్తూనే ఉన్నాయి. అన్ని కోట్ల కోట్ల కోట్ల పాపాల భారం మోసే భూదేవికి నీ ఒక్కడి పాపం బరువటయ్యా ? బండినిండా రాళ్ళు మోస్తున్న ఎద్దుకు ఒక చింకిచేట బరువటయ్యా ?

ఇక మునులు, యోగులనేవారు చెప్పే నీతులు మరీ విడ్డూరంగా ఉంటాయి. స్త్రీల శరీరాలు – లాలాజలంతో, మూత్ర కశ్మలాలతో, చెమట రొచ్చులతో నిండి రోతగా ఉంటాయని వర్ణిస్తారు. ఆ స్త్రీలనే – పన్నీరు కంటె, గంధం కంటె, అగరునూనె కంటె, పూల కంటె సువాసనలు ఎగజిమ్ముతూ, అమృతధార కంటె సుఖానుభూతులిస్తారని పొగుడుతారేం వీళ్ళు ?

ఇక–పురాణాల్లో ధర్మాలే అనుసరించవలసిన ప్రమాణాలు అంటారా ? పరాశరుడు పాండవుల పట్టణంలో చాటుకవి. కవుల సంగతి వదిలెయ్యండి. మత్స్య పురాణంలో చేసే ఉపన్యాసం చేస్తుంది. ఇక మానవులందరూ పిట్టల, జంతువుల, జలచారాల నీతుల్నే పాటించాలన్న మాట !

సూర్యుని కుమారుడైన కర్ణుని తిత్తి ఒలిచేశారు. దధీచి ఎముకలే ఏరివేశారు. బలిచక్రవర్తి వంటి దానశీలుణ్ణి పాతాళంలో పాతి పెట్టారు. జీమూతవాహనుడి ప్రాణాలు తీశారు. శిబిచక్రవర్తిని మోసం చేశారు. పాలసముద్రాన్ని బీభత్సం చేశారు. చంద్రుణ్ణి మాంసంగా వండుకుని తినేవారు. ఇతరులకు వేరే నీతులూను వాళ్ళకు స్వార్థనీతులూనా ?

అన్ని కోరికలూ వదలి ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే వాళ్ళే చాలా మెరుగు. అయితే – వాళ్ళు స్వర్గానికి వెళ్ళి రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమల రమించవచ్చుననే ఆశలతోనే తపస్సు చేస్తే నమ్మకండి.

యుద్ధంలో చనిపోయినవాళ్ళంతా స్వర్గలోకానకి వెళతారనే మాట అబద్ధం. అదే నిజమైతే – విష్ణువు మొదలైన దేవతలతో యుద్ధం చేసిన రాక్షసులు చచ్చి స్వర్గానికి వెళితే, అక్కడ మళ్ళీ యుద్ధం చెయ్యరా ? మోక్షమనేది రాళ్ళమీద చెక్కిన ఒక మాట. అలాంటివి చదివి జీవితం పాడుచేసుకోవటం అమాయకుల పని.

ఉపవాసాలుండటం కడుపు మాడ్చుకోవటమే గాక ఆత్మవంచన కూడాను. అంతా భగవదేచ్ఛ అనడం నీరస దుర్బలత్వానికి చిహ్నం, ఋజువూను. మదికి తోచినట్లల్లా సుఖించడమే బోధిసత్వుని మతం !

తమకు ముక్కుమీదే కోపం ఉన్నా – విశ్వామిత్రాది మునులు ఇతరులకు శాంతిని బోధిస్తారు. బైరాగులు కొందరు నిరుపేదలుగా ఉండి కూడా – ఇతరులకు బంగారాన్ని సృష్టించే రససిద్ధి మంత్రం నేర్పుతామని మోసం చేస్తూంటారు.

శృతులలోమంత్రాలకు మూడేసి అర్థభాగాలున్నాయి. వాటిలో ఆర్థికాంశం తప్ప మరే అంశము మీకు అర్థం కాదు. అందువల్ల మీ సంపాదన,

సుఖాలను గురించే మీరు ప్రతిక్షణమూ ప్రయత్నించి అనుభవించడం మంచిది" అని వాదిస్తూంటారు కలిరాజు పరివారంలో అందరూను.

కలిరాజు వెంట ఉన్నవారు ఈ విధంగా వాదించడం వల్ల – జైనులకు సన్మానము, బౌద్ధులకు ప్రాబల్యము, చార్వాకులకు మద్దతు, లింగాయతులకు సంతోషము, పౌషండుల చెవులకు పండుగ, కాపాలికుల కుపకారము లభిస్తున్నవని ఇంద్రాగ్ని యమ వరుణులకు చాలా కోపం వచ్చింది.

ఆ నలుగురు దేవతలూ నాలుగువైపులకు తిరిగి "ఓరి దుర్మార్గులారా! మేము ఆయుధాలెత్తితే మీరు బ్రతకరు. యజ్ఞయాగాలవల్ల కలిగే పుణ్యఫలితాన్ని చూస్తూ వైదిక కర్మల్ని ఎగతాళి చేస్తున్నారేం ? శ్రాద్ధాలు కావాలని ఎదురు చూచే భూతాలను మీరు గమనించరేమి ? కొందరు పుణ్య వంతులు అగ్నిలో పడినా ఒళ్ళు కందడం లేదని, గుడ్డివాళ్ళకు చూపు వచ్చిందని – దేవతలిలాంటి వరాలు ఇస్తారని మీకు తెలిసి కూడా అధర్మ ప్రచారం చేస్తున్నారు గనుక మీ నాలుకలు కోస్తాం, చంపుతాం" అని బెదిరించారు.

ఆ దేవతల కోపాలు చూచి కలిరాజు పరివారం భయపడిపోయింది. "మీకు దణ్ణం పెడుతున్నాం. మేము కలిరాజు సేవకులం, భట్రాజులం, మేమిలా వాదిస్తేనేగాని ఆయన మెచ్చడు. వారికి సేవకులమైన మమ్మ శిక్షింపకండి" అని ప్రార్థించారు.

అంతలో కలిరాజే ముందుకు వచ్చాడు. అతని జెండామీద 'మాలకాకి' గుర్తుంది. అతడు నల్లని మనిషి. కాని అతని జుత్తు పొట్టిగా బిరుసుగా నుంచుంది. తలమధ్య చవిటిగుండు కనిపించకుండా కావిరంగు తలగుడ్డ చుట్టాడు. మొగలి ఆకుల గరిక వంటి గడ్డం. ఆ గడ్డం క్రిందికి జారి వక్షస్థలం మీద ఆనుతున్నట్లుంది. బండి ఇరుసుకు వేసే తారువంటి శరీరం. నీలిపంచె కట్టుకున్నాడు. సింధూరం బొట్టు నామాలు లాగా పెట్టుకున్నాడు. కోర మీసాలు, మిడిగుడ్లు, దొప్పచెవులు, గొగ్గిపళ్ళు, పొడవున్నా వంగి నడుస్తున్నాడు.

ప్రపంచానికి నాలుగవ యుగమయిన 'కలి'కి రాజైన అతన్ని చూచి అంటరాని మాలల్ని చూచిన ఉత్తమ బ్రాహ్మణుల్లాగా దేవతలు తలలు వంచుకున్నారు. ఇటు గురువు కోపానికీ, అటు దేవతల కోపానికీ గురయిన త్రిశంకునిలాగా – కలిరాజు దేవతల్ని చూడగానే తెల్లబోయాడు. భయంతో వణుకుతూ వాళ్ళకి నమస్కరించాడు. వార్ని నలుగుర్నీ పేరు పేరునా 'కుశలమా ?' అని అడిగాడు.

"మీ దర్శనం వల్ల నా కోప తాప మూర్ఖతలు తొలగిపోయాయి. అంతా మీ చలవే! నేను దమయంతీ స్వయంవరానికి వెడుతున్నా. ఆలస్యం కాకుండా శెలవిప్పించండి. నా కోరిక తీరేట్టు ఆశీర్వదించండి. దయమంతిని పెళ్ళి చేసుకుని ఆమెతో సహా వచ్చి మీ దర్శనం చేసుకుంటా"నంటూ నమస్కరించాడు.

ఈ మాటలు విని దేవత లొకరి మొహం ఒకరు చూచుకుంటూ, ఎగతాళిగా నవ్వుకున్నారు.

"కలిరాజా ! భలేవాడివయ్యా, దమయంతి పెళ్ళి మూడు లోకాల వారూ ఆనందించేట్టుగా ఎప్పుడో అయిపోయింది. మేం అక్కడనుంచే వస్తున్నాం, నాగుల్ని, దేవతల్ని గొప్ప గొప్ప రాజుల్ని వదిలి నలుడనే రాజును ఆమె వరించింది. అదే దేవుడు వ్రాసిపెట్టాడు. మనమేం చేస్తాం ? ఇక నువ్వు మాత్రం అటు వెళ్ళటం దేనికి – తిరిగి పద" అని కలిని హెచ్చరించారు.

దేవతల మాటలు వినేసరికి కలిరాజుకు కోపం ముంచుకొచ్చింది. "మీకేం తీపరమయ్యా ? మీకు పెళ్ళాలున్నారు, పైగా ఏకపత్నీ వ్రతమే ధర్మం పుణ్యం అని ఇతరులకు బోధిస్తూంటారు. మళ్ళీ దమయంతీ స్వయంవరానికి ఎందుకెళ్ళారయ్యా ? ఇతరులకి చెప్పడం తేలికేగాని – మీరు ఆచరించలేరన్న మాట నీతుల్ని ?" కలిరాజు ఎలాగో చెడ్డవాడనే పేరే సంపాదించుకున్నాడు గనుక – వెళ్ళినా కొత్తగా చెడేదేమీ లేదు.

'మీరు నీతీ, సిగ్గు వదలి వెళ్ళారా ? ఆ పిల్ల మిమ్మల్ని వరించలేదుగా! దమయంతి నలుని వరిస్తే – మీరు సిగ్గును వరించి దేబెమొహాలేసుకు వచ్చేస్తున్నారన్నమాట ! స్వయంవర సమయంలో దమయంతి మిమ్మల్ని ఓరకంట చూచి కూడా వరించకుండా ముందుకు వెడుతూంటే – ఎలా ఊరుకున్నారయ్యా ? అంత అవమానం ఎలా సహించారయ్యా ? చెయ్యిబట్టి లాక్కు రాలేకపోయారా ?

మీ అంతటి దేవతల్ని ఒదిలి, అదొక రాజును పెళ్ళి చేసుకుంటుంటే ఆ నలుడు మాత్రం చిన్నా పెద్దా అని ఎంచవద్దా ? అతడు ఆశపడ్డాడు పోనీ – ఈ అగ్ని వివాహ సమయంలో సాక్షిగా ఎందుకున్నాడయ్యా ? మీరంతా ఎంత మహానుభావులో – ఇంత అవమానం భరించి ఊరుకున్నారు. ఈ సంగతి వింటే నాకు తలకొట్టేసినంత సిగ్గుచేటుగా ఉంది. ఆ దమయంతిని మరిచేది లేదు.

మీకందరికీ ఒక్క మనవి చేస్తాను అనుగ్రహించండి. నేనెలా గయినా నలుణ్ణి మోసం చేసి ఆ పిల్లని ఈ లోకం ఎత్తుకు వచ్చేస్తా. మళ్ళీ మీరామెని దొంగచూపులు చూస్తూ ఆశపడరుగదా ? మీకు కోపం రాదు గదా ? అలాంటి లాభాన్ని చూస్తే ఎవరికయినా ఈర్ష్య, ప్రలోభం, రోషం పుడతాయి. అనాదిగా వస్తున్న ఈ గుణాలు మారవులే ! పోనీ ఇంకో ఉపాయం చెబుతాను. నేను దమయంతిని ఎత్తుకొచ్చిన తర్వాత మీరు నలుగురూ, నాతో అయిదుగురం కలిసి – పాండవులు ద్రౌపతిని చేసుకున్నట్టు ఆ పిల్లని పెళ్ళాడదాం!" అని నోరూరించుకుంటూ చెప్పాడు.

అతని లపటపు మాటలు విన్న దేవతలు ప్రలోభ పడకుండా "నలుడు గుణగణాల్లో, అందంలో, కీర్తిలో మా అంతవాడు. అతన్ని మెచ్చి, నిండు కొలువులో వారికి పెళ్ళి జరిపించాం. ఇప్పుడూ నీతి తప్పం. ఆమె మాకు కూతురు వంటిది. నలుడు మా అల్లుడే! కనుక నువ్వు చెప్పే మోహపు మాటలు,

కూటనీతులు మాకు నచ్చవని గ్రహించి, దమయంతిని ఎత్తుకు రావాలనే ప్రయత్నం మానుకో. రాహువనే పాము చంద్రుని మింగాలని పరుగెట్టినట్టు నువ్వు ఆ నలుణ్ణి భంగపుచ్చాలని వెళ్ళకు. జాగ్రత్తగా మసులుకో" మని హెచ్చరించారు. పైగా ద్వాపరయుగంలో కలి భూలోకానికి వెళ్ళరాదని నిషేధం కూడా పెట్టారు.

అయినా కలిరాజు తన మూర్ఖపు పట్టుదలను మానలేదు. "దేవతలారా! మీకు పదివేల దణ్ణాలు. నా మీద దయుంచండి. ఏదో కొంతకాలం భూలోకంలో సర్దాగా తిరిగి వస్తా ఆ లోకంలో ఏదో ఒక అధర్మం చేసేవాడు ఒక్కడన్నా నాకు కనిపించడటలే! అటువంటివాడి ద్వారా నలుని మీద అపవాదులు వేయిస్తా. ఆ నలుడిలో ఏ మాత్రం లోపం కనిపించినా అతణ్ణి పట్టేస్తా, పట్టి చచ్చేదాకా వదల్ను. నేను కొలిచే దేవతలు నా కా నలునిలో ఏదో ఒక నలుసంత దోషమైనా చూపించకపోరులెండి.

ఆవగింజంత సందుంటే తాటికాయలంత తప్పులని ప్రచారం చేస్తా. ఈ కలి తలుచుకున్నాడంటే ఈగ కాలంత తప్పయినా చూచీ చూడకుండా వదలడండీ! దాని అంతు చూడవలసిందే ననే పట్టుదలలో నా ముందు ఆ హరిహర బ్రహ్మలు కూడా సాటిరారు.

ఆ నలునిచేత కల్లు త్రాగిస్తా, జూదం ఆడిస్తా, వలలో వేసుకోండని వేశ్యల్ని ఎగదోలతా, ఆ దమయంతి మీద ప్రేమలేకుండా చేసేస్తాను. వెయ్యి మాటలెందుగ్గాని – మీ పాదాల సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను, ఆ దమయంతికీ భూలోకానికీ సంబంధం లేకుండా చేసి వస్తా" నన్నాడు.

'దైవలీల ఇతన్ని ఇలా ప్రేరేపించి పంపుతూండగా, మనం నీతులు చెప్పినా ఈ కలి వినడు. అనవసరం వాగ్వాదం. కాలయాపనా దేని' కనుకుంటూ దేవతలు స్వర్గానికి వెళ్ళిపోయారు.

# నిషధలో కలి ప్రవేశం

**క**లిమహారాజు తన పట్టుదలను ఎలాగైనా సాధించాలని భూలోకంలో ప్రవేశించాడు. కాని భూలోకంలో ప్రజలు, పరిస్థితులు, నలుని పాలన అతనికి అనుకూలంగా లేవు.

యజ్ఞగుండాల నుంచి లేచే వాసనకు భయపడుతూ, యాగశాలల నుంచి వచ్చే పొగలకు బాధపడుతూ, గృహస్తులు అతిథుల కాళ్ళు కడగటం వల్ల వాకిళ్ళలో కనిపించే తడికి వణుకుతూ, చన్నీళ్ళ స్నానాలు చూచి పడిశెం పట్టినట్లయి, సుగంధద్రవ్యాల వాసనలకు ముక్కుపుటాలు పొక్కగా, పశువుల పొదుగులు చూచి భయపడుతూ తిరుగుతున్నాడు. బ్రహ్మచారులకు, యతులకు, యాగాలు చేసేవారికి, వ్రతాలు ఆచరించేవారికి దూర దూరంగా తప్పుకు తిరగవలసి వస్తున్నది.

యజ్ఞశాలల్లో బలిపశువుల్ని కొరతవేసే ఊపస్తంభాలు చూచి శూలాలని భయపడుతూ, తిరునామాలను చూచి త్రిశూలాలని బెదురుతూ, బ్రహ్మచారుల జంధ్యాలు చూచి ఉరిత్రాళ్ళని బిక్కపోతూ, పౌరోహితుల జంధ్యాలు పాములని ఉలికిపడుతూ, అనుష్టాన సమయాల్లో బ్రాహ్మణులు నిలబడి చేతుల్లో ధారవోసే నీటిని శాపజలం అని ఆందోళన పడుతూ కలిరాజు ప్రాణాలరచేత పట్టుకుని తిరుగుతున్నాడు.

భూలోకంలో అందరూ భక్తిని, ధర్మాన్ని పాటిస్తూ చక్కగా ప్రవర్తిస్తున్నందు వల్ల కలికి దుర్భరంగా ఉంది. అతడు బౌద్ధుల్ని బంధువుగా చూస్తూ, చార్వాకులకు నమస్కరిస్తూ, జైనుల్ని చూచి సంతోషిస్తూ, లోకాయతులకు జేజేలు చెబుతూ, వితండులకు నమస్కరిస్తూ, పాషండులను పొగుడుతూ, కాపాలికులను సన్మానిస్తూ, దిగంబరులను పరిచయాలు చేసుకుంటూ కొంత ఊరట పొందుతున్నాడు. కాని శివభక్తుల విభూది గాలిలో కలిసి వచ్చి తనమీద

పడితే "అయ్యో! భూలోకమంతటా శివుని మూడోకంటి అగ్ని జ్వాలలే"నని గడగడ వణుకుతున్నాడు.

దైవభక్తులు తెల్లవారుజామునే లేచి భాగవత కథలు, భగవద్గీత పారాయణం చేస్తుంటే కలిరాజు చెవులకు ములుకులు తగిలినట్టు బాధపడుతున్నాడు.

కలిరాజు వీధులలో నడిచేప్పుడు – పతివ్రత ఎదురైతే దోవలోంచి తప్పుకుంటున్నాడు. సన్యాసి ఎదురైతే ఒక ప్రక్కకు తొలగి నుంచుంటున్నాడు. ఉపవాసవ్రతం చేస్తున్న స్త్రీ నీడను తొక్కబోయినా కాళ్ళు మెలికపడి కూలిపోతున్నాడు. యాచకులెదురైతే 'పగవారి దారిరా ఇది' అనుకుంటూ మరో దారికి వెడుతున్నాడు. అతనికి వైఖానసులంటే కసి, శ్రోత్రియులంటే ఎగతాళి,, సోమయాజులంటే మంట, అనుష్ఠాతంటే అసహ్యం.

కాని – కలిరాజుకు ఎక్కడ తిరిగినా, ఎందర్ని చూచినా 'పాప'మనేది ఆవగింజంతైనా కనిపించలేదు. మరో ఎత్తు వేద్దామని తన పరివారంలో ముఖ్యుల్నీ, తనంతటి వాళ్ళనీ ఒక అర్ధరాత్రివేళ సమావేశపరచాడు. "రంధ్రాన్వేషణం చేస్తేగాని తప్పులు కనిపించవు. కనుక మనమందరం జాగ్రత్తగా రంధ్రాన్వేషణ చెయ్యాలి. కాలక్రమాన గాని తప్పులు బైటపడవు. అంతవరకు ఓపిగ్గా మనం వేయికళ్ళతో అన్వేషిస్తూండాలి. ఇందుకు మనం బాధ్యతల్ని విభాగాలు చేసి పంచుకుందాం" అని చెప్పి వాళ్ళని ఒప్పించాడు.

"యోగిని, మాచకమ్మ, గొడ్రాలు, వ్రతాలు చేసే స్త్రీలు, వితంతవులు– మన్మథుని భాగం. పుణ్యతీర్థాలు సేవించేవారు, మాంత్రికులు, దాయాదులు, తర్కవాదులు – క్రోధుని భాగం. సోమయాజులు, శాస్త్రులు, గురువులు, విద్యార్థులు, విభూది పూసుకునే సన్యాసులు – లోభివంతు. బాల బాలికలు, వితండవాదులు, మూర్ఖులు, గర్విష్ఠులు, ఎప్పుడూ ముద్దులే కోరే వారూ –

మోహం వంతు. కేళీ గృహంలో హంసతూలికా తల్పంమీద, ఎప్పుడు చూచినా నవ వధువుతో ప్రేమకలాపాలు జరుపుతూ ఉంటున్న నలుడొక్కడే – నావంతు” అని భాగాలు ఏర్పాటు చేశాడు. ఎవరివంతు బాధ్యతలు వాళ్ళు నిర్వర్తించాలని చెప్పి పంపించేశాడు. ఎలుగుబంటి వంటి రథం ఎక్కి, దుర్మతిని సారథిగా నియమించి, నక్కల్ని గుర్రాలుగా కట్టి, కాకి గుర్తుగల జెండా ఎగురవేసి, ఎముకలు, పుర్రెలు ఆభరణాలుగా గల కింకిణి కాపలాతో కలిరాజు బయలుదేరాడు.

అలా కలిరాజు నిషధ రాజధానిలో ప్రవేశించి మసక చీకటివేళ ఎవరికీ కనుపించక నల్లని ముసుగు వేసుకుని దొడ్డి దోవలగుండా వెళుతున్నాడు. ఎవరూ నివసించని ఖాళీ యిళ్ళవాకిళ్ళలో కూర్చుని కొంచెం విశ్రాంతి తీసుకుని మళ్ళీ బయలుదేరుతున్నాడు. దేవాలయాలకు దూరంగా తొలుగుతూ, వేశ్యా మందిరాల పడగ్గదుల్లోగుండా నడుస్తూ, అక్కడ జరుగుతున్న పనులకు తృప్తిగా సంతోషిస్తూ, నలరాజు మందిరాన్ని చేరుకున్నాడు.

## కేళీమందిరం

**ఆ** రాజసౌధానికి అవతల నలుని కేళీమందిరం చలువరాళ్ళతో నిర్మింపబడి అందంగా ప్రకాశిస్తున్నది. ఆ కేళీమందిరం ప్రక్కనే నందన వనం వంటి పూలతోట, ఇతర వృక్షాలతో సహా ఉంది. దానిచుట్టూ రాతి గోడలు పహరా కాస్తున్నాయి. ఆ వనం మధ్యలో ఒక మంచినీటి కొలను ఉంది. ఆ కొలనులో తామరపూవులెన్నో ఉన్నాయి. ఆ కొలనుకు పడమటగా – అంటే కేళీమందిరానికి ఉత్తరంగా – గురువింద, గోరింట, బాడిద, ఖర్జూర, కేతకి వృక్షాల గుంపు వత్తుగా పెరిగి ఉంది. ఆ గుంపు మధ్యకు గాలి వెళ్ళేంత సందైనా లేదు. ఆ మధ్యలో ఒక తాటిచెట్టు పెరిగివుంది. కలిరాజు ఆ తాటిచెట్టు మొవ్వలోకి ఎక్కి కూర్చుని రంధ్రాన్వేషణ చేయసాగాడు.

కేళీమందరం, ఆ ప్రాంతం కూడా కన్నుల పండువగా ఉన్నాయి. ఒకచోట పూలపందిరి, ఒకచోట చలువచప్పరం, మరొకచోట ఊయల, వేరొకచోట గిలిగిలిమంచం. ఇంకొకచోట కర్పూరపు రాసులు.

ఒకచోట సాలభంజిక (గంధర్వ స్త్రీ ప్రతిమ) చేతులతో చక్కని పాత్ర పట్టుకు నుంచుంది. ఒక గోడమూలలో దాగి ఒక యువతి పాడుతున్నది. ఒకచోట జలయంత్రం నీటిని ధారలుగా పైకెగరబోస్తూ తుంపరలు మేఘాలు సృష్టిస్తున్నది. ఒక చలువరాళ్ళ మండపంలో పగలు కూడా చంద్రుడూ, నక్షత్రాలూ కనిపిస్తాయి. కొన్ని చోట్ల పంజరాల్లోని చిలుకలు ప్రణయశాస్త్ర విశేషాలు వల్లిస్తున్నాయి.

రతీ మన్మథుల అంగాంగకాలను మరిపించే అందాలతో నగ్నదంపతుల క్రీడాదృశ్యాలెన్నో శిల్పాలుగా అక్కడక్కడా నిలిచివున్నాయి. గోడలమీద, స్తంభాలమీద అనేక రకాల కామకేళీ చిత్రాలు కూడా ఉన్నాయి.

దేవేంద్రుడు గౌతముని రూపంలో అహల్యను అనుభవించడం, చంద్రుడు బృహస్పతి భార్యమీద కన్నువేస్తే, ఆమె కళ్ళతోనే అతన్ని రమించడం, నదిలోని పడవమీద మత్స్యగంధిని పరాశరుడు కామించడం, బ్రహ్మ తాను సృష్టించిన కూతురు (సరస్వతి) మీదనే మరులతో చూడ్డం, దారుకావనంలో శివ పార్వతులు ప్రణయకేళీ, కృష్ణుడు గోపికలతో జరిపిన రాసక్రీడలు ఇలాంటి చిత్రాలు లెక్కలేనన్ని ఉన్నాయి ఆ మందిరంలో

ఘోరతపస్సు చేసి సాధించిన పుణ్యం ఫలితంగా జీవితమనే సముద్రాన్ని దాటి మోక్షలోకానికి వెళుతున్న మునులు – మాయా మోహినుల చనులనే శిఖరాలను చూచి, తమకంతో వెనక్కి తిరుగుతున్నట్టున్న చిత్రాలను దూలాల మీద చిత్రించారు.

ఏ తలుపు తెరిచినా కస్తూరీ సువాసనలు బైటికి వస్తున్నాయి. గాజు కుప్పెలలో సుంగంధధూపాలు లేస్తున్నాయి. అక్కడక్కడా అతి సన్నని పట్టుతెరలు జిలుగుల అందాలతో అమర్చి వున్నాయి. ఆ మందిరంలో ద్వారాలకు, కిటికీలకు పై అంచులు గల కొయ్యపలకల మీద కామకేళికి సంబంధించిన రహస్యాలు, పద్ధతులు, హాస్యలు, కథలు తెలిపే శ్లోకాలు చెక్కబడి ఉన్నాయి. వాటిని ప్రౌఢకాంతలు తప్ప ఇతరులు చదివి విరహాన్ని భరించలేరు.

## నలదమయంతుల విహారం

అలాంటి మందిరంలో నుంచి నలుడు, దమయంతి రతీమన్మథుల్లాగా పై అంతస్తుమీదికి ఎక్కారు. చుట్టూ అనేకచోట్ల వెలుగుతున్న దీపాలనుంచి వచ్చే సువాసనలు ఎలాంటివారికైనా కామకేళికి పురికొల్పేట్టున్నాయి.

ఆ నవదంపతులు ఒకరి నొకరు కౌగిలించుకున్నంత మమైకంగా మెల్లగా తిరుగుతూ, అంతవరకూ జరిగిన తమ విరహగాథాంశలను గుర్తు చేసుకుంటున్నారు. "ముందు మీరేగా - - రాజహంసతో రాయభారం పంపించారూ ? మీరే తొందరపడ్డారులే" అంది ఆమె. "అందుకనే గాబోలు - నేనే రాయబారిగా వచ్చినప్పుడు పెద్ద సింహాసనంమీద నుంచి దిగకుండా బెట్టుగా మాట్లాడావు!" అని నలుడు దెప్పాడు.

దమయంతి ‘‘మీరు మాత్రం మాటకు మాట చమత్కారంగా అంటించలేదా ఏం ? ఎంత గడుసువారు! ఎన్నిసార్లడిగినా పేరే చెప్పకుండా నన్ను ఏడ్పించారుగా" అంటే ; అతడు "నీ గడుసుతనమేనా తక్కువ? దేవేంద్రుని అంతటివాడి మాయావేషాన్ని కనిపెట్టి ఓడించి, నా కోసం ఇదంతా ముడుపు గట్టానన్నావుగా!" అంటూ చెక్కిలిపై గిలిగింతలయ్యేట్టు ముద్దు పెట్టుకున్నాడు. ఒకరినొకరు మనసారా మెచ్చుకోవడమే గాని, ఎగతాళి కాదీ దెప్పుళ్ళు అని గ్రహించిన దమయంతి సిగ్గుపడ్డానికి సిగ్గుపడి అతని కంటె తమకముతో గట్టిగా ముద్దుపెట్టుకుంది.

ఎన్నో వేలసార్లు కలల్లో కౌగిలించుకున్నారు. ఎన్నో లక్షలసార్లు మనసుల్లో ఒకరి అందాలొకరు చూచుకున్నారు. కోటి ముఖాలుగా మనసులు కోరిక లూరిస్తున్నాయి. ఇంక సిగ్గుపడితే ఏం లాభం ? తనివిదీరా అనుభవించడానికే గదా ఈ కేళీమందిరం. ఈ రాత్రులు, ఈ అందాలు, ఈ జీవితాలు !

అసలు – స్త్రీల హృదయాల్ని తెలుసుకోవటం ఎవరి తరమూ కాదు, ఒక్కోసారి ఉక్కుకంటె కఠినంగా, మరొక్కోసారి పూలకంటే లలితంగా ప్రవర్తిస్తుంటారు. అందువల్ల వాళ్ళకి లజ్జా భయాలున్నవో లేవో చెప్పలేం.

ఆ దంపతులు మళ్ళీ మంచం ఉన్న గదిలోకి వెళ్ళారు. ఆ మంచం కళాత్మకంగా ఉంది. తెల్లని దుప్పటి ప్రక్కమీద పరచబడి ఉంది. మంచం కోళ్ళు కదలకుండా శిలల్లో బంధించబడి ఉన్నాయి.. బంగారు పాత్రల్లో చుట్టూ సుగంధ ద్రవ్యాలు, పళ్ళు, పళ్ళరసాలు, అగరుధూపాలు, తాంబూలాలు, నిలువుదట్టాలు, విసనకర్రలు, గాజుగోళాల్లో వెలిగే దీపాలు చక్కగా అమర్చి ఉన్నాయి. పడకమంచం చుట్టూ పూలమాలలు తెరల్లా వ్రేలాడుతున్నాయి.

ఆ పాన్పు దగ్గరకంటా వచ్చిన తరువాత దమయంతికి సిగ్గు ముంచుకొచ్చింది. తల వంచుకుని, ముసిముసిగా నవ్వుతూ, కాలి బొటన వ్రేలితో నేలను గీస్తూ నుంచుంది. నలుని హృదయం పులకరిస్తున్నది. ఆమెను రెండు చేతులా పట్టుకుని మెల్లగా పూలపాన్పు ఎక్కించి, పైటను లాగివేస్తూనే కౌగిలిలో బంధించివేశాడు. ఆమె నలునంత పొడవు లేదు. అందువల్ల తాను నడుం పైకి వంచి అధరామృతం సేవించాడు.

“కంఠహారాలు చాలా అందంగా ఉన్నాయి. ఏవీ, సరిగ్గా చూడనేలేదు” అంటూ – ఆ సాకుతో వక్షస్తలం వరకూ చేతులు పోనిచ్చి, హఠాత్తుగా కుచద్వయాన్ని బంధించి, కొనగోళ్ళతో మెనలు గీస్తూ ఆమెలో పులకాంకురాలు పుట్టించాడు.

దమయంతి పైట చెంగుతో గాలిని తోలినా ఆ ప్రక్కనున్న దీపాలు ఆరలేదు. నలుడు ఒక మీటను నొక్కేసరికి అన్ని దీపాలూ ఆరిపోయాయి. మళ్ళీ కొంచెం సేపటికి అన్నీ ఒకేసారి వెలిగాయి. నలుడు తనతోనూ, ఆ దీపాలు ఆర్పి వెలిగించటతోను ఆడుకుంటూంటే ఆమెకు అద్భుతాసక్తి, సిగ్గు, ఆనందం, పరవశత్వం కలుగుతున్నాయి. అతని చిలిపి చేతులు ఆడుకోని స్థలం ఆమె శరీరంలో ఎక్కడా లేదు! ఆమె ఆనందించని అంశమూ లేదు!

వారిద్దరూ గాఢంగా ముద్దులు పెట్టుకునేటప్పుడు ఒకరి పళ్ళు మరొకరి పెదవుల్ని సూక్ష్మంగా గాయపరుస్తున్నాయి. ఆ బాధ – పానకంలో మిరియాల పొడిలాగా అధరామృతపు రుచిని మరింత పెంపొందిస్తున్నది. ఒకరి కొకరు, ఒకరిలో ఒకరు సంతోషానందాతిరేక అమృతాన్ని ప్రవహింప చేసుకుంటూ – చూచినదే చూస్తూ, చేసిన పనే మళ్ళీ మళ్ళీ చేస్తూ సుదీర్ఘంగా అనుభూతులు పొందుతున్నారు. ఒకరిలో ఒకరు లీనమైపోతున్నారు. సమానంగా తృప్తి పొందుతున్నారు.

ముంగురులు, ముడిరేగిన జుత్తు, చెమట బిందువులు పరస్పరం సవరించుకుంటూ అలసట తీర్చుకుంటూంటే మళ్ళీ శరీరాలు మొగ్గతొడిగి జలజల వికసిస్తున్నట్టు పులకరిస్తున్నాయి. తృప్తిలేదు, తృప్తి కలుగుతూంది – ఈ రెంటిమధ్యా మరొక రసానందస్థాయి ఉంది. ఆ స్థాయిలోనే తమ శరీరాలు, హృదయాలూ శాశ్వతంగా ఉండిపోతే బాగుండును! అదేనేమో మోక్షం, స్వర్గం! ఆహా – క్షణక్షణం కొత్త రుచులే!

మన్మథుడు ఆ దంపతుల మీద ఎడతెగకుండా విసురుతున్న బాణాలకు ఆకట్టుగా కోళ్ళు కూశాయి. రాజాస్థాన వైతాళికులు గుమ్మంలోకి వచ్చి మేలుకొలుపులు పాడ నారంభించారు.

ఆ సమయంలో నలుని నొసట తన పాదాలపారాణి అంటుకుని ఉండడం దమయంతి చూచింది. ఆమెకు ఫక్కున నవ్వు వచ్చింది. కాని –

పద్మినీజాతి స్త్రీలు తెల్లని పళ్ళకింద గురువింద రంగులో ఉండే చిగుళ్ళు ఎదుటివారికి కనిపించేట్టు నవ్వరు. ఆమె అలవోకగా నవ్వుతూ మొహం అటు తిప్పుకుంది. నలుడు "ఏమిటి – అంత నవ్వు వస్తున్నది నీకు ? బెట్టు చేసి నా చేత పాదాలకు మొక్కించుకున్నావనేనా ? నేను అంత ప్రాధేయ పడినందుకా ఈ నవ్వు ?" అని అడిగాడు. ఆమె చేతి అద్దం ఒకటి అతని చేతికిచ్చింది.

నలుడు అద్దంలో చూచుకుని ఆ కంకుమ లత్తుకను ఆమె తొడల మీదే తుడుచుకున్నాడు. ఆమె దిగ్గున లేచి, అతన్ని కూర్చోబెట్టి, వీపు వెనుకకు వెళ్ళి, అతని జుత్తు చిక్కు తీస్తున్నది. ఆమె చనుమొనలు తగిలి అతని వీపు జలదరించింది. "అటుకాదు ఇటు" అని అతడు ఎకసక్కెం ఆడేసరికి ఆమె అలుకగా మంచం దిగి అవతలకి వెళ్ళిపోయింది.

## సుప్రభాతము

వైతాళికులు సూర్యోదయ వేళను వర్ణిస్తూ మేలుకొలుపు పాడుతున్నారు.

"చంద్రవంశసంభవా, నిషధరాజా! చంద్రుడు సముద్రకన్యను చేర వెళ్ళాడు. చుక్కలు సహగమనం చేస్తున్నాయి. సూర్యోదయం కావస్తున్నది. మీరు కళ్ళు తెరవగానే శుభశకున దృశ్యాలు కనుపిస్తాయి. దమయంతీ సమేతంగా నిద్ర లేవండి స్వామీ.

అదుగో – సూర్యుని మొదటి కిరణం మేఘాల చీకటిని పారద్రోలు తున్నది. పక్షులు కిలకిలా రావాలతో లేచి మేతలకు బయలుదేరుతున్నాయి. పద్మాలు ప్రియుని రాకకోసం అరమోడ్పు కన్నులతో చూస్తున్నాయి. ఉదయాద్రి ఎర్రనవుతూంది. తుమ్మెదలు రెక్కలు విప్పుకుంటున్నాయి.

తూర్పు దిక్కంతా కుంకుమ చల్లినట్లుంది. సూర్యుడు పైకెక్కుతున్నాడు. వెలుగు దశదిశలా ప్రాకింది. తుమ్మెదలు వికసించిన పూలమీద వాలి తేనెలు

జుర్రుకుంటున్నాయి. గరికపోచల మీది మంచు బిందువులు ముత్యాలలా ఉన్నాయి. వాటిమీద సూర్యరశ్మి పడి ఇంద్రధనుస్సులు తళ తళ మంటున్నాయి. కోయిలలు మనోహరంగా పాడుతున్నాయి."

## సంధ్యావందనం

**ద**మయంతి వెలలేని ఆభరణాలను ఒక పరిచారికతో వైతాళికులకు బహుమతులుగా పంపించింది. నలుడు ముంగిలిలోకి వచ్చి మామగారు కన్యాదాన సమయంలో తనకిచ్చిన శివప్రసాద రథాన్ని తలచుకున్నాడు. వెంటనే ఆ రథం ముంగిట ప్రత్యక్షమైంది.

నలుడా రథం ఎక్కి గరుడవాహన మెక్కిన విష్ణువులాగా ఠీవిగా, ఉదయ స్నానం చెయ్యడానికి ఒక మహానదికి వెళ్ళాడు. ఆ నదివద్ద ఒక మంచి రేవులో మెట్లు దిగి పంచాంగం చదివి, తలారా స్నానం చేశాడు.

స్నానానంతరం దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు వదిలి సంధ్యావందన మంత్రాలు స్మరించాడు. గాయత్రి పఠించాడు. ఒడ్డున ఉన్న ఇసుకతో శివలింగాన్ని చేసి బంగారుపూలతో పూజించాడు. ఆకాశంలో మునులైన నక్షత్రాలకు నమస్కరించాడు.

మళ్ళీ ఆ దైవరథం ఎక్కి ఆకాశమార్గంలో, నగరసౌధాలు దాటి, తన కేళీగృహం పక్క రథాన్ని దింపి తాను దిగుతున్నాడు. అప్పటికి కాలకృత్యాలు తీర్చుకుని సర్వాంగసుందరంగా అలంకరించుకున్న దమయంతి చిరునవ్వులతో ఎదురు వచ్చి స్వాగతం చెప్పింది.

## సయ్యాటలు

**త**నకు స్వాగతమిస్తున్న భార్యకు నలుడు నదినుంచి తెచ్చిన బంగారు పద్మాన్ని బహూకరించాడు. భర్త ఇంత ప్రేమతో పూవు తెచ్చి

ఇచ్చినందుకు ఆమె ముఖపద్మం ఎంతో వికసించి నవ్వింది. అప్పుడామె సాక్షాత్తు లక్ష్మీదేవిలా ఉంది.

నలుడు క్రీగంట భార్యను చూస్తూనే అగ్నిగుండం వద్దకు వెళ్ళి, అగ్నిదేవుని పూజించాడు. ఇవన్నీ గమనిస్తున్న కలిరాజుకు ఆవగింజంతలో ఏమైనా కనిపించడంలేదు. పగటి నిద్ర అలవాటైన అతడు ఎక్కడో విశ్రమించాడు.

అగ్నిపూజలైన తరువాత ఆ నవదంపతులు కేళీవనంలో విహరిస్తున్నారు. వెంట దాసీజనం కూడా ఉన్నారు. అందువల్ల భార్యకేదో సైగ చేస్తూ నలుడు ఆమె పాదాన్ని మెత్తగా తొక్కాడు. ఆమె చూచీ చూడనట్లు ప్రక్కకు తిరిగి చెలికత్తెలనే చూస్తున్నది.

నలుడక్కడే నిలచినా ఆమె ముందుకు నడచిపోతున్నది. ఒక్క క్షణం చూచి అతడు పరుగున వెళ్ళి ఆమె కళ్ళను రెండు చేతులా మూసివేశాడు. చలికత్తెలందర్నీ వెళ్ళిపొండని కళ్ళతో ఆజ్ఞాపించాడు. వాళ్ళు వెళ్ళిపోతుంటే కళావతి అనే చిన్నది మాత్రం వెనక్కి తిరిగి తిరిగి చూస్తున్నది. నలుడా దాసీని కళ్ళతోనే పిలిచి, దాని చేతులు పట్టుకుని దమయంతి కళ్ళను మూసి, తన చేతులు తీసివేసి దూరంగా వెళ్ళాడు. "ఎవరో చెప్పుకో" అని కేకవేశాడు.

అంతవరకూ తన కళ్ళు మూసిన చేతులు తనకు శరీరమంతటా పులకరింతలు సృష్టించాయి. ఇప్పుడు కళ్ళమీదున్న చేతులు చల్లగా ఉన్నాయి. దమయంతి పరహస్తాల్ని దూరంగా తోసివేసి, దొంగలాగా దగ్గరికి వస్తున్న భర్తను కోపంగా, ధుమధుమలాడుతూ చూచింది. నలుడు బిగ్గరగా నవ్వాడు. ఆమె అలిగినట్లు పెడమొహం పెట్టి ముందుకు వెళ్ళిపోతున్నది. వెంట వస్తున్న కళావతిని తన జడతో కొట్టబోయేసరికి, అది భయపడి పారిపోయింది.

భార్య తనమీద అలిగిందని గ్రహించిన నలుడు ఆమెను సరసాలతో నవ్వించాలని ప్రయత్నించాడు. కాని – ఆమె మూతి ముడుచుకుని మౌనంగా

ఉండిపోయింది. "రాత్రి మన్మథుని సాక్షిగా నీ పాదాలకు మ్రొక్కాను. ఇప్పుడే సకల దేవతలనూ పూజించి వచ్చిన నేను ఈ తడితలతో ఇక్కడే నీ పాదాలకు మళ్ళీ మ్రొక్కుతాను – ఒక్కసారి నా వంక చూడవూ" అని బ్రతిమాలాడు. "అయినా నీ అలుక లేత ఎండలాగా అందంగానే ఉందిలే" అన్నాడు. "లేతాకుల్లా ఉండే నీ పెదవుల్ని అట్లా బిగించుకుంటే గంట్లుపడి పాడవుతున్నాయి సుమా" అని హెచ్చరించాడు. ఆమె పలకలేదు.

"పలికితే నోటి ముత్యాలు రాలిపోవులే. దయతో ఒక్క మాటైనా చెప్పుదూ" అన్నాడు. "నీ దాసుణ్ణిగదా, ఒక్క దణ్ణంతో నన్ను క్షమించి, చల్లగా చూచి కౌగిలించరాదా'" అన్నాడు. ''నా మనసులో ఏవేవో భావాలు తొందరచేస్తున్నాయి. ఇక ఆగలే"నంటూ ఆమెను బలవంతంగా కౌగలించుకుని – కేళీగృహంలోని మంచం దగ్గరకు ఎత్తుకుపోయాడు.

దమయంతిని ఆ తల్పంమీద పడుకోబెట్టి – కళావతి అనే చిన్నదాన్ని పిలిచాడు. తాను మంచం పట్టెమీద కూర్చుని ఆ పిల్లతో సంభాషణ ప్రారంభించాడు. అది తన సోదరి దాసీకి కూతురు గనుక అతనికి చనువెక్కువ.

"ఈ విదర్భరాజు కూతురు పరపురుషుల్ని మనసులోనైనా తలచదని కోతలు కోశావు. మరి మన్మథుణ్ణి ఎందుకు మనసులోనే ఉంచుకుందో ?" అని ఎగతాళిగా అడిగాడు. ఆ కళావతి చాతుర్యంలో తక్కువది కాదు. "మన్మథుడు మీ ఛాయమాత్రమే. మా దేవి మనసులో ఉన్నది మీ రొక్కరే. అసలు శరీరమే లేని మన్మథునికి రూపం ఏమిటి ? మీ రూపం ప్రతిబింబంలాగా ఉంటాడేమో మన్మథుడు!" అంది.

నలుడు నవ్వుతూ ! "ఈమె మిమ్మల్నందర్నీ పెద్ద పెద్ద కళ్ళతో సూటిగా చూస్తుంది. నన్ను అరమోడ్పు కళ్ళతోనైనా సరిగా చూడదు. నేనేం పాపం చేశానో ?" అని అడిగాడు. ఆ పిల్ల ! "రాజా ! ఆడవాళ్ళు కళ్ళారా చూస్తే మీ

అందానికి దిష్టి తగులుతుంది. అందుకని సగం చూపులే చూస్తుంది మా దేవి! మరి మీ శరీరం కందితే ఆమె మనసే కందుతుంది కదా" అంది.

"ఈమె నిన్ను మాటి మాటికీ 'కలికీ' అని పిలుస్తుంది. 'కళావతి' కంటె 'కలికీ' తక్కువ అక్షరాలే. అంతకంటె రెండక్షరాలతో ఉన్న 'నల' అని పిలవగూడదా ? నా పేరును పలకడమే భారంగా ఉందా ?" అని నిష్ఠూరంగా అడిగాడు. ఆ పిల్ల "మా దేవి నిత్యం జపంలాగా చనుమొనలలో ఒకటి 'న' రెండవది 'ల' రుద్రాక్షలనుకుంటూ మీ పేరునే ఉచ్చరిస్తూంటుంది. ఇంక పిలవటానికి భారమేముందీ!" అంది.

నలరా జా పిల్లమాటలకు సంతోషిస్తూ "అది సరేగాని – మీ దేవి ఈ పూట మాతో పలకడమేలేదు. నీవామె మనసులోని మాట తెలుసుకుని, మాకు తెలియజెయ్యి –అప్పుడు తెలుస్తుంది నీ నెరజాణతనం!" అని పురికొల్పాడు.

కళావతి రాజుగార్ని ఎలాగైనా మెప్పించాలనే పట్టుదలతో దమయంతి వద్దకు వెళ్ళి 'అషడక్షీణ' మంత్ర ప్రభావంతో అసలు విషయం తెలుసుకుంది. దేవితో సరసాలాడుతూ ! "నాకంతా తెలిసిందిలే! వాత్సాయనాది ప్రణయ సూత్రాల రహస్యాలన్నీ నేర్చిన జాణతనంతో, అంతకంటె పండితుడైన నీ భర్తను అనేక రకాల రతి సుఖాలతో ఆనందపరచి – అవే తలచుకుంటున్నావు కదూ!" అంది. దమయంతి సిగ్గుచేరిన అలకతో ఆ చెలికత్తెను చెక్కిలిమీద సరసంగా కొట్టింది. పైగా కనుబొమలు ముడిచి కోపంగా చూచింది.

కళావతి దేవిమీద అలిగినట్టు నటిస్తూ "ఈ కళలన్నీ నేర్పిన గురువునైన నాకే నీ అనుభవాలు చెప్పవు కదూ! నా నేర్పుతో నీ మగనిచేతనే చెప్పించుకుంటాను చూసుకో" అని బెదిరించింది.

మళ్ళీ నలునితో "రాజా! ఈమె ఆలోచనలు మన ఆలోచనల్లా ఉండవు. ఆ ఆలోచనలకు దర్భగడ్డి ఆకుల్లాగా రెండువైపులా పదునే. మనం కుర్రదనుకుంటున్నాం గాని తెలివితేటల్లో ప్రౌఢ సుమా! ప్రణయ కోపాలు

ప్రేమ లీలాసక్తులను పెంపొందించే ఔషధాలవంటివి. అప్పుడప్పుడూ అలక్క పోతే స్త్రీలు భర్తలను నూతనంగా ఆకర్షించలేరు. ఆ అలుకలు మరీ ఎక్కువైతే విరసంగా ప్రేమనే నాశనం చేస్తాయి. ఈ మాటే ఆమెతో చెప్పి - మీకు బదులుగా నేను నమస్కారం చెయ్యబోతే కాలితో తన్నారు దేవిగారు. తంతే తన్నారుగాని అసలు విషయం తెలిసింది.

మీరు నిజంగా నలరాజులో, దేవేంద్రుడో ననే అనుమానంతో దేవిగారు మౌనంగా ఉంటున్నారు. దేవేంద్రుడు కాక మరెవరైనా బంగారు పద్మం తెచ్చి భార్యకివ్వగలరా అని అంటున్నారు. దేవేంద్రుడు ఇంద్ర జాల విద్య గలవాడు. ఏ మాయవేషమైనా వేయగలడు. నలుని వేషంలోనే వచ్చాడేమో. స్వయంవర సమయంలో అలాగే వచ్చాడు గదా ? మీవంక చూస్తే - దేవేంద్రనివలె భుజాలూ, వజ్రశరీరం, సమ్మోహనశక్తి కనుపిస్తున్నాయి. కనుక మీరు నలుడో, దేవేంద్రుడో గుర్తించలేక సందేహించవలసి వచ్చింది.

పైగా దేవేంద్రుడు అందమయిన స్త్రీలను చెరచడానికి ఎలాంటి వేషాలు వేశాడో లోకాలకన్నింటికీ తెలుసుగా ? గౌతమాశ్రమానికి వెళ్ళి కోడిపుంజు వేషంలో కొక్కొరోకోమని కూయలేదా, మళ్ళీ ఆ ముని వేషంలో అహల్యను వంచించలేదా ?

ఈ సందేహం తీరాలంటే మీరు నిజంగా నలుడేనని రుజూ చేసుకోవాలి. రతిక్రీడలు జరిగిన రీతులు ఏ దేవతలకూ తెలియవు. కనుక మీరు రాత్రి జరిపిన క్రీడా రహస్యాల్ని దేవిగారికి గుర్తుచేస్తే మిమ్మల్ని నమ్ముతుంది. లేకపోతే దేవేంద్రుడి మాయవేషమే అనుకుంటుంది." అని పెద్ద ఎత్తు వేసింది.

నలుడు ముసిముసి నవ్వులతో దమయంతిని చూస్తూ రాత్రి జరిగిన క్రీడా విశేషాల్లో కొన్నింటిని గుర్తుచేయసాగాడు.

"ఒకసారి క్రీడించిన తర్వాత విశ్రాంతి తీసుకుని, మళ్ళీ సయ్యాటలకు త్వరగా ఉత్సాహం చూపలేని నిన్ను 'మంచుగడ్డవా' అని ఎగతాళి చేశాను గుర్తులేదా?"

నువ్వు పాన్పుమీద దొంగనిద్ర నటిస్తుంటే – నేను నీ బొడ్డులో వేలుపెట్టి గిలిగింతలు సృష్టించాను. అప్పుడు నువ్వు పద్మంలా వికసించావు – మర్చిపోయావా ?

క్రీడా సందర్భంలో చెమటపట్టి కస్తూరిబొట్టు కొంత కరిగి, చెక్కిళ్ళు కంటా కారుతూంటే నేను నా హారంలోని రత్నంలో నీ ప్రతిబింబాన్ని చూపించాను గదా ?

ముత్తయిదువుల ఎదుట నువ్వు నాకు తమలపాకులు అందిస్తూ – మధ్యలో సరసానికి నీ చేతి తోరణపు మావిడాకుకు ఈనె తీసి చుట్టి ఇచ్చావు. నేను నీ చేతిని గోటితో గిచ్చేశాను, గుర్తు లేదా ?

భోజనం చేసేప్పుడు నీవు వడ్డించే ఆవుపాలు, తేనె, మీగడ, పంచదార, పానకాలను మెచ్చుకోను. వాటిని పొగిడితే నీ అధరామృతం రుచిని మరిచానని నీ పెదవులు కోపించి నన్ను బాధిస్తాయనే గదూ ?

మోమునుంచి నాభివరకూ నీ శరీరంలో నేను  ముద్దు పెట్టుకోని స్థలం వీసమైనా లేదు. చివరిసారి ముద్దు పెట్టుకునేప్పుడు చక్కలిగింతలు పెట్టాను గదా ?"

ఈ విధంగా భోగించిన రహస్యాలను కూడా ఆయన చెబుతుంటే దమయంతి వాలుగన్నులతోనే "ఇక చాలులెండి – ఆపండి" అన్నట్టు వారించింది. అతడింకా రహస్యాలు చెబుతుంటే మూడో వ్యక్తి వినడం ఇష్టం లేనట్టు కళావతి చెవుల్ని దేవి చేతులతో మూసివేసింది.

ఆ కళావతి "రాజా! ఈమె చేతులు నా చెవులమీద ఇంకొంచెం సేపుంటే కందిపోతాయేమో. ఈమె అతి సుకుమారిగదా, మీరు వచ్చి ఆ చేతులను

కాపాడుకోండి. మీకు శ్రమైనా తప్పదు" అని చమత్కరించింది. నలుడు "మంచి మాట చెప్పావు – నీ మాట వినవలసిందే" నంటూ, దమయంతి చేతుల్ని బలవంతంగా తనవైపు లాక్కున్నాడు.

ఇదే సందని కళావతి పారిపోయింది. నలుడు దమయంతిని గట్టిగా కౌగిలించుకుని మంచం మీద పడుకోబెట్టి, అద్దాల్లాంటి చెక్కిళ్ళమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమెకూడా తగు విధంగా జవాబిచ్చింది.

ఆ సమయంలో వైతాళికులు మధ్యాహ్న వేళ అయిందని, ఎన్నో పూజలు జరుపవలసిందని నలునికి గుర్తు చేస్తూ దూరం నుంచి హెచ్చరించారు.

## నలుని పూజలు

**న**లుడు స్నానశాలకు వెళ్ళాడు. దాసీజనం అగరు నూనెలు పూసి, సుగంధద్రవ్యాలతో నలుగుపెట్టి, పన్నీటితో స్నానం చేయించారు. బ్రాహ్మణులు తగు మంత్రాలు పఠించారు.

పరిచారికలు ఆయనకు పట్టుబట్టలు కట్టి తగు అలంకారాలన్నీ చేసిన తర్వాత – నలుడు శివపూజ, హరిపూజ భక్తితో చేశాడు. శ్రీహరిని స్తుతించాడు. దశావతారాలను కీర్తించే శ్లోకాలు వల్లిస్తూ కలిరాజును కూడా భక్తితో వశం చేసుకున్నాడు. అందువల్ల కలిరాజు తన కిక ఆ దేశంలో స్థానం లేదని నిరాశతో వెళ్ళిపోయాడు.

దేవతార్చనానంతరం భోంచేసి – మళ్ళీ కేళీమందిరంలో ప్రవేశించిన నలునికి దమయంతి తాంబూలం స్వయంగా నోటికందించింది. మళ్ళీ సరసాలు, ప్రేమ లీలలతో చాలాసేపు గడిపారు.

ఆ దంపతులు అనురాగంతో, విశాల రాజ్య సంపదలతో చాలా కాలం ప్రజలను సుఖపెట్టారు.

– సంపూర్ణం –


మనుచరిత్ర
వసుచరిత్ర
ఆముక్తమాల్యద
కళాపూర్ణోదయం
శృంగారనైషధం
కుమార సంభవం
శృంగార శాకుంతలం
విజయ విలాసము
కాదంబరి
రఘువంశం
మేఘసందేశం
కాశీఖండం
క్షేత్రయ్య పదాలు
జయంతి
పబ్లికేషన్స్
కళలు